సోమవారం 30-1-2023

సత్యమేవ జయతే

సాక్షి



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 135

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఏఎస్సై కాల్పుల్లో ఒడిశా మంత్రి మృతి



ఒడిశా మంత్రి నవ కిశోర్ దాస్ ఓ ఏఎస్సై జరిపిన కాల్పుల్లో మరణించారు. ఈ ఘటనపై ఆ రాష్ట్ర సీఎం నవీన్‌పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 6లో ▸

పాకిస్తాన్‌లో 42 మంది సజీవ దహనం



పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో బస్సు లోయలో పడి మంటలు చెలరేగడంతో 42 మంది సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు చెప్పారు.

వివరాలు 6లో ▸

మన అమ్మాయిలదే ప్రపంచం

తొలి అండర్–19 మహిళల టి20 వరల్డ్‌కప్ విజేతగా భారత్

ఫైనల్‌లో 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం

సత్తా చాటిన తెలుగు అమ్మాయి గొంగడి త్రిష

మన అమ్మాయిలు కొత్త చరిత్ర లిఖించారు. మొదటి ప్రయత్నంలోనే శిఖరాన నిలిచారు. తొలిసారి నిర్వహించిన మహిళల అండర్‌–19 టి20 క్రికెట్‌లో విశ్వవిజేతగా నిలిచారు. 16 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ జట్టు 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టిటాస్ సాధు, అర్చన, పార్శవి ధాటికి ఇంగ్లండ్ 17.1 ఓవర్లలో 68 పరుగులకే కుప్పకూలింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష, సౌమ్య తివారి రాణించడంతో భారత్ 14 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది.

విద్యార్థులు పెరిగితే మీ బాధేంటి?

- జగనన్న విద్యాకానుక టెండర్లు వచ్చే ఏడాదికని మీకు తెలీదా?
- అప్పుడు కొత్తగా చేరే విద్యార్థులతో ప్రస్తుత సంఖ్య పెరగదా?
- ఏటా పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగానే కిట్లకు టెండర్
- అప్పటికప్పుడు తేవటం సాధ్యం కాదు కనుక ముందుగానే ప్రణాళిక
- ఒకవేళ పంపిణీ చేయగా మిగిలిపోతే మరుసటేదాదికి సర్దుబాటు
- ఈ వాస్తవాలు దాచేసి.. కిట్లు వృధా... కోట్లు తిన్నారంటూ దుష్ప్రచారం
- విద్యా రంగంలో కలలో సైతం ఊహించని సంస్కరణలకు జగన్ శ్రీకారం.. ఫలితంగా విద్యలో అగ్రస్థానానికి చేరిన ఆంధ్రప్రదేశ్
- ఈ వాస్తవాలను ఏనాడూ ప్రస్తావించని రామోజీరావు

3 లో

ముంగిటకే వైద్యం

'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్ సూపర్ సక్సెస్

మూడు నెలల్లో 27 లక్షల మందికి పైగా ఉచిత సేవలు

- జీవనశైలి జబ్బులు, ఇతర వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలు.. 30 ఏళ్లు దాటిన 92 శాతం మందికి స్క్రీనింగ్ పూర్తి
- 104 వాహనంతో పాటు సందర్శిస్తున్న డాక్టర్, సిబ్బంది
- ప్రత్యేక యాప్‌తో పర్యవేక్షణ

2 లో

అంబేడ్కర్ కోనసీమ జిల్లా పసర్లపూడిలంక గ్రామానికి చెందిన పెదమల్లు సత్య రామానందం పక్షవాతం బాధితుడు. నెలకు ఒకసారి ఆస్పత్రికి వెళ్లి పరీక్షలతోపాటు మందులు కొనాల్సి రావడం, వ్యయ ప్రయాసలు ఆ నిరుపేద కుటుంబానికి పెను భారంగా పరిణమించాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ ప్రారంభమయ్యాక వైద్యుడితోపాటు సిబ్బంది తమ ఇంటికే వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారని ఆయన భార్య సత్యవతి తెలిపింది. పేదలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ఉపయోగపడుతోందని కృతజ్ఞతలు వ్యక్తం చేసింది.



వరుసగా మూడో ఏడాది.. నేడు జగనన్న చేదోడు

- రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు జగన్ సర్కారు కానుక
- 3,30,145 మందికి రూ.330.15 కోట్ల లబ్ధి
- నేడు వినుకొండలో బటన్ నొక్కి నగదు జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వెల్లటూరు రోడ్‌లో బహిరంగ సభలో ప్రసంగం



నేడు, రేపు సీఎం జగన్ ఢిల్లీ పర్యటన

2 లో

అడ్డంగా దొరికిపోయి.. 'ఈనాడు' ఎదురుదాడి!

- లోకేశ్ 'యువగళం' కోసం ప్రభుత్వంపై యువతను రెచ్చగొట్టేందుకు వ్యూహం.. రిటైర్మెంట్ వయసు పెంచుతున్నట్లు నకిలీ జీవో.. ఆపై విస్తృతంగా ప్రచారం
- వెంటనే ఖండించిన ప్రభుత్వం.. నకిలీ రాయుళ్లపై చర్యల కోసం కేసు.. దీంతో రహస్య పాలన వల్లే నకిలీ జీవోలొస్తున్నాయని రామోజీ ఎదురుదాడి
- నిజానికి ప్రతి జీవోనూ గెజిట్‌లో ప్రచురిస్తున్న సర్కారు

2 లో

'గ్రేట్' జొకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ మరోసారి నిరూపించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొకోవిచ్ 6–3, 7–6 (7/4), 7–6 (7/4)తో మూడో ర్యాంకర్ స్టెఫనోస్ సిట్సిపాస్(గ్రీస్)పై గెలుపొందాడు. ఈ టైటిల్‌తో పురుషుల టెన్నిస్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రాఫెల్ నాదల్(22) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు.





ఆపసోపాలు పడి..

రెండో టి20లో టీమిండియా గెలుపు

6 వికెట్ల తేడాతో ఓడిపోయిన న్యూజిలాండ్

- వివరాలు 12లో

మన్యంలో మెటాలిక్ బ్యారన్‌లు

పొగాకు క్యూరింగ్‌లో సాంకేతికత

బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకున్న పరిజ్ఞానం

తక్కువ పెట్టుబడితో అధిక ప్రయోజనాలు

ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల రైతుల ఆసక్తి



లూజ్ లీఫ్ బ్యారన్‌లో వర్జీనియా పొగాకును ఐరన్ ట్రేలలోకి క్యూరింగ్‌కు ఎక్కిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: వర్జీనియా పొగాకు రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఆధునిక పద్ధతుల్లో పొగాకు క్యూరింగ్ చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లోని రైతులు ఇటుగా మక్కువ చూపుతున్నారు. బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకున్న లూజ్‌లీఫ్ బ్యారన్ (మెటల్ బ్యారన్) ద్వారా క్యూరింగ్ చేసే విధానాన్ని గతేడాది జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఇది సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ ఏడాది ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో సుమారు 32 మెటాలిక్ బ్యారన్‌లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఏడాది పొగాకు పంట చేతికి రావడంతో రైతులు మెటాలిక్ బ్యారన్‌లలో క్యూరింగ్ చేస్తున్నారు. వీటి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందుతున్నామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



లూజ్ లీఫ్ బ్యారన్‌లో క్యూరింగ్ చేసిన పొగాకు

నాణ్యమైన దిగుబడి

లూజ్ లీఫ్ బ్యారన్ ద్వారా వర్జీనియా పొగాకును క్యూరింగ్ చేస్తే నాణ్యమైన దిగుబడి వస్తుంది. నిర్దేశిత ఉష్ణోగ్రతల వద్ద మొదట పుల్లలతో పొగాకు క్యూరింగ్ చేస్తారు. అలాగే ఆటోమేటిక్ సెన్సార్‌ల ద్వారా విద్యుత్ మోటార్‌లు, ఫ్యాన్‌లు, బ్లోయర్‌లు పనిచేసి ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులను క్రమబద్ధీకరిస్తారు. ఈ విధానం వల్ల బ్యారన్‌లో పొగాకుకు నిరంతరాయంగా సమ ఉష్ణోగ్రత అందుతుంది. బ్యారన్‌ను మెటల్‌లో తయారుచేయడం వల్ల అగ్ని ప్రమాదాల భయం ఉండదు. తోటల్లో కొట్టిన పొగాకు ఆకులను మెటాలిక్ ట్రేలలో అమర్చి వాటిని బ్యారన్ లోపల స్టాండ్‌లుగా ఏర్పాటుచేస్తారు. దీని ద్వారా క్యూరింగ్ కూలీల ఖర్చు 50 శాతం వరకు తగ్గుతుంది. గతంలో ఆకును గుర్రాలపై (చెక్కలతో స్టాండ్) పురుకోస, కర్రలతో కట్టి అల్లి బ్యారన్‌కు ఎక్కించేవారు. ఇప్పుడు ఆ అవసరం లేదని రైతులు అంటున్నారు. లూజ్ లీఫ్ బ్యారన్‌లో ఉడికించిన పొగాకును నేరుగా గ్రేడింగ్ చేయించుకోవచ్చని చెబుతున్నారు.

లాభాలెన్నో..

- పొగాకును ఐరన్ ట్రేలల్లో ఉంచి క్యూరింగ్ చేయడం వల్ల 50 శాతం కూలీల అవసరం తగ్గుతుంది.
- సాధారణ బ్యారన్‌తో పోలిస్తే లూజ్ లీఫ్ బ్యారన్‌లో రెండింతల పొగాకు క్యూరింగ్ చేయవచ్చు.
- క్యూరింగ్ పూర్తయిన తర్వాత 4, 5 గంటల్లో బ్యారన్ వాటర్ ద్వారా సరైన పదును అందించి అన్‌లోడ్ చేసుకోవచ్చు. పుల్ల వినియోగం సగం వరకు తగ్గుతుంది.
- సరైన పద్ధతిలో ఆకు అల్లడం ద్వారా ఆకు వృథా తగ్గి రైతుకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అధిక ఆదాయం వస్తుంది.
- మొత్తంగా క్యూరింగ్ ఖర్చు 50 శాతం వరకు తగ్గుతుంది.
- పూర్తిస్థాయి సామర్థ్యంలో క్యూరింగ్ చేస్తే పొగాకు సీజన్‌లో రైతుకు రూ.లక్ష వరకు ఆదాయం పెరుగుతుంది.

చాలా ఉపయోగం

నేటా ఏటా 150 నుంచి 250 ఎకరాల వరకు పొగాకు పండిస్తాను. ఆకు కొట్టడానికి, కట్టడానికి, క్యూరింగ్‌కు ఎక్కించడానికి చాలా అవస్థలు పడేవాడిని. క్యూరింగ్ అయిన తర్వాత గ్రేడింగ్‌కు కూడా ఎక్కువ మంది కూలీలు అవసరమయ్యేవారు. గతేడాది లూజ్‌లీఫ్ బ్యారన్‌ను ఏర్పాటు చేసుకున్నాను. దీనిలో రెండు లోడ్ల పొగాకు ఒక్కసారిగా క్యూరింగ్ అవుతుంది. దీంతో 50 శాతం వరకూ కూలీల ఖర్చు తగ్గింది. నాణ్యమైన పొగాకు వస్తుంది.

–సయ్యద్ బాజీ, పొగాకు రైతు, అచ్చియ్యపాలెం, బుట్టాయగూడెం మండలం

ఖర్చు తక్కువ

లూజ్ లీఫ్ బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ వల్ల పుల్ల, కూలీలకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. అలాగే క్యూరింగ్ కూడా చాలా బాగుంటుంది. నాణ్యమైన పొగాకు ఉత్పత్తి అవుతుంది. ఇప్పుడు కూలీల కోసం ఇబ్బంది పడాల్సిన పనిలేదు. రైతులకు క్యూరింగ్ ఖర్చులు తగ్గడంతో పాటు పొగాకు దిగుబడులు కూడా బాగుంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో లూజ్ లీఫ్ బ్యారన్ రైతులకు చాలా మేలు చేస్తుంది.

–బి.శ్రీహరి, వేలం నిర్వహణ అధికారి, జంగారెడ్డిగూడెం

సత్ఫలితాలు

లూజ్ లీఫ్ బ్యారన్‌తో పొగాకు క్యూరింగ్ విధానం అందుబాటులోకి వచ్చింది. ఇది బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకున్న మెటాలిక్ బ్యారన్. గతేడాది ప్రయోగాత్మకంగా కొన్నిచోట్ల ఏర్పాటుచేశాం. సత్ఫలితాలు రావడంతో ఈ ఏడాది ఎక్కువ మందితో ఏర్పాటుచేయిస్తున్నాం. బ్యారన్‌కు రూ.8.50 లక్షలను రైతులకు అందిస్తున్నాం. రూ.5 లక్షల వరకు రైతులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

–పి.వెంకటేష్, ఐటీసీ సంస్థ అసిస్టెంట్ మేనేజర్, జంగారెడ్డిగూడెం

'అల్లుడు బియ్యం' అదుర్స్!

నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది.. ఔషధ విలువలున్న ఆహారం తీసుకోవడంపై ఆసక్తి పెరిగింది.. సేంద్రియ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.. పాత కాలం పంటలకు ప్రస్తుతం మరింత గిరాకీ వచ్చింది. ఆ క్రమంలోనే తమిళనాడుకు చెందిన అల్లుడు బియ్యం (మాపిళ్లై సాంబ) వరి వంగడం పలమనేరు మండలంలో సాగులోకి వచ్చింది.. అత్యున్నత గుణాలున్న ఈ రకం రైస్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఏడు నెలల కాల పరిమితితో చేతికందే ఈ పంట రైతుకు కాసులవర్షం కురిపించే అవకాశముంది.

- 'మాపిళ్లై సాంబ'లో అద్భుత ఔషధ విలువలు
- తమిళనాడులో పుట్టిన పురాతన వంగడం
- వరి రకాల్లో అత్యంత శ్రేష్ఠమైందిగా గుర్తింపు
- సుమారు ఏడు నెలలు పంట కాలం.. మార్కెట్‌లో కిలో రూ.200 పైమాటే
- పలమనేరు మండలంలో ప్రయోగాత్మకంగా సాగు



పలమనేరు: సాధారణంగా మనం తినే బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. వరి పంట కాలం కూడా నాలుగునెలలు మాత్రమే. పంట నాలుగడుగుల దాకా పెరుగుతుంది. కానీ అల్లుడు బియ్యం ఎరుపు రంగులో ఉంటుంది. దీని పంటకాలం ఏడు నెలలు. ఆరు నుంచి ఎనిమిది అడుగులు వరకు పెరుగుతుంది. ఇందులో అద్భుతమైన ఔషధ గుణాలుండడంతో విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. గతంలో తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతంలోని రైతులు శతాబ్దాల నుంచి ప్రకృతి విధానంలో సాగు చేస్తూ వస్తున్నారు. వారు కాపాడుకుంటూ రావడం వల్లే అపురూపమైన మాపిళ్లై సాంబ రకం వంగడాలు నేటి తరానికి అందుబాటులోకి వచ్చాయి. అక్కడి నుంచి విత్తనాలను తీసుకువచ్చి పలమనేరు మండలంలోని కూర్మాయి వద్ద ఓ ఔత్సాహిక రైతు చందూల్ కుమార్ ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. సేంద్రియ పద్ధతులో పంట పండిస్తున్నారు. ప్రస్తుతం పంట ఏపుగా ఎదిగింది. ఒబ్బిడికి సిద్ధంగా తయారైంది.

ప్రయోగాత్మకంగా సాగు

పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద చందూల్‌కుమార్ అనే రైతు తన ఎకరా పొలంలో మాపిళ్లై సాంబ రకాన్ని సాగు చేస్తున్నారు. గత ఏడాది జూలైలో నాటగా, ప్రస్తుతం పంట ఆరు అడుగులకు పైగా పెరిగి ఏపుగా వెన్నుపట్టింది. త్వరలోనే ఒబ్బిడి చేయనున్నారు. ఈ పంటను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులే కాకుండా కర్ణాటక నుంచి కూడా పలువురు వస్తున్నారు. అల్లుడ బియ్యం సాగు చేసేందుకు పెద్దసంఖ్యలో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

దేశవాళీ వరి వంగడాల్లో అగ్రస్థానం...

హరిత విప్లవం తర్వాత పలు రకాల హైబ్రిడ్ వరి వంగడాలు సృష్టించబడ్డాయి. సుమారు 2వేల దాకా వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో మాత్రం దేశవాళీ రకాలు వంశపారంపర్యంగా సాగులో ఉన్నాయి. అందులో అత్యంత పోషకాలు కలిగినవిగా రత్నబోడి, నవారా, కులాకర్, తాజముడి, కుజిపాటియాలా, మైసూర్‌మల్లిగె, చిట్టి ముత్యాలు, బర్మాబ్లాక్, బహురూపి, కుంకుమసార, కాలాబాటి, కోతాంబరి లాంటివి పేరు గడించాయి. అయితే వీటన్నింటికీ మించిన రకంగా మాపిళ్లై సాంబ అగ్రస్థానంలో నిలుస్తుంది. అందుకే మార్కెట్‌లో దీనికంత డిమాండ్ ఏర్పడింది.

పలు సమస్యలకు ఔషధమే!

ఈ రకం కిలో బియ్యంలో ఓ గ్రాము ఫ్యాట్, 80 గ్రాముల కార్బోహైడ్రేట్, 7 గ్రాముల ఫైబర్, 7 గ్రాముల ప్రొటీన్, 50.8 గ్రాముల కాల్షియం, 90.4 గ్రాముల పోషకాలు, 5.47 గ్రాముల ఐరన్ పోషకాలు ఉన్నాయని శాస్త్రీయంగా నిర్ధారించారు. ఈ బియ్యంతో వండిన ఆహారాన్ని భుజిస్తే రక్తశుద్ధితోపాటు మల బద్ధకం, పైల్స్ సమస్యలు తలెత్తవు. అలాగే మధుమేహం బారిన పడినవారికి కూడా మేలు చేస్తుంది. దుకాణాల్లో ఈ రకం బియ్యం పెద్దగా అందుబాటులో లేదు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి కంపెనీలు కిలో నుంచి మూడు, ఐదు కిలోల బ్యాగుల్లో వీటిని విక్రయిస్తున్నాయి.

వంగడం చరిత్ర ఇదీ..

తమిళనాడుతోపాటు కేరళలోని పలు జిల్లాల్లో సాగు చేస్తున్న పురాతన వరి వంగడమే మాపిళ్లై సాంబ రకం. తమిళంలో మాపిళ్లై అంటే పెళ్లికొడుకు, అల్లుడు అని అర్థం. పాత కాలంలో అల్లుడు దృఢంగా ఉండాలని పెళ్లికుమార్తె ఇంటి వారు ఈ రకం బియ్యాన్ని వండిపెట్టేవారట. నూతన వధూవరులకు ఈ రకం అన్నాన్నే పెట్టడం ఇప్పటికీ కన్యాకుమారి ప్రాంతంలో ఉంది. ఇందులోని ఔషధ విలువల కారణంగా పురుషులకు వీర్యపుష్టి లభిస్తుందని నమ్ముతారు. ఈ బియ్యాన్ని తింటే కాన్పు సాధారణంగా అవుతుందని విశ్వసిస్తారు. అల్లుళ్లకు ప్రత్యేకంగా వడ్డిస్తారు కనుకే ఈ రకం బియ్యాన్ని మాపిళ్లై సాంబ అని పిలుస్తుంటారు. ఏపీ, తెలంగాణాలో అల్లుడు సాంబ, పెళ్లికొడుకు సాంబ, కేరళలో వరణ్‌సాంబ, కర్ణాటకలో వర సాంబ, ఉత్తరాది రాష్ట్రాల్లో దుల్హా సాంబగా పేర్లున్నాయి. ఆన్‌లైన్‌లో ఈ రకం బియ్యానికి బ్రైడ్‌గ్రూమ్ రైస్ అని పిలుస్తున్నారు. ఇది రాయలసీమలోని బైరొడ్లును పోలి ఉంటుంది.

అధ్యయనం చేసి సాగు చేశా

కొన్నేళ్ల నుంచి ప్రకృతి సేద్యం చేస్తున్నా. పలు రకాల దేశీయ వరి వంగడాలను సాగు చేస్తున్నా. గతంలో బ్లాక్‌రైస్‌ను సాగుచేశా. కానీ అన్నింటికంటే ఎక్కువ ఔషధ గుణాలున్న మాపిళ్లై సాంబ సాగు చేయాలని నిర్ణయించుకున్న తర్వాత, బాగా అధ్యయనం చేశా. అనంతరం సాగు ప్రారంభించా. ఈ ప్రాంత రైతులకు ఈ వంగడాన్ని పరిచయం చేసి సాగు పెంచాలని భావిస్తున్నా.

– చందూల్‌కుమార్, రైతు, కూర్మాయి, పలమనేరు మండలం

అవగాహన పెరుగుతోంది

హైబ్రిడ్ వరి వంగడాల స్థానంలో దేశీవాళీ విత్తనాలపై రైతుల్లో అవగాహన పెరిగింది. ముఖ్యంగా సేంద్రియ సేద్యంపై ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. అపురూపమైన మాపిళ్లై సాంబకు (ఏంఏపీఎస్‌ఏఎంబీఏ-1) మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు ఇలాంటి వరి వంగడాలను సాగు చేసేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– సంధ్య, వ్యవసాయాధికారి, పలమనేరు మండలం

మంచి పోషక విలువలు

మన పూర్వీకులు పండించిన ఎన్నో రకాల దేశీవంగడాలు కనుమరుగైయ్యాయి. కానీ కొందరు ఔత్సాహిక రైతులు మళ్లీ వాటిని సాగుచేస్తున్నారు. వీటిలో ఎన్నో రకాల పోషకాలున్నాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా ఉండడంతో మలబద్ధకం సమస్య తగ్గుతుంది. హెచ్‌బీ తక్కువగా అనీమియాతో బాధపడేవారికి ఇది మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తుంది.

– యుగంధర్, మెడికల్ ఆఫీసర్, పలమనేరు

క్లుప్తంగా...

నేడు, రేపు సీఎం జగన్ ఢిల్లీ పర్యటన

- నేటి రాత్రి జనపథ్ నివాసంలో బస
- రేపు ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రౌండ్ టేబుల్ భేటీకి హాజరు
- పాల్గొననున్న వివిధ దేశాల దౌత్యవేత్తలు, ఫిక్కీ, సీఐఐ, ఇతర ఫెడరేషన్ల ప్రతినిధులు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 30, 31వ తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి ఢిల్లీకి విమానంలో బయలుదేరతారు. 6.45 గంటలకు ఢిల్లీ చేరుకుని 1 జన్‌పథ్ నివాసంలో రాత్రి బస చేస్తారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఢిల్లీ లీలా ప్యాలెస్ హోటల్లో వివిధ దేశాల దౌత్యవేత్తలు, ఫిక్కీ, సీఐఐ, ఇతర ఫెడరేషన్ల ప్రతినిధులతో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశం – కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 6.05 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 8.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

గిరిజన ప్రాంతాల్లో రీ సర్వే

- జిల్లా కలెక్టర్లకు సీసీఎల్‌ఏ ఆదేశాలు

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో 1/70 (ఏపీ షెడ్యూల్డ్ ప్రాంత భూముల బదిలీ క్రమబద్ధీకరణ) చట్టానికి అనుగుణంగానే భూముల రీ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) జి.సాయిప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్లకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. 1/70 చట్టంతోపాటు దానికి సంబంధించిన ఇతర చట్టాలు, వాటి అమలు కోసం ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను రీ సర్వే కార్యక్రమంలో కచ్చితంగా పాటించాలని స్పష్టంచేశారు. రీ సర్వేలో గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషనర్‌కు ఏపీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ వినతి పత్రం ఇచ్చింది. దానిని పరిశీలించాలని సీసీఎల్‌ఏను ఎస్టీ కమిషన్ కోరిన నేపథ్యంలో ఈ సర్క్యులర్‌ను జారీ చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో మరో 970 కి.మీ. కొత్త రోడ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.625 కోట్లతో మరో 970 కిలోమీటర్ల కొత్త రోడ్లు నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి అనుమతుల ప్రక్రియ కోసం వారం రోజుల్లో కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వివిధ గ్రామాల నుంచి సమీప పట్టణాలను లేదా జాతీయ–రాష్ట్రీయ రహదారులను కలిపే.. పదేళ్లకు ముందు నిర్మాణం జరిగి, ఇప్పుడు పూర్తిగా దెబ్బతిన్నరోడ్ల స్థానంలో ఇప్పుడు కొత్తగా పీఎంజీఎస్‌వై –3 కింద ప్రభుత్వం రోడ్లు నిర్మిస్తుంది. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో ఒక్క పీఎంజీఎస్‌వై కిందే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ.1,806 కోట్లతో 2,684 కిలోమీటర్ల రోడ్లు నిర్మించింది. మరో 1,541 కిలోమీటర్ల మేర 196 రోడ్డు పనులు పురోగతిలో ఉన్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



ప్రపంచ మిలటరీ బడ్జెట్.. 2,00,000 కోట్ల పైనే

ఇందులో 38% వాటా అమెరికాదే

- దాదాపు 14 శాతం వాటాతో రెండో స్థానంలో చైనా
- 3.6 శాతం వాటాతో మూడో స్థానంలో భారత్
- ఆ తర్వాత స్థానాల్లో యూకే, రష్యా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా
- ఇవి మినహా, మిగతా అన్ని దేశాల మిలటరీ వ్యయం 25.3 శాతమే
- స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక వెల్లడి

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)


ప్రపంచంలో స్వీయ రక్షణ కోసం వివిధ దేశాలు చేస్తున్న వ్యయం ఏటా పెరుగుతోంది. ఆధునిక యుగంలోనూ మిలటరీ వ్యయం గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచ దేశాల రక్షణ బడ్జెట్ 2.1 లక్షల కోట్ల డాలర్లకు చేరిందని స్వీడన్ కేంద్రంగా పనిచేస్తున్న 'స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' నివేదిక వెల్లడించింది. 1949 నుంచి వివిధ దేశాల మిలటరీ బడ్జెట్లను విశ్లేషిస్తూ ఈ సంస్థ ఏటా నివేదికలు వెలువరిస్తోంది. మిలటరీ వ్యయం అంటే కేవలం సైన్యాన్ని పోషించడం, మందుగుండు సామగ్రిని సమకూర్చుకోవడమే కాదు.. పరిశోధన–అభివృద్ధి వ్యయం కూడా భాగమే. ప్రపంచ మిలటరీ బడ్జెట్ గత ఏడేళ్లుగా పెరుగుతూ 2021–22 ఆర్థిక సంవత్సరానికి 2.1 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇందులో అమెరికా వాటా దాదాపు 38 శాతం. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఈ దేశం 80 వేల కోట్ల డాలర్లు ఖర్చుచేసింది. 29.3 వేల కోట్ల డాలర్లు వ్యయం చేసిన చైనా రెండో స్థానంలో నిలిచింది. ప్రపంచ దేశాల మొత్తం మిలటరీ వ్యయంలో చైనా వాటా దాదాపు 14 శాతం. అలాగే, అమెరికా, చైనా దేశాల మిలటరీ వ్యయం.. మొత్తం ప్రపంచ దేశాల మిలటరీ వ్యయం కంటే కాస్త ఎక్కువే.

- ఇక 7.66 వేల కోట్ల డాలర్ల వ్యయంతో మన దేశం మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ మిలటరీ వ్యయంలో భారత్ మిలటరీ వ్యయం 3.6 శాతం.
- తర్వాత స్థానంలో ఉన్న యూకే 3.2 శాతం వాటాతో 6.84 వేల కోట్ల డాలర్ల వ్యయం చేసింది.
- 5వ స్థానం రష్యాది. ఈ దేశం 3.1 శాతం వాటాతో 6.59 వేల కోట్ల డాలర్లు సైన్యానికి ఖర్చుచేసింది.
- ఆరో స్థానంలో ఉన్న ఫ్రాన్స్ 2.7 శాతం వాటాతో 5.66 వేల కోట్ల డాలర్లు ఖర్చుపెట్టింది.
- ఏడో స్థానంలో ఉన్న జర్మనీ కూడా దాదాపు ఫ్రాన్స్‌తో సమానంగా ఖర్చు చేసింది.
- 8వ స్థానంలో ఉన్న సౌదీ అరేబియా వెచ్చించింది 5.56 వేల కోట్ల డాలర్లు (2.6 శాతం).
- 9వ స్థానంలో 5.4 వేల కోట్ల డాలర్ల (2.6 శాతం) వ్యయంతో జపాన్ ఉంది.



- ఇక పదో స్థానంలో ఉన్న దక్షిణ కొరియా 5.02 వేల కోట్ల డాలర్లు వ్యయం చేసి ప్రపంచ మిలటరీ వ్యయంలో 2.4 శాతం వాటా దక్కించుకుంది.

ఈ 10 దేశాలు మినహా ప్రపంచంలోని మిగతా అన్ని దేశాలు కలిపినా 53.6 వేల కోట్ల డాలర్ల వ్యయంతో వాటి వాటా 25.3 శాతం మాత్రమే.





చైనా రక్షణ బడ్జెట్ భారీగా పెంపు

మిలటరీ బడ్జెట్‌ను గత దశాబ్ద కాలంలో గణనీయంగా పెంచుతున్న దేశం చైనా. 2012లో చేసిన వ్యయంతో పోలిస్తే 2021లో పెట్టిన ఖర్చు రెట్టింపు అయింది. గత 27 ఏళ్లుగా చైనా తన రక్షణ బడ్జెట్‌ను పెంచుకుంటూ పోతోంది.

- అమెరికా ఒక్క దేశం చేస్తున్న రక్షణ వ్యయాన్ని పరిశీలిస్తే.. టాప్–10 దేశాల జాబితాలోని మిగతా 9 దేశాల మొత్తం మిలటరీ వ్యయం కంటే ఈ దేశానిది ఎక్కువే. అలాగే..
- సౌదీ అరేబియా తన మొత్తం జీడీపీలో 6.6 శాతం ఖర్చుచేస్తోంది. రష్యా 4.1 శాతం వ్యయం చేస్తోంది.

ఆంక్షల మంత్రమే నేటి యుద్ధ తంత్రం

ఆధునిక యుగంలో అత్యాధునిక ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడం, సైన్యాన్ని పెంచుకోవడమే ఆధునిక యుద్ధ తంత్రం కాదని అగ్రదేశాలు పలుమార్లు నిరూపించాయి. ఆంక్షలు విధించడం, ఎగుమతులు–దిగుమతులను నియంత్రించడం, అధిక పన్నులు విధించడం, సరఫరాలు నిలిపివేయడం.. చేస్తున్నాయి. ఉక్రెయిన్ మీద రష్యా దండెత్తినప్పుడు.. రష్యా మీద పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనవద్దని మన దేశం మీద కూడా ఒత్తిళ్లు వచ్చాయి. ఇక దేశ భద్రతలో సైబర్ సెక్యూరిటీ ఇప్పుడు కీలకపాత్ర పోషిస్తోంది. మిలటరీ కంప్యూటర్ వ్యవస్థల భద్రతకు అన్ని దేశాలు ప్రాధాన్యతనిస్తున్నాయి.

ముంగిటకే వైద్యం

'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్ సూపర్ సక్సెస్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ రికార్డులు సృష్టిస్తోంది. మూడు నెలల వ్యవధిలో 27 లక్షల మందికి పైగా గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ ఉచితంగా వైద్య సేవలు అందచేయడం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ 21వ తేదీన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ట్రయల్ రన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. 104 వాహనంతో పాటు డాక్టర్, వైద్య సిబ్బంది విలేజ్ క్లినిక్స్‌ను సందర్శించి గ్రామాల్లోనే సేవలందిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉచితంగా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా అందచేస్తుండటంపై హర్షం వ్యక్తమవుతోంది. పక్షవాతం, నరాల బలహీనతతో నడవలేని వారి ఇళ్లకు స్వయంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్న వారిని కలుసుకుని ఆరోగ్య వివరాలను వాకబు చేస్తున్నారు.


అనకాపల్లి జిల్లాలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో మందులు, ర్యాపిడ్ కిట్లు

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. 67 రకాల మందులతో పాటు 14 రకాల ర్యాపిడ్ కిట్లను వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో అందుబాటులో ఉంచారు. ప్రత్యేక యాప్ ద్వారా ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ అమలవుతున్న విధానాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 12.70 లక్షల మందికి పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జీవనశైలి జబ్బులతో పాటు ఇతర వ్యాధులను గుర్తించేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో 30 సంవత్సరాలు పైబడిన 92 శాతం మందికి స్క్రీనింగ్ పూర్తైంది. మిగతా 8 శాతం మందికి కూడా స్క్రీనింగ్ నిర్వహించేలా ఏఎన్‌ఎంలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు అదనపు డయాగ్నస్టిక్ కిట్‌లు సమకూరుస్తున్నారు.

గతేడాది అక్టోబర్ 21 నుంచి ఈ నెల 25 వరకు ఫ్యామిలీ డాక్టర్‌తో సేవలు ఇలా

మొత్తం ఉచిత పరీక్షలు, మందులు తీసుకున్న వారి సంఖ్య	సాధారణ ఆరోగ్య ఓపీ పరీక్షలు, మందుల పంపిణీ	కౌమార బాలికలకు పరీక్షలు	గర్భిణులకు యాంటినేటల్ కేర్ పరీక్షలు	బాలింతలకు ఆరోగ్య పరీక్షలు
27,00,625	12,70,196	3,512	1,50,452	1,17,506

రక్తహీనత పరీక్షలు	రక్తపోటు	మధుమేహం	నోటి క్యాన్సర్	రొమ్ము క్యాన్సర్	గర్భాశయ క్యాన్సర్	టీబీ
16,680	6,44,448	4,86,632	3,691	1,069	4,491	1,948

వరుసగా మూడో ఏడాది.. నేడు జగనన్న చేదోడు

లబ్ధి పొందుతున్న వారి వివరాలు

- షాపులున్న 1,67,951 మంది టైలర్లకు రూ.167.95 కోట్ల లబ్ధి
- షాపులున్న 1,14,661 మంది రజకులకు రూ.114.67 కోట్ల లబ్ధి
- షాపులున్న 47,533 మంది నాయీబ్రాహ్మణులకు రూ.47.53 కోట్ల లబ్ధి

ఇప్పటి వరకు అందించిన లబ్ధి

- 2020 -21లో 2,98,122 మందికి రూ.298.12 కోట్లు
- 2021-22లో 2,99,116 మందికి రూ. 299.12 కోట్లు
- 2022- 23లో 3,30,145 మందికి రూ.330.15 కోట్లు

మొత్తం: రూ.927.39 కోట్లు



సాక్షి, అమరావతి: వరుసగా మూడో ఏడాది జగనన్న చేదోడు పథకం కింద రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కానుక అందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,30,145 మంది అర్హులైన రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.330.15 కోట్ల ఆర్థిక సాయాన్ని పల్నాడు జిల్లా వినుకొండలో నేడు బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.40 గంటలకు వినుకొండ చేరుకుంటారు. 12.20 గంటల వరకు వినుకొండ వెల్లటూరు రోడ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన అనంతరం వారితో, స్థానిక నేతలతో కొద్ది సేపు మాట్లాడి, తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. జగనన్న చేదోడు పథకం ద్వారా షాపులున్న రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలకు ఏటా రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఒక్కొక్కరికి రూ.30,000 అందించినట్లవుతుంది. ఈ లెక్కన ఈ మూడేళ్లలో ఈ పథకం ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.927.39 కోట్లు. లంచాలకు, వివక్షకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా.. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించి, సోషల్ ఆడిట్ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మిస్ కాకుండా అందించాలని తపన పడుతూ.. అర్హులై ఉండి పొరపాటున, ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారికి మరో అవకాశం కల్పిస్తూ జూన్, డిసెంబర్‌లలో వైఎస్ జగన్ ప్రభుత్వం లబ్ధిని అందజేస్తోంది.

అడ్డంగా దొరికిపోయి.. 'ఈనాడు' ఎదురుదాడి!

ఆన్‌లైన్లో అందరికీ అందుబాటులో ఉన్న 'ఈ-గెజిట్'.. దీన్ని ప్రస్తావించని 'ఈనాడు'


తప్పుడు జీవోలు సృష్టించి మరీ బాబు కోసం దిగజారిన ఎల్లో మీడియా

దొంగతనం చేశారు. దొరికిపోయారు. ఎవరైనా ఏం చేస్తారు? తాము తెలియక చేశామనో, అలా చేయటం తప్పని తమకు తెలియదనో కవర్ చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. కానీ అడ్డంగా దొరికిపోయాక.. ఆ దొంగతనాన్ని సమర్థించుకుంటూ 'ఈనాడు' చేస్తున్న వాదనేంటో తెలుసా? తమకు వస్తువులు కనిపించకుండా రహస్యంగా ఉంచారు కాబట్టి దొంగతనం చేయాల్సి వచ్చిందని!!. ఔరా... ఇదేం పాత్రికేయం!?

సాక్షి, అమరావతి: మరీ ఇంత బరితెగింపా? నకిలీ జీవోలను సృష్టించి... వాటిని విస్తృతంగా ప్రచారం చేసి... చివరకు తాము దొరికిపోయామని తెలియటంతో ఎదురు తిరుగుతోంది ఎల్లో మీడియా!!. జీవోలన్నీ రహస్యంగా ఉంచటం వల్లే ఇలా అవుతోందని, రహస్య పాలన వల్లే ఇలా రచ్చ జరుగుతోందని... ఇలా చేతికొచ్చినట్లు ఏదేదో రాసేసింది 'ఈనాడు' పత్రిక. ఇంత కన్నా దారుణం ఉంటుందా? తప్పు చేశామని తెలిశాక... ఆ తప్పు బయట పడ్డాక కూడా ఒప్పుకోవటానికి సిగ్గెందుకు రామోజీరావు గారూ!? అయినా ఉన్నట్టుండి ఇలా ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచుతున్నట్లుగా ఒక నకిలీ జీవోను సృష్టించి... అప్పటికప్పుడు సోషల్ మీడియాతో పాటు 'ఈటీవీ'తో ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృతంగా ఎందుకు ప్రసారం చేయాల్సి వచ్చింది? ఎందుకంటే 'యువగళం' పేరుతో నారా లోకేశ్ పాదయాత్ర ఆరంభించారు. తొలిరోజే ఆ యాత్ర భవిష్యత్ ఏంటో తెలిసిపోయింది. సభ కోసం కర్ణాటక నుంచి బస్సుల్లో తెచ్చిన జనం కూడా లోకేశ్ మాట్లాడటం ఆరంభించగానే తిరిగి వెళ్లిపోయారు. ఆయన ప్రసంగం పూర్తయ్యేసరికే సభాస్థలం ఖాళీ అయిపోయింది. దీంతో ఏదో ఒక మాయోపాయం ఆలోచించకపోతే లోకేశ్ పాదయాత్ర చేస్తున్న విషయాన్ని కూడా ఎవ్వరూ గుర్తించరని భావించిన 'ఈనాడు', దాని ఎల్లో తోకలు ఈ నకిలీ జీవో దారుణానికి ఒడిగట్టారు. రిటైర్మెంట్ వయసు పెంచటం ద్వారా ఉన్నవారికే పొడిగింపు ఇస్తూ.. ఉద్యోగాలను ఆశిస్తున్న యువతకు గండి కొడుతున్నారని ప్రచారం చేసి... వారిలో ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్రయత్నం చేశాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం అది నకిలీదని చెప్పటంతో పాటు దాని కారకులను పట్టుకోవటానికి కేసు కూడా నమోదు చేయటంతో... ఎల్లో మీడియా ఎదురుదాడికి దిగింది.



టీడీపీ శ్రేణులు ప్రచారం చేసిన నకిలీ జీవో





నకిలీ జీవోను ప్రసారం చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్న ఈటీవీ

గెజిట్ వెబ్‌సైట్లో చూడలేదా?

ప్రతి జీవోనూ రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ ఈ గెజిట్' వెబ్‌సైట్‌లో పెడుతున్నప్పటికీ రహస్య పాలనంటూ చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి రామోజీరావు నానా అవస్థలూ పడ్డారు. తెలుగుదేశం కోసం ఇలా నకిలీ జీవోలను తయారు చేసి ప్రచారం చేయటమంటే నకిలీ నోట్లు తయారు చేయటంలాంటి దేనని పలువురు అధికారులు వ్యాఖ్యానించటం గమనార్హం. ఇప్పటిదాకా ఉద్యోగులను రెచ్చగొట్టే చర్యలో భాగంగా టీడీపీ, ఎల్లో మీడియా కలిసి జీతాలు ఇవ్వడం లేదంటూ తీవ్రమైన దుష్ప్రచారం చేశాయి. దాన్ని ఆధారాలతో సహా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ ఖండించారు. ఇక ఇప్పుడు యువగళం పేరుతో లోకేశ్ యాత్ర చేస్తుండటంతో యువతను రెచ్చగొట్టడానికి ఈ నకిలీ జీవో కుట్రకు తెరతీశారు. చంద్రబాబు హయాంలో రాజధాని భూములు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడం, సీబీఐని రాష్ట్రానికి రాకుండా నిషేధించడం వంటి రహస్య జీవోలు వందలకొద్దీ ఇచ్చినా... నాడు 'ఈనాడు'గానీ, దాని తోక మీడియా గానీ ఒక్కసారైనా ప్రశ్నించకపోవటమే ఇక్కడ అన్నిటికన్నా విచిత్రం.

బాబు కాన్ఫిడెన్షియల్ జీవోల మాటేంటి?

ఏపీ బిజినెస్ రూల్స్, సచివాలయం మాన్యువల్ ప్రకారం... ఏ వ్యవహారం ఎలా జరగాలన్నది స్పష్టంగా ఉంటుంది. సంబంధిత సమాచారం రహస్యమా, అతి రహస్యమా, లేక రొటీనా అన్న విషయాన్ని సంబంధిత శాఖ కార్యదర్శే నిర్ణయిస్తారు. చంద్రబాబు హయాంలో జీవో పెట్టి.. అందులో కేవలం నంబర్ మాత్రమే పెట్టి. ఎలాంటి సమాచారం లేకుండా కాన్ఫిడెన్షియల్ అని పేర్కొన్న సందర్భాలు కోకొల్లలు. అప్పట్లో దాదాపుగా ప్రతి జీవో కాన్ఫిడెన్షియలే!!. కానీ అది చంద్రబాబు కనక 'ఈనాడు'గానీ, దాని తోకలు గానీ ఏనాడూ ప్రశ్నించలేదు. అయినా నిజానికి ఏ జీఓ అయినా గెజిట్‌లో పబ్లిష్ అయితేనే అది అధికారికంగా అమల్లోకి వచ్చినట్టు. గెజిట్ అనేది బహిరంగం. అది ఎవరైనా చూడొచ్చు. రహస్యమేమీ ఉండదు. దాని కన్నా ముందు జీవో ఐఆర్‌లో ఏది పెట్టినా.. అది అధీకృతం కాదు. ఎవరి సంతకాలూ ఉండవు కనక అది నిర్ధారించిన సర్టిఫైడ్ పత్రం కాదు. కానీ 'ఏపీ ఈ గెజిట్'లో సంతకం చేసిన ఉత్తర్వులన్నింటినీ పెడుతున్నారు. ఇందులో సెక్షన్ అధికారి పత్రం కూడా ఉంటోంది. ఈ సమాచారం అధికారికం కూడా. మరి నిన్నటి నకిలీ జీవో వ్యవహారంలో కనీసం ఎవ్వరినైనా సంప్రదించారా? ఇందులో ఉన్నది మామూలు రొటీన్ అంశమేమీ కాదు కదా? లక్షల మంది ఉద్యోగులకు సంబంధించిన అంశంకదా? కనీసం ధ్రువీకరించుకోవాల్సిన పని లేదా? సంబంధిత శాఖతో మాట్లాడి.. వారి నుంచి వివరణ తీసుకోవాలి కదా? అలాంటివేమీ లేకుండా... అబద్ధాన్ని మీరే సృష్టించి... మీరే ప్రచారం చేసి... ప్రచారంలో ఉంది కాబట్టి ప్రసారం చేశామనటం ఏ రకమైన న్యాయం? పైపెచ్చు కప్పిపుచ్చుకోవటానికి ఏకంగా ప్రభుత్వ పాలన తీరుపైనే నిందలా? జనం ఇవన్నీ గమనిస్తున్నారు రామోజీరావు గారూ!!.

నేటి భవితలో..

- **ఎల్ఐసీ జాబ్స్: ఏడీఓ పోస్ట్ అందుకుంటారా!** దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ.. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎనిమిది జోన్ల పరిధిలో మొత్తం 9,394 అప్రెంటీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏడీఓ) పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో విజయం సాధించి ఏడీఓ కొలువు సొంతం చేసుకుంటే.. బీమా రంగంలో సుస్థిర కెరీర్ ఖాయం అవుతుంది. కొద్దిగా కష్టపడితే బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోనే ఈ ఉద్యోగం దక్కించుకోవచ్చు. ఎల్ఐసీ.. ఏడీఓకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..
- **గ్రూప్స్ ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్:** పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం,రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను

- పునరుద్ఘాటించిన యడియూరప్ప



శివాజీనగర: కర్ణాటకలో మరో 3 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో తానిక ఎన్నికల్లో పోటీ చేయబోనని బీజేపీ ముఖ్య నేత, మాజీ సీఎం యడియూరప్ప పునరుద్ఘాటించారు. "నాకు 80 ఏళ్లొచ్చాయి. కనుక ఇక ఎన్నికల్లో పోటీ చేయను" అని ఆదివారం మీడియాకు వెల్లడించారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సమయంలోనే ఈ విషయాన్ని తాను స్పష్టం చేసినట్టు గుర్తు చేశారు. "అయితే విశ్రాంతిగా ఉండలేను. బీజేపీ బలోపేతానికి రాష్ట్రమంతటా పర్యటిస్తా. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తా. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లబోను. పార్టీ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది" అన్నారు.

ఇదండీ సంగతి



చాయ్ ఇస్తే చేయి తగులుతుందేమో భయంగా ఉంది.. మీరిచ్చి వస్తారా సార్!!

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడుకు గుండెపోటు



గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని కేసరపల్లి శివారు ఎస్‌ఎల్‌టీలో ఆయన నివాసం ఉంటున్నారు. అర్జునుడికి తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని టీడీపీ నేతలు తెలిపారు.

30 ఏళ్లలో కుప్పానికి ఐదుసార్లు వచ్చా

మూడోరోజు పాదయాత్రలో లోకేశ్



శాంతిపురం (చిత్తూరు జిల్లా): తన తండ్రి ఎప్పటి నుంచో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నా గత ముప్పై ఏళ్లలో ఐదుసార్లు మాత్రమే తాను కుప్పానికి వచ్చానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చెప్పారు. పాదయాత్రలో భాగంగా ఆదివారం శాంతిపురంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఎవరైనా గట్టిగా మాట్లాడినా, ఉద్యమించినా ప్రభుత్వం కేసులు పెడుతోందని, అన్నక్యాంటీన్ పెడితే వంద మందిపై కేసులు పెట్టారని ఆరోపించారు. కేసులవల్ల తనతో సహా లక్షల మంది ఇబ్బంది పడుతున్నారని ఆయన చెప్పారు. ప్రభుత్వంపై పోరాటానికి యువత కలిసిరావాలని పిలుపునిచ్చారు. మూడేళ్లలోనే కుప్పం అభివృద్ధి విషయంలో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని, తాము అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా అన్నీ చేస్తామన్నారు. అంతకుముందు.. స్థానిక ప్రైవేటు కళ్యాణ మంటపంలో టీడీపీ మహిళా నాయకురాళ్లతో సమావేశమైన లోకేశ్ రాష్ట్ర ప్రభుత్వం మద్యనిషేధం చేయలేదని చెప్పారు. పన్నులు, నిత్యావసరాల ధరలు పెంచేశారని, జగన్‌రెడ్డి అప్పులు చేసి మహిళల తాళిబొట్లను కూడా తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 900 మంది మహిళలపై దారుణాలు జరిగాయని.. దిశ చట్టం ఏం చేస్తోందని ప్రశ్నించారు. డ్వాక్రా గ్రూపులను ప్రవేశపెట్టింది చంద్రబాబే నన్నారు.

లోకేశ్ పర్యటన ఇలా..

ఇక పాదయాత్రలో భాగంగా ఆదివారం ఉదయం శాంతిపురం మండలం టి.కొత్తూరు క్రాస్ వద్ద ఉన్న బస నుంచి శాంతిపురం, బడుగుమాకులపల్లి, మఠం, గుండిశెట్టిపల్లి, నాయనపల్లి, రాజుపేటరోడ్డు (ఇది కర్ణాటక) మీదుగా రామకుప్పం మండలంలోని చెల్దిగానిపల్లి వద్ద ఏర్పాటుచేసిన బస వరకూ లోకేశ్ నడక సాగించారు. యువగళం మూడవ రోజు దాదాపు 10 కి.మీ. మేర పాదయాత్ర సాగింది.

విభజన సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించండి

టీడీపీ ఎంపీలకు చంద్రబాబు సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి సంబంధించిన అంశాలను పార్లమెంటులో ప్రస్తావించాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆ పార్టీ ఎంపీలకు సూచించారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని, కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో సమావేశమయ్యారు. మంగళవారం ప్రారంభమవుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర విభజన సమస్యలు, పోలవరం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీవో నంబర్ 1, శాంతిభద్రతల అంశాలపై మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌లో ప్రజాగర్జన

ఉక్కునగరం (గాజువాక): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం ప్రజా గర్జన నిర్వహించనున్నారు. ఈ నెల 28వ తేదీకి విశాఖ ఉక్కు ఆందోళన రెండేళ్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ప్రజాగర్జన తలపెట్టారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఉక్కు త్రిష్నా మైదానంలో భారీ నిరసన తెలిపేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం అఖిలపక్షం వేయండి

సీఎం వైఎస్ జగన్‌కు వామపక్షాల లేఖ

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి చర్చించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వామపక్ష పార్టీలు కోరాయి. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు పది వామపక్ష పార్టీల నేతలు ఉమ్మడిగా రాసిన లేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వ్యూహాత్మకంగా విక్రయించాలని కేంద్ర ప్రభుత్వ ఫైనాన్షియల్ సబ్ కమిటీ 2021, జనవరి 27న ప్రకటన చేసిందని వామపక్ష నేతలు తెలిపారు. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులు కలిసి రెండేళ్లుగా పోరాటం సాగిస్తున్నారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని కేంద్రాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. అయినా కేంద్రం పదేపదే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను విక్రయిస్తామని పార్లమెంట్‌లో ప్రకటనలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో స్టీల్ ప్లాంట్ వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించనున్న సభకు వామపక్షాలు మద్దతు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.

విద్యార్థులు పెరిగితే మీ బాధేంటి?


విద్యా రంగంలో కలలో సైతం ఊహించని సంస్కరణలకు జగన్ శ్రీకారం

ఫలితంగా విద్యలో అగ్రస్థానానికి చేరిన ఆంధ్రప్రదేశ్

ఈ వాస్తవాలను ఏనాడూ ప్రస్తావించని రామోజీరావు

సాక్షి, అమరావతి

జగనన్న విద్యాకానుక కింద లబ్ధిపొందిన విద్యార్థుల వివరాలివీ...



రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లను, వాటిలోని విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నాలు చరిత్రలో ఇదివరకెన్నడూ జరగలేదు. అసలు ఆ ఆలోచనే చెయ్యలేదు. ఇక్కడి విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల పిల్లలకన్నా ఒక మెట్టు పైనే ఉండేలా... ప్రభుత్వమిస్తున్న జగనన్న విద్యాకానుక పైనా 'ఈనాడు' దుష్ప్రచారానికి దిగింది. వాస్తవాలకు మసిపూసి... 'కిట్లు కొన్నారు–కోట్లు తిన్నారు' అంటూ పచ్చి అబద్ధాల వంటకాన్ని జనంలోకి వదిలింది. జగనన్న విద్యాకానుక కింద... బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలతో పాటు 3 జతల యూనిఫారం, షూలు, సాక్సులు, బెల్టు, బ్యాగు, నోటు పుస్తకాలు, వర్కుబుక్కులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తూ విద్యార్థుల చదువుల్లో విప్లవాత్మకమైన మార్పు తెచ్చారని ఎన్నడూ ఒక్క మంచిమాట కూడా రాయని రామోజీరావు... అసత్య సమాచారంతో మాత్రం బాగానే చెలరేగిపోయారు. గతంలో అరకొరగా ఇచ్చే పాఠ్యపుస్తకాలు... 8 నెలలు గడిచినా, కొన్ని సందర్భాల్లో విద్యా సంవత్సరం ముగిసిపోయినా అందేవి కావు. తన పాదయాత్రలో ఈ పరిస్థితిని గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని చక్కదిద్దే పని మొదలెట్టారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన తొలి రోజే పుస్తకాలు అందించాలనుకున్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారమే కాకుండా విద్యార్థులకు అవసరమైన ఇతర వస్తువులనూ కిట్‌లో చేర్చి 'జగనన్న విద్యాకానుక'గా అందిస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రే ఆయా వస్తువుల నాణ్యతను పరిశీలించిన అనంతరం టెండర్ల ద్వారా ఏటా విద్యార్థులకు సకాలంలో కిట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా నాణ్యతలో లోపాలుంటే వాటిని తిరిగి సరిచేసి మళ్లీ కొత్తవి విద్యార్థులకు అందేలా చేస్తున్నారు.

ఇవి వచ్చే ఏడాది కోసమని మరిచారా?

ఇలా విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే అందరికీ కిట్లు అందించాలంటే ఆరేడు నెలల ముందు నుంచే కసరత్తు మొదలుకావాలి. అంటే... వచ్చే విద్యా సంవత్సరం కోసం ఈ ఏడాదే కసరత్తు మొదలవుతుంది. మరి ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతుంటుంది కదా? అప్పటికప్పుడు పెంచటం సాధ్యం కాదు కదా? అందుకే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రస్తుత సంఖ్యకు 5 శాతం జోడిస్తున్నారు. ఆ మేరకు పెరుగుదలను అంచనా వేసి టెండర్లు పిలుస్తున్నారు. ఒకవేళ పిల్లలకు ఇచ్చాక మిగిలిపోతే వాటిని తదుపరి ఏడాదికి సర్దుబాటు చేస్తూ... ఈ మేరకు కొత్తగా కొనే వాటి సంఖ్యను తగ్గిస్తున్నారు.

ఇది ప్రతి ఏటా జరుగుతున్న వాస్తవం కాగా... దీనికి 'ఈనాడు' మసిపూసింది. ఇలా మిగిలిపోయిన వస్తువుల వల్ల రూ.162 కోట్లు వృథా అంటూ తప్పుడు సమాచారంతో ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేసింది. నిజానికి వస్తువుల్లో నాణ్యత లోపాలుంటే వాటిని వాపస్ తీసుకొని కొత్తవివ్వాలన్న నిబంధన సైతం ప్రతి ఏటా తప్పనిసరిగా అమలు చేస్తున్నారు. ఇటీవల కొన్ని పాఠశాలల విద్యార్థులకు అందించిన బ్యాగుల్లో లోపాలు కనిపించగా ఆయా కంపెనీల ద్వారా తిరిగి కొత్తవి పంపిణీ చేయించారు. 'ఈనాడు' మాత్రం అవాస్తవాల ప్రచారమే లక్ష్యంగా చెలరేగిపోయింది.

ఈ మంచిని ఏనాడైనా ప్రశంసించారా?

ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు మంచి సౌకర్యాలు అందించడానికి, కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగానే వారికి మౌలిక సదుపాయాలను అందించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దార్శనిక ఆలోచనలతో ప్రభుత్వం 'నాడు–నేడు' పేరిట మహాయజ్ఞాన్ని ఆరంభించటం తెలిసిందే. గోరుముద్ద ద్వారా మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యతను తెచ్చారు. న్యాయ పోరాటాలను సైతం దాటుకుని... ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రారంభించారు. సీబీఎస్ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన బోధన కోసం అంతర్జాతీయ ఎడ్యుటెక్ కంపెనీ 'బైజూస్'తో ఒప్పందం చేసుకున్నారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులను విద్యార్థులకు ఉచితంగా అందించారు. త్వరలో డిజిటలీకరణ పద్ధతుల్లో బోధనకోసం ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోంది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తోంది. వీటన్నిటి ఫలితంగానే ఇటీవలి పెర్ఫార్మెన్సు గ్రేడింగ్ ఇండెక్సులో కానీ, అసర్ సర్వే నివేదికలో కానీ, అంతకు ముందు ఇండియాటుడే వంటి సంస్థలు నిర్వహించిన సర్వేల్లో కానీ పాఠశాల విద్యాప్రమాణాలు ఎంతో మెరుగుపడి ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఒక్క విద్యారంగంలో సంస్కరణలకే రూ.55వేల కోట్ల వరకు ఖర్చు చేశారంటే ముఖ్యమంత్రి ఈ రంగానికిస్తున్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. గతంలో చంద్రబాబు నాయుడి హయాంలో పాఠశాల విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసినా... విద్యాసంవత్సరం చివరి వరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం వంటివి ఇవ్వకపోయినా అద్భుతంగా ఉందంటూ కథనాలు రాసిన 'ఈనాడు' ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న కార్యక్రమాలను ఒక్కనాడూ ప్రశంసించకపోవటమే విచిత్రం.

10 రకాల వస్తువుల పంపిణీ

జగనన్న విద్యాకానుక ద్వారా మొత్తం 10 రకాల వస్తువులను ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా ప్రతిఏటా పాఠశాలలు ప్రారంభానికి ముందే అందిస్తోంది. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ (1–5 తరగతులకు), ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (6 –10 తరగతులకు), స్కూలు బ్యాగు, షూ, 2 జతల సాక్సులు, యూనిఫాం, కుట్టుకూలి డబ్బులు, బెల్టు మొత్తం పదిరకాలు మూడేళ్లనుంచి విజయవంతంగా అందిస్తోంది.

మొత్తంగా మూడేళ్లలో విద్యాకానుక కోసం సుమారు రూ.2,324 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. వరుసగా నాలుగో ఏడాది 2023–24 విద్యా సంవత్సరంకోసం మరో రూ.1042.53 కోట్లు ఖర్చు చేసేందుకు ఇప్పటికే టెండర్లను పూర్తి చేసింది. ఏటా స్కూళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా 5 శాతం కలుపుకుని ఆ మేరకు పంపిణీ చేయాల్సిన సంఖ్యను నిర్ణయిస్తోంది. ఒకవేళ పంపిణీ అనంతరం విద్యాకానుక వస్తువుల్లో ఏం మిగిలిపోయినా కూడా... వాటిని తదుపరి సంవత్సరంలో వాడుకుంటున్నారు.

అత్యంత పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ

విద్యాకానుక కొనుగోళ్ల విషయంలో టెండర్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాల తనిఖీకి ఈ ఏడాది క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో కూడా ఒప్పందం చేసుకున్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే... విద్యార్థులు ఇబ్బంది పడకుండా వెంటనే రీప్లేస్ చేయడానికి... అదనంగా తెప్పించుకున్న నిల్వలు ఉపయోగపడుతున్నాయి. బెల్టులు, నోటు పుస్తకాలు, బూట్లు, డిక్షనరీలలో ఎటువంటి మార్పులు లేనందున వాటిని తర్వాతి విద్యా సంవత్సరంలో వాడుకునేలా ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

విద్యాకానుక విప్లవాత్మక పథకం

విద్యాకానుక విషయమై తమ నుంచి ఎలాంటి వివరణ కూడా అడగకుండా అభూత కల్పనలతో కథనాన్ని రాశారని విద్యాశాఖ తప్పుబట్టింది. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు, యూనిఫారం.. మొత్తం 10 రకాల వస్తువులను ప్రభుత్వం అందిస్తోందని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని విద్యాశాఖ పేర్కొంది. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా... పరీక్షలు వస్తున్నా... పాఠ్యపుస్తకాలు సహా ఏవీ అందని పరిస్థితి గతంలో ఉండేదని వివరించింది.

భీమిలిలో ఒబెరాయ్ గ్రూపునకు 40 ఎకరాలు కేటాయింపు



స్థలాన్ని చూపిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. పక్కన విక్రమ్ ఒబెరాయ్, రాజారామన్ శంకర్

తగరపువలస: విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం అన్నవరం గ్రామ పంచాయతీ వద్ద రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన 40 ఎకరాల స్థలాన్ని ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ కంపెనీకి లీజ్ కమ్ రెంట్ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా ఆ స్థలాన్ని ఆదివారం గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) విక్రమ్ ఒబెరాయ్, సంస్థ కార్పొరేట్ వ్యవహారాల ప్రెసిడెంట్ రాజారామన్ శంకర్, ముఖ్య ఆర్థిక నిర్వహణాధికారి కల్లోల్ కుండులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. రాబోయే రోజుల్లో విశాఖలో జరగనున్న పలు ప్రభుత్వ ప్రాజెక్టుల గురించి కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున వారికి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్‌రెడ్డి, విశాఖ పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి, భీమిలి ఆర్డీఓ భాస్కరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేసింది వైఎస్ జగనే: ఆర్.కృష్ణయ్య



సాక్షి, అమరావతి: లోకేశ్ మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు బీసీ రిజర్వేషన్లపై కనీస అవగాహన లేదనే విషయం అర్థమవుతోందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టంచేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను చంద్రబాబు 34 శాతానికి పెంచారని, సీఎం వైఎస్ జగన్ తగ్గించారంటూ లోకేశ్ పచ్చి అబద్ధాలు చెప్పడాన్ని జనం నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. వాస్తవంగా బీసీలకు చంద్రబాబు అన్యాయం చేస్తే సీఎం వైఎస్ జగన్ న్యాయం చేశారని వివరించారు. ఐదేళ్ల పాలనలో స్థానిక సంస్థలకు ఎన్నికలే జరపని చంద్రబాబు.. బీసీలకు 34% రిజర్వేషన్లు ఎలా అమలు చేశారని లోకేశ్‌ను ప్రశ్నించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లకు మించి పార్టీ పరంగా అవకాశాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. 25 మంది ఉండే మంత్రివర్గంలో సైతం ఏకంగా 11 మంది బీసీలకు అవకాశం కల్పించారన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, పనుల్లోనూ 50 శాతంపైగా బీసీలకు కట్టబెట్టారని చెప్పారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని, దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని స్పష్టం చేశారు.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

పరామర్శించిన జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్

సాక్షి బెంగళూరు: సినీనటుడు నందమూరి తారకరత్న ఆరోగ్యం విషమంగానే ఉంది. కుప్పంలో లోకేశ్ పాదయాత్ర ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఆయన గుండెపోటుతో హఠాత్తుగా కుప్పకూలిన సంగతి తెలిసిందే. వెంటనే ఆయన్ను అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని నారాయణ హెల్త్ హృదయాలయ (ఎన్‌హెచ్) ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు తారకరత్నకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు.. తారకరత్నను ఆయన కుటుంబ సభ్యులు వరుసగా పరామర్శిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ నేత పురందేశ్వరి, దివంగత హరికృష్ణ తనయ సుహాసిని, ఇంకా పలువురు కుటుంబ సభ్యులు శనివారం పరామర్శించారు. అయితే, ఆదివారం హరికృష్ణ కుమారులు కల్యాణ్‌రామ్, జూనియర్ ఎన్టీఆర్ దంపతులు, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, కర్ణాటక వైద్యారోగ్య మంత్రి డాక్టర్ కె. సుధాకర్.. తారకరత్నను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తారకరత్న త్వరగా కోలుకుంటారని వీరు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ స్పందిస్తూ.. తారకరత్న పరిస్థితి కొంచెం మెరుగైందని.. వైద్యులు బాగా పనిచేస్తున్నారని చెప్పారు.



మోహనకృష్ణతో మాట్లాడుతున్న జూనియర్ ఎన్టీఆర్

వైద్యానికి తారకరత్న స్పందిస్తున్నారు

మా కుటుంబంలో అనుకోని ఘటన జరిగింది. ఎన్‌హెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. తారకరత్న కూడా గట్టిగా పోరాడుతున్నారు. అన్నకు వైద్యం, మనోబలంతో పాటు అభిమానులు, తాతగారి ఆశీస్సులు ఉన్నాయి. ఆయన త్వరగా కోలుకుని ఇదివరకటిలా మనందరితో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ కష్ట సమయంలో ఆప్తుడైన కర్ణాటక వైద్యారోగ్య శాఖ మంత్రి సుధాకర్ అండగా ఉంటున్నందుకు కృతజ్ఞతలు. తారకరత్న వైద్యానికి స్పందిస్తున్నారు. – జూనియర్ ఎన్టీఆర్

ఇంధన పొదుపు దిశగా టీటీడీ అడుగులు

- ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్, ఎనర్జీ డిపార్ట్‌మెంట్, ఎనర్జీ ఎఫిషియెన్సీ కార్పొరేషన్, టీటీడీ అధికారుల వర్చువల్ భేటీ
- 118 పంపుసెట్ల స్థానంలో ఇంధన సామర్థ్య పంపుసెట్లు ఏర్పాటుకు నిర్ణయం
- తద్వారా ఏటా రూ.3.17 కోట్ల విలువైన 4.50 మిలియన్ యూనిట్ల ఇంధనం ఆదా



4.50 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా

సాక్షి, అమరావతి: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇంధన సామర్థ్య చర్యల్లో భాగంగా పాత నీటి మోటార్ల స్థానంలో స్టార్ రేటెడ్ మోటార్లను అమర్చేందుకు యోచిస్తోంది. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, విద్యుత్ ఆదాతో పాటు బిల్లులను తగ్గించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. విద్యుత్ కోసం టీటీడీ ఏటా రూ.40 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య చర్యలను అమలు చేయడం ద్వారా ఈ బిల్లులను ఏడాదికి రూ.5 కోట్ల వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సంప్రదాయ హై కెపాసిటీ మోటార్ల స్థానంలో ఫైవ్ స్టార్ రేటెడ్ పంపు సెట్లను అమర్చనుంది. నీటి పంపింగ్ స్టేషన్లలో ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్‌పై ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం), ఎనర్జీ డిపార్ట్‌మెంట్, ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీఇడీసీఓ), టీటీడీ అధికారులు ఆదివారం వర్చువల్‌గా చర్చించారు. టీటీడీలో ప్రస్తుతం ఉన్న 118 పంపుసెట్ల స్థానంలో ఇంధన సామర్థ్య పంపుసెట్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ఈవో ఏవీ ధర్మారెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

టీటీడీలో ఉన్న పంపింగ్ స్టేషన్లలో ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్ (ఐజీఈఏ) నిర్వహించినట్టు ఏపీ సీడ్కో, ఏపీ ఎస్ఈసీఎం సీనియర్ అధికారులు వెల్లడించారు. 118 పంపు సెట్లను ఇంధన సామర్థ్య పంపుసెట్లతో భర్తీ చేయడానికి సుమారు రూ.3.18 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. వీటివల్ల ఏటా రూ.3.17 కోట్ల విలువైన 4.50 మిలియన్ యూనిట్ల ఇంధనాన్ని ఆదా చేసే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఎల్ఈడీ లైటింగ్ ఉపకరణాలు, బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్ (బీఎల్‌డీసీ) ఫ్యాన్ల విభాగాల్లో టీటీడీలో ఎనర్జీ ఎఫిషియెన్సీ డెమోన్‌స్ట్రేషన్ ప్రాజెక్టులు అమలు చేశారు. మొదటి దశలో శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో 1000 ట్యూబ్ లైట్ల స్థానంలో ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 400 ఫ్యాన్‌లను బీఎల్‌డీసీ ఫ్యాన్లతో భర్తీ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల ఏడాదికి 1.64 లక్షల యూనిట్ల ఇంధనం ఆదా అవుతుందని అంచనా వేసినట్టు అధికారులు పేర్కొన్నారు. రెండో దశలో టీటీడీ భవనాలలో ప్రస్తుతం ఉన్న 5 వేల సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో బీఎల్‌డీసీ ఫ్యాన్లతో భర్తీ చేయడానికి ఏపీ సీడ్కోతో టీటీడీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇవి ఏటా రూ.62 లక్షల ఆదాతో దాదాపు 0.88 మిలియన్ యూనిట్లను ఆదా చేయగలవని భావిస్తున్నారు. సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ డి.నాగేశ్వరరావు, ఏపీఎస్ఈసీఎం సీఈఓ ఎ.చంద్రశేఖర రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ జగదీశ్వరరెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈసీ సెల్ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన టీడీపీ: హనుమంత్ నాయక్

సాక్షి, అమరావతి: గిరిజనుల సంక్షేమాన్ని టీడీపీ విస్మరించిందని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హనుమంత్ నాయక్ మండిపడ్డారు. ఆయన ఆదివారం తాడేపల్లిలో మీడియాతో మట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్‌కింద 2019 జూన్ నుంచి 2022 డిసెంబర్ దాకా రూ.15,589.38 కోట్లు ఖర్చు చేసిందన్నారు. టీడీపీ ఐదేళ్లలో రూ. 12,487.50 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు.

వనితమ్మకు క్షమాపణ చెప్పాలి

కుప్పం వైఎస్సార్‌సీపీ నేతల డిమాండ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కుప్పం రూరల్: రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనితమ్మకు నారా లోకేశ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. కుప్పంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ విద్యాసాగర్, కుప్పం, శాంతిపురం మండల కన్వీనర్లు హెచ్‌ఎం మురుగేష్, బుల్లెట్ దండపాణి మీడియాతో మాట్లాడారు. బీసీ నేతల సమావేశంలో వనితను కించపరిచేలా మాట్లాడడం సబబు కాదన్నారు. 35 ఏళ్లుగా చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో ఉన్న 80లక్షల మంది వన్నెకుల క్షత్రియ ఓట్లతో గెలిచి ఇప్పుడు ఆ సామాజికవర్గానికి చెందిన మహిళను దుర్భాషలాడడం మంచిది కాదన్నారు. వారి గురించి చంద్రబాబు ఏనాడైనా పట్టించుకున్నారా.. అని ప్రశ్నించారు. తాము మీకంటే బూతులు మాట్లాడగలమని, తమక సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి క్రమశిక్షణ నేర్పారని.. అందుకే సంయమనం పాటిస్తున్నామన్నారు. లోకేశ్ కుప్పం నియోజకవర్గం దాటేలోపు వనితమ్మకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. మరోవైపు.. లోకేశ్ వ్యాఖ్యలపై వనిత స్పందిస్తూ.. 'నీకు అక్కా, చెల్లి లేరా.. వారినీ ఇలాగే సంబోధిస్తావా' అని వనిత ప్రశ్నించారు.

దుర్గమ్మకు వెండి గంగాళం



ఈవో భ్రమరాంబకు వెండి గంగాళాన్ని అందచేస్తున్న దాత అన్విత కుటుంబం సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని దుర్గమ్మ ఆలయంలో మహా నివేదనకు అవసరమైన వెండి గంగాళాన్ని హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆదివారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన అన్విత కుటుంబం సుమారు 3.380 కిలోల వెండితో తయారు చేయించిన గంగాళాన్ని ఆలయ ఈవో భ్రమరాంబకు అందజేశారు. సుమారు రూ.2.75 లక్షల వ్యయంతో తయారు చేయించిన వెండి గంగాళాన్ని నిత్యం అమ్మవారి నివేదన సమయంలో ఆహార పదార్థాలను తీసుకువెళ్లేందుకు ఉపయోగించాలని దాతలు ఆలయ ఈవోను కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాలను అందజేశారు.

దేవదేవుని పెళ్లికి.. ఊరంతా పెద్దలే..

- ఉత్సవంలో పలు కుటుంబాలకు ప్రాధాన్యం
- అనాదిగా వస్తున్న ఆచారం
- లక్ష్మీనృసింహుని కల్యాణానికి ఎందరో కర్తలు

సాక్షి, అమలాపురం/సఖినేటిపల్లి: 'ఇంటికో పువ్వు.. ఈశ్వరునికో మాల' అంటారు. అలాగే 'దేవుని పెళ్లికి ఊరంతా పెద్దలే' అని కూడా అంటారు. అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ సంరంభాన్ని తరచి చూస్తే.. ఈ రెండూ నిజమేననిపించక మానదు.. గోదారమ్మ నీటి మహత్యమో.. ఆదిదేవుని కల్యాణ మహోత్సవ సంకల్పమో తెలియదు కానీ.. నారసింహుని కల్యాణంలో గోదావరికి ఇరు తీరాల్లో ఉన్నవారూ భాగస్వాములే కావడం విశేషం. ఇటు కోనసీమ వాసులతో పాటు.. అటు పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు సైతం ఈ కల్యాణోత్సవంలో తమ వంతు సేవలందిస్తారు. ఈ ఉత్సవాలకు ఎంతోమంది కర్తలున్నా.. కొన్ని కుటుంబాల వారు కీలక భూమిక పోషించడం అనాదిగా వస్తోంది. కల్యాణ ఘట్టంలో పాల్గొనే మొగల్తూరు రాజులు.. స్వామివారి చక్రస్నానంలో పేరూరు వేద పండితులు.. రథోత్సవం ముందు పల్లకీ సేవ చేసే రావి, యనుముల కుటుంబాల వారు.. వధూవరులుగా అమ్మ, స్వామివార్ల అలంకరణలో ఉండపల్లి.. బెల్లంకొండ కుటుంబీకులు.. ఇలా చెప్పుకుంటూ పోతే అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవారి తరపున ఎంతోమంది పెద్దలై.. ఆకాశమంత పందిరిలో.. భూదేవంత పీట వేసి.. ఆ పరంధాముడి పరిణయాన్ని అంగరంగ వైభవంగా జరిపించి మురిసిపోతారు.



చక్ర పెరుమాళ్లను తలపై పెట్టుకుని సముద్ర స్నానానికి వెళుతున్న పేరూరు వేద పండితులు

చక్రస్నానంలో పేరూరు భాగస్వామ్యం

లక్ష్మీనరసింహస్వామి వారి చక్ర పెరుమాళ్లు 14వ శతాబ్దంలో సముద్రంలో పడిపోయింది. పేరూరుకు చెందిన నేమాని నరసింహ సోమనాథ చయనులు అంతర్వేది వద్ద సముద్ర తీరంలో 89 రోజులు తపస్సు చేయగా ఆ చక్రం దొరికింది. ఈ నేపథ్యంలో స్వామివారి కల్యాణ సమయంలో తమకు అగ్రతాంబూలం ఇవ్వాలని పండితులు నాటి రాజును కోరారు. దీంతో పేరూరు వేద పండితుల చేతుల మీదుగా చక్రస్నానం నిర్వహిస్తూండటం దశాబ్దాల కాలంగా వస్తోంది.

వధూవరులను చేసే ఉండపల్లి.. బెల్లంకొండ

కల్యాణానికి ముందు స్వామివారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించే అరుదైన అవకాశం బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబాల వారికి దక్కింది. అంతర్వేది కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా రథసప్తమి నాడు నిర్వహించే ముద్రికాలంకరణలో స్వామి వారికి పంచెను బెల్లంకొండ వారు, అమ్మవారికి చీరను ఉండపల్లి వారు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే చోర సంవాద ఘట్టం పూజా సామగ్రిని కూడా ఈ రెండు కుటుంబాల వారే తీసుకు వెళ్లడం విశేషం.

కల్యాణ ఘట్టంలో మొగల్తూరు రాజులు, అర్చకులు

లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు రాజులు పెండ్లి కుమారుడి తరఫున పాల్గొంటారు. చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా ప్రస్తుత వారసుడు రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహదూర్ కల్యాణోత్సవంలో స్వామివారి తరఫున నిలబడతారు. వీరి కుటుంబం ఆలయానికి భూములు, ఆభరణాలు అందించినట్టు శాసనాల్లో ఉన్నాయి.

రథోత్సవం నాడు..

శృంగవరప్పాడుకు చెందిన రావి, యనుముల కుటుంబాలకు చెందిన వారు రథోత్సవం రోజున ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకు వస్తారు. పల్లకీ ముందున రావి కుటుంబానికి చెందిన వారు.. వెనుకన యనుముల కుటుంబాల వారు మోస్తూ ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రథం వరకూ తీసుకువస్తారు.

తలంబ్రాలు పంపే కలిదిండి కుటుంబం

పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం పాలమూరుకు చెందిన కలిదిండి రాజయమ్మ అంతర్వేదిలో వందేళ్ల క్రితం స్థానికంగా సత్రం నిర్మించారు. దీని నిర్వహణకు దానం చేసిన భూముల్లో పండే ధాన్యాన్ని బియ్యంగా మార్చి, వాటిని తలంబ్రాలుగా తయారు చేసి అందించడం ఆనవాయితీగా వస్తోంది. రాజయమ్మ కుటుంబ సభ్యుడైన కలిదిండి సుబ్బారాజు ఆధ్వర్యంలో ప్రస్తుతం తలంబ్రాలు తీసుకువస్తున్నారు.



> ప్రతి అబద్ధం విషం. హాని చేయని అబద్ధాలే లేవు. సత్యం మాత్రమే సురక్షితం. సత్యం మాత్రమే ఓదార్పును ఇస్తుంది. అది విరగని వజ్రం.
>
> – లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, జనవరి, 30

సంఘర్షణ పర్వం

'మానవ జీవితమే ఒక మహాభారతం/ అది మంచి చెడుల రెంటి నడుమ నిత్య ఘర్షణం/ నరులుండే ఇల సకలం కురుక్షేత్రమే/ ఇక జరుగుతుంది అనుక్షణం ధర్మయుద్ధమే'– 'కురుక్షేత్రం' చిత్రం కోసం శ్రీశ్రీ రాసిన పాట ఇది. మానవ జీవితాన్నే మహాభారతంగా, మంచి చెడుల నడుమ నిత్యం జరిగే ఘర్షణగా ఆయన అభివర్ణించాడు. కాలాలు మారినా, తరాలు మారినా మంచి చెడుల మధ్య జరిగే ఘర్షణ సమసిపోయే పరిస్థితులు లేవు. భవిష్యత్తులోనూ అలాంటి పరిస్థితులు ఉండవేమో! 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం/ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని కూడా అన్నాడు శ్రీశ్రీ.

ప్రపంచంలో దుర్బలులను పీడించే బలవంతుల జాతి ఉన్నంత వరకు ఘర్షణలు తప్పవు. ఘర్షణలు ముదిరినప్పుడు యుద్ధాలూ తప్పవు. అందుకే తన 'నా దేశం నా ప్రజలు' అనే 'ఆధునిక మహాభారతం'లో శేషేంద్ర ఇలా అంటారు: 'పోట్లాట నేను బతకడానికి పీల్చే ఊపిరి/ నా అవయవాలకు నీచంగా వంగే భంగిమలు తెలియవు/ నేను సత్యాగ్రాహిని/ నా గుండెల్లో బద్దలవుతున్న అగ్నిపర్వతం/ నా గొంతులో గర్జిస్తున్న జలపాతం'. ఎగుడు దిగుడు సమాజం ఉన్నంత వరకు మనుషులకు సంఘర్షణ తప్పదు. సంఘర్షణే ఊపిరిగా బతకక తప్పదు. అనాది నుంచి ఈ సంఘర్షణే సాహిత్యానికి ముడి సరుకు.

మన భారతీయ సాహిత్యంలో తొలినాటి కావ్యాలు రామాయణ, మహాభారతాలు. వాల్మీకి విరచిత రామాయణం ఆదర్శ జీవితానికి అద్దం పడుతుంది. వ్యాసుడు రచించిన మహాభారతం వాస్తవ ప్రపంచాన్ని కళ్లకు కడుతుంది. ఆధునిక సాహిత్యంలోనూ అనేక రచనలకు ప్రేరణగా నిలిచిన కావ్యాలు రామాయణ, మహాభారతాలు. రామాయణ, మహాభారత గాథల నేపథ్యంలో దాదాపు అన్ని భారతీయ భాష ల్లోనూ అనేక కథలు, నాటకాలు, నవలలు వెలువడ్డాయి. కొన్ని సినిమాలుగా తెరకెక్కాయి. మన తెలుగు సాహిత్యం మహాభారత అనువాదంతోనే మొదలైంది. నన్నయ మొదలుపెట్టిన మహా భారత అనువాదాన్ని తిక్కన, ఎర్రనలు వేర్వేరు కాలాల్లో పూర్తి చేశారు. తెలుగులో మాత్రమే కాదు, మన దేశంలోని అన్ని భాషల్లోనూ తొలినాటి కవులు రామాయణ, మహాభారతాలను కావ్యాలుగా రాశారు. మన పొరుగు భాష కన్నడంలో పంపన 'విక్రమార్జున విజయం' రాశాడు. ఇది 'పంప భారతం'గా ప్రసిద్ధి పొందింది.

మహాభారతంలోనే కాదు, అమృతోత్సవ భారతంలోనూ అనేకానేక ఘర్షణలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. సంక్లిష్టమైన మానవ జీవితంలోని నిత్య ఘర్షణలను ప్రతిఫలించి, సమాజంలోని చెడును చెండాడి, మంచివైపు మొగ్గుచూపేదే ఉత్తమ సాహిత్యంగా కాలపరీక్షను తట్టుకుని తరతరాల వరకు మనుగడలో ఉంటుంది. కాలక్షేపం కోసం రాసే ఆషామాషీ రచనలు కాలప్రవాహంలో ఆనవాలే లేకుండా కొట్టుకుపోతాయి. 'రచయిత తాను వ్రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను' అన్నారు రావి శాస్త్రి. భాషా ప్రాంతాలకు అతీతంగా రచయితలకు ఈ ఎరుక ఉండి తీరాలి. అలాంటి ఎరుక కలిగిన రచయితలు మనకు చాలామందే ఉన్నారు. అయితే, వారిలో గుర్తింపు కొందరికే దక్కుతోంది. ఒక ఎరుక కలిగిన రచయితకు గుర్తింపు దక్కినప్పుడు సాహితీ లోకం సంబరపడుతుంది. సుప్రసిద్ధ కన్నడ రచయిత ఎస్.ఎల్.భైరప్పకు 'పద్మభూషణ్' దక్కడం అలాంటి సందర్భమే!

ఆధునిక కన్నడ రచయితల్లో భైరప్పకు ప్రత్యేక స్థానం ఉంది. మహాభారత గాథ మర్మాలను విశదీకరిస్తూ, ఆనాటి ఆచారాలను, అంధ విశ్వాసాలను తుత్తునియలు చేస్తూ ఆయన రాసిన 'పర్వ' నవల ఆయనకు ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 'పర్వ'లో కోపోద్రిక్తురాలైన ద్రౌపది 'ఆర్య ధర్మమంటే వేట, తాగడం, జూదం, ఆడవాళ్ల సహవాసం, స్వయంవరం పేరుతో రాచకన్యలను అపహరించి పెళ్లాడటం, కనీసం పదిమంది దాసీలనైనా పెళ్లి కానుకలుగా తెచ్చుకుని వాళ్లతో సుఖించడం' అని నిరసిస్తుంది. 'పర్వ' నవలలో ఇదొక మచ్చుతునక మాత్రమే! ఇంత బట్టబయలుగా రాసేస్తే ఛాందసులు ఊరుకుంటారా? అందుకే, భైరప్పను కీర్తిప్రతిష్ఠలు వరించడంతో పాటు వివాదాలూ చుట్టుముట్టాయి. ఆయన రాసిన 'వంశవృక్ష', 'తబ్బలియు నీనాదె మగనె/ గోధూళి' వంటి రచనలపైనా వివాదాలు రేగాయి. 'వంశవృక్ష' తెలుగులో 'వంశవృక్షం' పేరుతో బాపు దర్శకత్వంలో సినిమాగా వచ్చింది. భైరప్ప 1996లో తన ఆత్మకథను 'భిత్తి' పేరుతో వెలుగులోకి తెచ్చారు. ఇది పదకొండు పునర్ముద్రణలను పొందింది. ఆయన నవలల్లో 'దాటు', 'పర్వ' వంటివి తెలుగులోనూ అనువాదం పొందాయి.

సంఘర్షణలమయమైన మహాభారతాన్ని 'పర్వ'గా అందించిన భైరప్ప జీవితంలోనూ అనేక ఘర్షణలు ఉన్నాయి. బాల్యంలోనే తల్లి, సోదరులు ప్లేగు వ్యాధికి బలైపోయారు. చిన్నా చితకా పనులు చేసుకుంటూనే ఉన్నత చదువులు చదివి, అధ్యాపక వృత్తిలో స్థిరపడ్డారు. స్వయంగా అనుభవించిన సంఘర్షణల వల్ల జీవితంపై తనదైన దృక్పథాన్ని ఏర్పరచుకుని, రచనా వ్యాసంగం మొదలుపెట్టి, సాహితీరంగంలో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. సంఘర్షణలు రాటుదేల్చిన రచయిత చేసే రచనల్లో జీవన సంఘర్షణలు ప్రతిఫలిస్తాయి. అవి ఆ రచయిత రచనలను అజరామరం చేస్తాయి.

డాక్యుమెంటరీపై మాటల సెల్ఫ్ గోల్

కామెంట్



కరణ్ థాపర్

గుజరాత్‌లో 2002లో జరిగిన హింసపై 'బీబీసీ' నిర్మించిన తాజా డాక్యుమెంటరీని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ఖండించారు. తాను దాన్ని చూడలేదని పేర్కొంటూనే, దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా, తప్పుడు వాదనతో, ప్రచార యావతో తీసిన డాక్యుమెంటరీగా దాన్ని ప్రకటించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ, హోమ్ శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి పలు మంత్రిత్వ శాఖలు, సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు... బీబీసీ తాజా డాక్యుమెంటరీపై కనీసపాటి ఆలోచన కూడా లేకుండా తీవ్ర ధోరణిలో మాట్లాడారు. భారతదేశ సార్వభౌమత్వాన్నీ, సమగ్రతనూ ఆ డాక్యుమెంటరీతో కించపర్చారంటూ వారు ఆరోపించారు. భారతదేశంలో అసలు ప్రసారమే చేయని ఒక డాక్యుమెంటరీ చిత్రం మన దేశాన్ని ఆ స్థాయిలో ముక్కలు ముక్కలు చేస్తుందా? వారు వ్యక్తం చేసిన ఆందోళన బీబీసీ పైనా, దాని డాక్యుమెంటరీ పైనా కాదు. మన దేశ మనుగడ పైనే వారు కలవరం వ్యక్తపరిచినట్టుగా తయారైంది. తప్పుగా మాట్లాడటం ద్వారా వారు తమ సెల్ఫ్ గోల్ చేసుకున్నారు.

ఈ విషయం గురించి నేను ఎక్కువగా ఆలోచించేకొద్దీ, నిజానికి సమస్య మనలోనే ఉందని చెబుతాను. సాధారణంగా రాజకీయ నాయకుల వద్ద ప్రతి సమస్యకూ పరిష్కారం ఉండాలనీ, ప్రతి సమస్యపై వారు వ్యాఖ్యానించాలనీ, ప్రతి వ్యక్తికి సంబంధించి అర్థవంతమైన, కచ్చితమైన అభిప్రాయాన్ని కూడా కలిగి ఉండాలనీ, అన్ని పరిస్థితులనూ వారు అర్థం చేసుకోవాలనీ మనం భావిస్తుంటాం. కాని వారు అలా చేయలేరు. అది వారికి సాధ్యం కూడా కాదు. అలాగని తాము దేన్నయినా సరే... చేయగలమని వారు నటించినట్లయితే దానిని మనం వారిని అగౌరవించాల్సిన పని లేదు. సూటిగా చెప్పాలంటే, రాజకీయ నాయకులు వారి పట్ల మనకు ఉందనుకుంటున్న గౌరవాన్ని కోల్పోవలసిన అవసరం లేదు. అయితే వారు గుర్తించనిది ఏమిటంటే, మన అంచనాలు వారికి ఒక ఉచ్చు లాంటివి. ఆ సంగతి వారు స్పష్టంగా గ్రహిస్తూనే, గర్విస్తూనే మనం ఏర్పరచిన ఉచ్చులో చిక్కుకుంటూ ఉంటారు.

ఇవాళ ఆలోచనాత్మకమైన, మేధాసహితమైన స్పందనల కంటే ఆకట్టుకునేలా అభిప్రాయాలు వెల్లడించడమే ఎక్కువ అవసరమని రాజకీయ నాయకులు భావించే దశకు మనం చేరుకున్నాం. ఎందుకంటే, వీటిలో ఆకర్షణీయమైన స్పందనే పతాక శీర్షికలకు ఎక్కుతుంది. అది వారికి ప్రచారాన్ని కల్పిస్తుంది. మరోవైపున ఆలోచనతో కూడిన స్పందన మరింత అర్థవంతంగానూ, సహాయకారిగానూ ఉండవచ్చు కానీ దీన్ని అర్థం చేసుకోవడానికి కాస్త ఏకాగ్రత అవసరమవుతుంది. కాబట్టి పునః పరిశీలనకు అది పిలుపునిస్తుంది. పైగా ఆకర్షణీయమైన స్పందనకు సరిసమానమైన ప్రభావాన్ని మేధాసహితమైన స్పందన కలిగించనే కలిగించదు.

'షారుఖ్ ఖాన్ ఎవరు? అతడి గురించి నాకేమీ తెలీదు' అని అస్సామ్ ముఖ్యమంత్రి హిమంతా బిశ్వ శర్మ ఇటీవల చేసిన ప్రకటన దీనికి అత్యుత్తమమైన ఉదాహరణ అని నేను చెబుతాను. గౌహతిలో విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, ఆయన చేసిన ఈ వ్యాఖ్య అత్యంత వివాదాస్పదమైంది. అంతేకాదు. ఆయన మాటల్లో అసలు నిజం లేదు. ఒకవేళ ఆయన వ్యాఖ్య గనక నిజమే అయితే... మన దేశంలోని ప్రజల గురించి ఏ మాత్రం తెలియని స్థితిలో సదరు అస్సామ్ ముఖ్యమంత్రి ఉన్నారని చెప్పక తప్పదు. నిజానికి ఆయన చేసిన ఆ ప్రకటన అమితాబ్ బచ్చన్ స్వయంగా 'నరేంద్ర మోదీ ఎవరు? ఆయన గురించి నాకేమీ తెలీదు' అని చెప్పినట్టు ఉంది.



India: The Modi Question

ప్రముఖ హిందీ సినీ కథానాయకుడు షారుఖ్ ఖాన్ ఎవరో తెలియని భారతీయులు ఎవరైనా ఉంటారా అని నాకు సందేహం. అలాగే, భారతీయ జనతా పార్టీ నేత – ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి కూడా తెలియనివారు ఉన్నారంటే కూడా సందేహించాల్సి ఉంటుంది. అందుకనే అస్సామ్ ముఖ్యమంత్రి వ్యాఖ్యను జనం దృష్టిని ఆకర్షించడానికి, జనం తమను ఏదో ఒకలా గుర్తుంచుకునేలా చేసే తప్పుడు ప్రయత్నంగానే చూడాల్సి ఉంటుంది. ఈ ఉదంతంలో అన్నీ తప్పుడు అంశాలే ఉన్నాయని చెప్పాల్సి ఉంటుంది.

విషాదం ఏమిటంటే, కనీసపాటి ఆలోచన కూడా లేకుండా షారుఖ్ ఖాన్ గురించి అలా మాట్లాడటం వల్ల అస్సామ్ ముఖ్యమంత్రి హిమంతా బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా మూర్ఖుడిగా మారిపోయారు. 2002 నాటి గుజరాత్ హింసపై బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) రూపొందించిన డాక్యుమెంటరీని విమర్శించి, ఖండించాలన్న ఉద్దేశంతో భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి కూడా దాదాపు ఇలాంటి పనే చేశారు. ఆ డాక్యుమెంటరీని తాను చూడలేదని ఒప్పుకుంటూనే, నిర్దిష్టంగా ఒక తప్పుడు వాదనను జనంలోకి తీసుకుపోవడానికి, ప్రచారమే పరమావధిగా తీసిన డాక్యుమెంటరీగా దాన్ని ప్రకటించారు. పైగా అది పక్షపాతంతో కూడుకున్నదనీ, దాంట్లో నిష్పాక్షికత లోపించిందనీ నిందించారు.

అయితే బీబీసీ తాజా డాక్యుమెంటరీని చూడనప్పుడు దాంట్లోని విషయాలను ఆయన ఎలా ప్రస్తావించారు? అది కూడా తానొక అధికారిక ప్రతినిధి అయ్యుండి, తాను చూడని విషయంపై ఎలా వ్యాఖ్యానించారు అనే ప్రశ్న వస్తుంది. అయితే తాను దేని గురించి మాట్లాడుతున్నదీ తనకు స్పష్టంగా తెలుసన్నట్టుగా ఆయన చేసిన వ్యాఖ్యలు, వర్ణనలు ఉన్నాయి. అధికారిక ప్రతినిధి చేసే ప్రకటన సాధికారికంగా ఉంటుందనీ, విశ్వసించదగినదనీ ఎవరైనా భావిస్తారు. వాళ్ళూ వీళ్ళూ చెబుతుంటే విని చెబుతున్నట్టుగా, వేరెవరి అభిప్రాయాలో మళ్లీ ప్రస్తావించినట్టుగా ఉంటాయనీ, ఉండాలనీ ఎవరూ అనుకోరు. కానీ ఆయన తాజా వ్యాఖ్యలన్నీ అచ్చంగా అలాగే ఉన్నాయని గ్రహించాలి.

భారత విదేశీ వ్యవహారాల శాఖ, హోమ్ శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి పలు మంత్రిత్వ శాఖలకూ, సంస్థలకూ చెందిన పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ అధికారులు దాదాపుగా దేశంలోని అన్ని పత్రికలతో మాట్లాడారు. బీబీసీ తాజా డాక్యుమెంటరీపై తమ వాదనను బలంగా వినిపించడం కోసం కనీసపాటి ఆలోచన అయినా కూడా లేకుండా వారు తీవ్ర ధోరణితో మాట్లాడారు. ఆ తొందరలో చివరకు భారతదేశం గురించి ఇబ్బందికరమైన ప్రశ్నలు పొడసూపేలా చేశారు. ఆ డాక్యుమెంటరీలో భారత సార్వభౌమత్వాన్నీ, సమగ్రతనూ కించపర్చారంటూ వారు ఆరోపించారు. నిజమా? నిజంగానే అలా జరిగిందా?

ఇంతకూ వారు గుర్తించని విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే – తాము ఏం మాట్లాడుతున్నాం అనే విషయం గురించి వారు కనీసం ఒక్కసారి కూడా ఆగి, నింపాదిగా ఆలోచించలేపోయారు. భారతదేశంలో అసలు ప్రసారమే చేయని ఒక డాక్యుమెంటరీ చిత్రం మన దేశాన్ని ఆ స్థాయిలో ముక్కలు ముక్కలు చేస్తుందా? పైగా యూట్యూబ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్రచార, ప్రసార వేదికలను వాడేవారు మన జనాభాలో అతి తక్కువమంది అని తప్పక గుర్తుంచుకోవాలి. ఒకవేళ ఆ కొద్దిమంది ఆ డాక్యుమెంటరీ చూసినంత మాత్రాన మన జాతీయ చక్రమే కదిలిపోతుందా? విచ్ఛిన్నమవుతుందా?

చివరకు వచ్చేసరికి వారు వ్యక్తం చేసిన ఆందోళన అంతా బీబీసీ పైనా, దాని డాక్యుమెంటరీ పైనా కాదు. మన దేశంలోని పరిస్థితి పైనా, దేశ మనుగడకు సంబంధించిన అంశం పైనే వారు కలవరం వ్యక్తపరిచినట్టు అయింది. అలా వారు దాన్ని గురించి తప్పుగా మాట్లాడటం ద్వారా సెల్ఫ్ గోల్ చేసుకున్నట్టు అయింది.

ఇప్పుడు మన ప్రియమైన ముఖ్యమంత్రి, మన అధికార ప్రతినిధి, అలాగే నిగూఢమైన మన ప్రభుత్వ సీనియర్ అధికారులు ఈ విషయంపై భయకంపిత స్వరంతో మాట్లాడి ఉన్నట్లయితే నేను దానికి ఏమాత్రం భయపడను. బదులుగా ముసిముసిగా నవ్వుకునేవాడిని.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్ఫూర్తి ప్రదాత



దేశ నిర్మాణం ఒక నైతికమైన ప్రక్రియ. ద్వంద్వ నీతిని పాటిస్తూ మనం ఈ పనిలో విజయవంతంగా పాల్గొనలేం. గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు, మా స్ఫూర్తి, పంజాబ్ కేసరి లాలా లజపతి రాయ్‌కి ఆత్మశుద్ధితో నివాళులు అర్పించాం.

– మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

మూకుమ్మడి దాడి



మోదీకి వ్యతిరేకంగా 2024 ఎన్నికలకు పడిన తొలి అడుగు ఈ బీబీసీ డాక్యుమెంటరీ. సరిగ్గా ఎన్నికలకు ముందు పడే రెండో అడుగు... రామ మందిర నిర్మాణంపై అంతిమ దాడి. ఏమాత్రం ఆశ్చర్యం కలిగించబోనిది కూడా ఉంది. మోదీ పదేళ్ల పాలనా వైఫల్యాల కథనాలు త్వరలోనే పత్రికల్లో ప్రత్యక్షం అవుతాయి.

– తుషార్ గుప్తా, సంపాదకుడు

కడుపు కాలుతున్నా...



పాకిస్తాన్‌లో ఈరోజు 10 కిలోల నాణ్యమైన గోధుమ పిండి ధర 2,500 రూపాయలు. అయినప్పటికీ వారి విదేశీ వ్యవహారాల మంత్రి బి.బి. భుట్టో జర్దారీ కశ్మీర్ గురించి మాట్లాడుతూ, మోదీని గుజరాత్ కసాయిగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంలో కశ్మీర్ సందర్శనకు జర్దారీకి స్వాగతం.

– లక్కీ, సివిల్స్ అభ్యర్థి

బూస్టర్ వేస్ట్



ఫైజర్ కంపెనీ కోవిడ్ వ్యాక్సిన్‌ల కోసం ఇజ్రాయిల్‌ను ప్రయోగశాలగా ఉపయోగించుకుంది. ఇప్పుడు ఇజ్రాయిల్‌లో ఎవరూ కూడా సురక్షితం కాని ఆ పనికిమాలిన బూస్టర్ డోస్‌లను వేయించుకోవాలని కోరుకోవడం లేదు. చరిత్రలోనే అత్యంత ఘోరమైన ఔషధ వైఫల్యం ఇది.

– డాక్టర్ ఎలి డేవిడ్, పరిశోధకుడు

విజయీభవ



కొన్నిసార్లు అన్నీ తెలుసుకుని అన్నిటి గురించీ అభద్రతలోకి జారుకోవడం కన్నా, అసలేమీ తెలుసుకోకుండా ఆనందంగా ఉండటం మంచిది. శివ్ థాకరే బిగ్‌బాస్-16 విజేత అవ్వాలని కోరుకుంటున్నా.

– జివేష్, కర్మవాది

మహాత్మా! చూస్తున్నావా!!

ఓ మహాత్మా!
చెడు అనకు, వినకు, చూడకు
అన్న పలుకులు నీవైతే
నేటి సమాజానికవే ప్రీతిపాత్రం.
అహింసాయోధుడవు నీవు.
హింసా వీరులు నేటి నాయకగణం.
సర్వమత ఐక్యత నీ పథం
అనైక్యతే నేటి జనుల మార్గం.

మద్యం వద్దని నీవు,
అదే ముద్దని నేటి ప్రభుత.
మహిళా సాధికారత నీ కల, మరి నేడో
కలకంఠి కంట కన్నీరు చూడందే
నిద్రపోని పాషండులెందరో!
గ్రామ స్వరాజ్యం నీ ఊహాసుందరి,
దాని అభావానికై
నేటి పాలకుల శక్తివంచన లేని కృషి
నీవు చూపిన నాటి విరి బాట
నేటి రాజకీయులకు ముళ్లబాట.

సమానతే నీ ధ్యేయం,
అసమానతే నేటి తరం లక్ష్యం.
నిరాడంబరతే నీ భావనైతే
ఆడంబరయుత బోకడలు
నేటి యువత చిరునామా!
నాటి నీ పాదయాత్ర ఏకతా రాగమైతే
నేటి పాదయాత్రలు
హింసాయుత మార్గాలు,
శాంతి భద్రతల భగ్నానికి
దగ్గర దారులు.
బాపూ! నీ మార్గంలో
నేటితరం పయనించేలా దీవించవా!



– వేమూరి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం
(నేడు మహాత్మా గాంధీ వర్ధంతి)

బడ్జెట్‌లో సంక్షేమ మార్గం పడతారా?

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

కేంద్రం ప్రతియేటా ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ కారణంగా ప్రభావితం అయ్యే వర్గాల ప్రజలలో బడ్జెట్ ముందు సహజంగానే కొంత ఉత్కంఠ నెలకొంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు ఉండొచ్చునన్న అంచనాలు ఉన్నాయి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ గత 8 ఏళ్లుగా వల్లె వేస్తున్నారు. అంటే – దేశంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం కలగజేయడం, వారి జీవన ప్రమాణాలు పెంచడం తమ లక్ష్యం అని చెప్పుకొంటూ వస్తున్నారు. పేదలకు గృహనిర్మాణం, పారిశుద్ధ్యం మెరుగుదల, పేద కుటుంబాలన్నింటికీ గ్యాస్ సిలిండర్ల సరఫరా, నగదు బదిలీ పథకాలు, రైతాంగానికి పెట్టుబడి సాయం (పీఎం కిసాన్), వృద్ధాప్య పెన్షన్లు, ఆయుష్మాన్ భారత్, పేదలకు ఉచిత రేషన్ తదితర పథకాలన్నీ తమ సంక్షేమ విధానానికి చిహ్నంగా బీజేపీ అభివర్ణించుకొంటున్నది. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని అందిస్తున్నప్పుడు 'సబ్ కా వికాస్' ఆచరణలోకి రావాలి కదా!

దేశ జనాభాలో 1 శాతం మంది ధనికుల చేతుల్లో 40 శాతం దేశ సంపద చిక్కుకుని ఉందనీ; 50 శాతం జనాభా అంటే... 65 నుంచి 70 కోట్ల మంది ప్రజల చేతుల్లో కేవలం 3 శాతం సంపద మాత్రమే ఉన్నదనీ తాజా గణాంకాలు వెల్లడించాయి. మరోపక్క ఈ 8 ఏళ్లల్లో బ్యాంకుల 14.38 లక్షల కోట్ల రూపాయల మొండి బకాయిలను రద్దు చేశారు. అయినప్పటికీ ఇంకా బ్యాంకుల నిరర్థక ఆస్తుల గ్రాస్ రేటు 6.5 శాతంగా ఉంది. పెట్రో ధరల పెరుగుదల చరిత్రలో లేనంతగా ఈ 8 ఏళ్లల్లో పెరిగింది. డీజిల్‌పై 512 శాతం, పెట్రోల్‌పై 194 శాతం, గ్యాస్ సిలిండర్లపై 185 శాతం భారం మోపారు. అన్ని వస్తువులపై గరిష్ఠంగా వేస్తున్న జీఎస్టీ, గృహనిర్మాణ వస్తువుల ధరల పెరుగుదల... తదితర భారాలతో పోల్చితే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం ఎందుకూ కొరగాకుండా ఉంది.

ఉద్యోగాల సృష్టి చేయలేని ఆర్థికాభివృద్ధి వల్ల ఎటువంటి లాభం లేదని గత కొన్నేళ్ల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగాలు లేకుండా ఉన్న యువత సంఖ్య 21.8 కోట్లుగా ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. దేశంలో ఇంకా అనేక ప్రాంతాలకు రైలు రవాణా విస్తరించాల్సి ఉండగా, దేశంలోని ఎగువ మధ్యతరగతి వారి కోసం 'వందే భారత్' రైళ్లను ప్రవేశపెట్టారు. రైల్వే ట్రాక్‌ల సామర్థ్యం అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ, వాటిని పూర్తి స్థాయిలో పటిష్ఠపర్చకుండా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వందే భారత్ రైళ్లను ఒక్కొక్కటి రూ. 120 కోట్ల వ్యయంతో దశల వారీగా మొత్తం 475 ప్రారంభించాలని సంకల్పించడం ఆశ్చర్యం కలిగించకమానదు.

2014లో అధికారంలోనికి వచ్చిన బీజేపీ ఈ 8 ఏళ్లలో సంక్షేమబాట నుంచి క్రమంగా వైదొలుగుతూ వస్తోంది. 2016లో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొన్న రెండు ప్రధాన నిర్ణయాలు దేశ ఆర్థికరంగాన్ని అతలా కుతలం చేశాయి. మొదటిది పెద్దనోట్ల రద్దు; రెండోది జీఎస్టీ అమలు. వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చి వేస్తామని చెప్పి కార్యాచరణ చేపట్టకపోవడంతో రైతులు రెట్టింపు నష్టాల్లో కూరుకుపోయారు. ప్రస్తుతం దేశంలో అనేక రాష్ట్రాలలో రైతులు క్రాప్ హాలిడే ప్రకటి స్తున్నారు. దానివల్ల ఆహార ధాన్యాల నిల్వలు పడిపోతు న్నాయి. గోదాముల్లో ఇప్పుడు కేవలం 4.92 కోట్ల మెట్రిక్ టన్నుల గోధుమలు, బియ్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు భారత ఆహార సంస్థ తెలియజేసింది.

కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యరంగంపై కొంతమేర అనివార్యంగా వ్యయాన్ని పెంచింది. టీకాల కొనుగోలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా పెంపుదల వంటి మౌలిక సదుపాయాలపై గణనీయంగా ఖర్చు చేసింది. అయినప్పటికీ, ఆ మొత్తం.. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో 2 శాతానికి మించలేదు.

ఇక, విద్యారంగాన్ని పరిశీలిస్తే, 2012–13లో యూపీఏ ప్రభుత్వం జీడీపీలో 3.36 శాతం నిధుల్ని కేటాయించగా, ఎన్డీఏ వచ్చిన ఈ 8 ఏళ్లల్లో విద్యారంగంపై చేస్తున్న వ్యయంలో నామమాత్రపు పెరుగుదల మాత్రమే ఉంది. నూతన విద్యా విధానాన్ని ఘనంగా ప్రకటించినప్పటికీ అందుకు అనుగుణంగా కేటాయింపులు పెంచలేదు. మధ్యాహ్న భోజన పథకానికి (ప్రధాన మంత్రి పోషణ్) వెచ్చిస్తున్న నిధుల్లో గత 7 ఏళ్లుగా ఎలాంటి పెరుగుదలా



లేదు. కీలకమైన విద్యారంగంలో కేటాయింపులు పెంచకుండా దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లగలరు? ఎంతో కీలకమైన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగంలో ఇతర దేశాలు 3 శాతం మేర కేటాయింపులు చేస్తుంటే భారత్ కేటాయింపులు గత దశాబ్ద కాలంగా 1 శాతం మించడం లేదు.

2008, 2009 సంవత్సరాలలో భారత్ అత్యధిక స్థాయిలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల్ని, 2.5 శాతం జీడీపీ మేర ఆకర్షించింది. కానీ, ఆ మొత్తం క్రమంగా తగ్గిపోతూ 2021 నాటికి 1.4 శాతానికి చేరింది. నిరుద్యోగిత పెరుగుదల వల్ల ప్రజల పొదుపు గణనీయంగా పడిపోయింది. క్యాపిటల్ ఫార్మేషన్‌లో కీలకమైన పొదుపు మొత్తాలు సన్నగిల్లడంతో... కేంద్ర ప్రభుత్వం అధిక వడ్డీ రేట్లకు వివిధ మార్గాల ద్వారా అప్పులు తెచ్చుకొంటోంది. ఈ 8 ఏళ్లల్లో కేంద్రం కొత్తగా చేసిన అప్పులు రూ. 91 లక్షల కోట్లు దాటాయి.

అయితే, బ్రిటన్‌ను పక్కకు తోసి భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇదెలా సాధ్యపడింది? ఇందులో కేంద్ర ప్రభుత్వం చొరవను సమీక్షించినట్లయితే, గత 20 సంవత్సరాలలో, ఇతర దేశాలకంటే భారత్ ఐటీ రంగంలో వడివడిగా ముందుకుసాగింది. ఐటీ ఆధారిత సేవలు, ఉత్పత్తుల రంగంలో భారత్ అగ్రగామిగా ఉంది. ఈ రంగం అభివృద్ధికి కేంద్రం చేసింది నామమాత్రమే. సేవల రంగంలో కూడా మిగతా అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్ అగ్రస్థానంలో ఉంది.

క్లుప్తంగా చెప్పాలంటే, దేశ ఆర్థికాభివృద్ధికి ఐటీ, సేవల రంగాలు మాత్రమే గణనీయంగా దోహదం చేస్తున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులు ఎక్కువగా ఐటీ, సేవల రంగాల్లోనే వస్తున్నాయి. ఇతర కీలక రంగాలలో ఎఫ్‌డీఐలను ఆకర్షించాల్సిన అవ సరం ఉంది. ఉత్పత్తిరంగంలో వృద్ధి ఆశాజనకంగా లేదు. దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగం పట్ల ఇంతకు ముందు మాదిరిగానే చిన్నచూపు చూస్తున్నారు. 'మేకిన్ ఇండియా' ఎందుకు చతికిల పడిందో ఆత్మావలోకనం చేసు కోవాలి. దేశంలో 15 కోట్ల మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఇ) ఊతం కల్పించాలి. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రభుత్వ వ్యయం ఇంకా పెరగాలి. ఆహార ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షలు విధించి దేశీయ రైతాంగాన్ని మరింత ప్రోత్సహించాలి. నూతన వార్షిక బడ్జెట్‌లోనైనా ప్రధాని దేశంలో 60 కోట్లు పైబడి ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలపై కనికరం చూపిస్తారా?

వ్యాసకర్త శాసన మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.నవమి ప.2.04 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: కృత్తిక రా.1.41 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ప.1.16 నుండి 2.55 వరకు, దుర్ముహూర్తం: ప.12.35 నుండి 1.22 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.34 వరకు, అమృతఘడియలు: రా.11.05 నుండి 12.46 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.50.



అనకాపల్లి జిల్లా చెట్టుపల్లిలో వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



విజయవాడ పాతరాజరాజేశ్వరిపేటలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ఏలూరు జిల్లా పెదకామనపూడిలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

మన ప్రభుత్వం

క్లుప్తంగా...

శ్రీవారిని దర్శించుకున్న పంజాబ్ గవర్నర్



తిరుమల శ్రీవారి ఆలయం వెలుపల పంజాబ్ గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పంజాబ్ గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్, ఎమ్మెల్సీ జె.కృష్ణమూర్తి, అయోధ్య రామ మందిరం ట్రస్ట్ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 80,094 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం కలుగుతోంది.

గోరటి వెంకన్నకు వేటూరి కవితా పురస్కారం



వేటూరి కవితా పురస్కారం అందుకుంటున్న గోరటి వెంకన్న

తుని రూరల్: వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా అందిస్తున్న 12వ వేటూరి కవితా పురస్కారం ప్రఖ్యాత కవి, గాయకుడు పద్మశ్రీ గోరటి వెంకన్నకు లభించింది. సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా కాకినాడ జిల్లా తుని చిట్టూరి మెట్రోలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వేటూరి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేటూరి కవితా పురస్కారాన్ని గోరటి వెంకన్నకు ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు. వేర్వేరు రచయితలు రచించిన 150 పుస్తకాలను బహూకరించారు. అన్ని వర్గాలనూ ఆకట్టుకునే విధంగా వేటూరి సుందరరామ్మూర్తి గీత రచనలు సాగాయని గోరటి వెంకన్న అన్నారు. రచయిత కలగా రామజోగేశ్వరశర్మ రచించిన 'కదంబం' కవితా సంపుటి పుస్తకాన్ని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, కవి బులుసు వెంకటేశ్వర్లు, డాక్టర్ రెడ్డి భవానీరావు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

- శ్రీశైలం డ్యామ్ వద్ద బ్రేకులు పడక రక్షణ గోడను ఢీకొన్న బస్సు



ప్రమాదం జరిగిన సమయంలో కిందకి రాలిపడుతున్న సైడ్‌వాల్ రాళ్లు

శ్రీశైలం ప్రాజెక్ట్/దోమలపెంట: శ్రీశైలం నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో శ్రీశైలం నుంచి మహబూబ్‌నగర్ బయలుదేరిన ఆర్టీసీ అద్దె బస్సు శ్రీశైలం డ్యామ్ సమీపంలోని తలకాయ టర్నింగ్ వద్ద ప్రమాదానికి గురైంది. వేగంగా వస్తున్న బస్సు మలుపు వద్ద సక్రమంగా ప్రయాణించక ఎదురుగా ఉన్న సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. ప్రమాదాలు తరచూ జరిగే స్థలం కాబట్టి ఆర్ అండ్ బీ అధికారులు ఆ మలుపుల వద్ద ఇనుప గడ్డర్లతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్‌ను ఢీకొన్న బస్సు అక్కడే నిలిచిపోయింది. లేదంటే కింద ఉన్న లోయలోకి పడిపోయి ఘోర ప్రమాదం జరిగి ఉండేది. ప్రమాద సమయంలో 30 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్టు సమాచారం. బస్సు ఏమాత్రం ముందుకెళ్లినా వంద అడుగుల లోతున ఉన్న లోయలో పడేదని ప్రయాణికులు తెలిపారు. బ్రేక్ పడకపోవడం వల్లే బస్సు ముందుకు దూసుకెళ్లినట్టు తెలిసింది. ప్రమాదం తర్వాత డ్రైవర్ చాకచక్యంగా బస్సును వెనక్కి మళ్లించి ప్రయాణికులతో సహా మహబూబ్‌నగర్ వెళ్లిపోయారు.

వెలుగులోకి అ'పూర్వ' చరిత్ర

తుని సమీపంలో బయటపడ్డ 800 సంవత్సరాల నాటి ఆనవాళ్లు

- గొంపకొండ వద్ద 12వ శతాబ్దపు తెలుగు శాసనాలు లభ్యం
- విగ్రహాలకు అమ్మతల్లిగా భావించి పూజిస్తున్న రైతులు
- 'సాక్షి' పరిశీలనతో వెలుగులోకి వచ్చిన యలమంచిలి చాళుక్యుల చరిత్ర

సాక్షి, అమరావతి: కాకినాడ జిల్లా తుని సమీపంలోని గొంపకొండ వద్ద క్రీస్తు శకం 12వ శతాబ్దం నాటి చారిత్రక ఆనవాళ్లు బయపడ్డాయి. గతంలో రైతులు పొలాలను చదును చేస్తుండగా.. రాతి కుండలు, ప్రమిదలు, శిలాఫలకాలు బయటపడ్డాయి. కొండవాలున ఉన్న ఇక్కడి జీడి, మామిడి తోటల్లో వెలుగుచూసిన ఈ శిథిలాలను సాధారణ రాళ్లుగా భావించి చెల్లాచెదురుగా పడేశారు. నాటి రాతి తొట్టెలను అక్కడి రైతులు ఇప్పటికీ వినియోగిస్తుండటం విశేషం. తుప్పలు, డొంకల్లో పడివున్న ఆ శిథిలాలను 'సాక్షి' ప్రతినిధి పరిశీలించగా.. అవి ఓ ఆలయానికి చెందిన శిల్ప చెక్కడాలుగా తేలాయి. అక్కడే పురాతన ఇటుకలు, గుడి శిథిలాలు, రాతి శాసనాలు సైతం బయల్పడ్డాయి. వాటిని సేకరించి పురావస్తు శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన నిపుణుడికి పంపించగా.. అవి యలమంచిలి చాళుక్యుల కాలం నాటివని తేల్చారు. గుడి, ఇటుకలు, విగ్రహాలు క్రీ.శ. 800 సంవత్సరం నాటివని, తెలుగు శాసనాలు 1240 సంవత్సరం నాటివని గుర్తించారు.

మట్టిలో 1200 ఏళ్ల నాటి గుడి

తుని–నర్సీపట్నం మార్గంలో తుని నుంచి 12 కి.మీ. వెళితే.. (కోటనందూరుకు 2 కి.మీ. దూరంలో) గొంపకొండ ఉంది. కొండను ఆనుకుని జీడి, మామిడి తోటలున్నాయి. రోడ్డును ఆనుకుని ఉన్న ఓ దేవత విగ్రహం (గొంప తల్లిగా పిలుస్తారు) ఉంది. స్థానికంగా మరికొన్ని విగ్రహాలు, శాసనాలు కూడా ఉన్నట్టు స్థానికులు చెప్పారు. అక్కడికెళ్లి పరిశీలించగా.. అద్భుతమైన రాతి కట్టడాలు విరిగిపోయి, మట్టిలో కూరుకుపోయాయి. రాయిని తొలిచి చేసిన నీటి తొట్టెలని రైతులు ఇప్పటికీ వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో పట్టణం ఉండేదని, అగ్ని ప్రమాదం లేదా మశూచి వంటి భయంకరమైన వ్యాధితో ప్రజలు వలస పోయి ఉంటారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇక్కడి ఆలయం నిరాదరణకు గురై ఉండవచ్చని చరిత్రకారుల అంచనా. అనంతర కాలంలో ఈ ప్రాంతంలో పొలం పనులు చేపట్టిన రైతులు గుడి రాళ్లను సరిహద్దు కంచెగా మార్చుకున్నారు. తవ్వకాల్లో దొరికిన విగ్రహాలను స్థానిక దేవతలుగా పూజిస్తున్నారు. తవ్వకాల్లో తెలుగు లిపితో ఉన్న శాసనాలు, పద్మాలు చెక్కిన స్తంభాలు, వివిధ ఆకృతుల్లో ఉన్న రాతి ఫలకాలు, విష్ణుమూర్తి విగ్రహం, మహిషాసురమర్దని, భైరవ శిల్పాలు బయటపడ్డాయి. ఈ శిల్ప సంపద సుమారు క్రీ.శ 800 నుంచి 1240 సంవత్సరాల మధ్య విలసిల్లిన ఆలయానికి చెందినదని పురావస్తు నిపుణులు గుర్తించారు. యలమంచిలి చాళుక్యుల పాలనా కాలంలో ఈ ప్రాంతంలో 'జననాథపట్నం' అనే పట్టణం ఉండేదని.. తర్వాత ఇక్కడి ప్రజలు వలసపోయినట్టు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లలేని వారు మాత్రం సమీపంలోనే 'జగన్నాథపురం' అనే గ్రామాన్ని నిర్మించుకోగా.. ఇప్పటికీ అదే పేరుతో చలామణిలో ఉంది.



గొంపకొండ వద్ద లభించిన యలమంచిలి చాళుక్యుల శాసనం

కాగా, ఇక్కడ లభించిన భైరవ, విష్ణు విగ్రహాలను సైతం స్థానికులు స్త్రీ మూర్తులుగా కొలవడం గమనార్హం. ఇక్కడ లభించిన విగ్రహాలు, శాసనాలు, కట్టడాలను పురావస్తు పరిశోధకులు పరిశీలన జరపడం ద్వారా గత చరిత్రను వెలికి తీయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఆనవాళ్లు నివ్వెర పరుస్తున్నాయి



అడవిని తలపిస్తున్న ఈ ప్రాంతంలో ఇంత గొప్ప చారిత్రక సంపద ఉందంటే ఆశ్చర్యకరంగా ఉంది. శిల్పాలను పరిశీలిస్తే క్రీ.శ. 800 సంవత్సరం నాటివని తెలుస్తోంది. తెలుగు శాసనాలు క్రీ.శ. 1200–40 నాటివిగా భావిస్తున్నాం. ఇటుకలు 40 గీ30 గీ6 సెం.మీ. వ్యాసార్థంలో ఉన్నాయి. రాయిని తొలిచి చేసిన నీటి తొట్టె (గోలెం) కూడా ఓ అద్భుతమనే చెప్పొచ్చు. మహిషాన్ని ఎడమ కాలితో తొక్కుతూ, శూలంతో గుచ్చుతూ, ఖడ్గంతో నరుకుతున్న మహిషాసురమర్దిని శిల్పం, వింజడలు, కపాల మాల, ఢమరుకం, ఖడ్గం, శూలం, పాత్ర ధరించి నగ్నంగా ఉన్న భైరవ శిల్పం కనిపిస్తున్నాయి. ఇవి క్రీ.శ. 9–12 శతాబ్దాలలో యలమంచిలి చాళుక్యుల శైలిని తెలియజేస్తున్నాయి. ఇక్కడ లభించిన మరో అద్భుతం శాసనం. ఇందులో లిపి తెలుగును పోలి ఉన్నప్పటికీ తెలుగు కాదు. ఇక్కడ మరింత లోతుగా పరిశోధనలు చేస్తే గొప్ప సంస్కృతి బయటపడే అవకాశం ఉంది.

– డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో

ద్రాక్షారామంలో దధి నివేదన శుభపరిణామం

- శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- ముగిసిన చాత్తాద వైష్ణవ ఆగమ సదస్సు

సింహాచలం (పెందుర్తి)/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): పంచారామ క్షేత్రం ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామికి దధి (పెరుగు) నివేదనను సమర్పించడం శుభపరిణామమని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల మూడోరోజు ఆదివారం వైభవంగా జరిగాయి. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పీఠం అధిష్టాన దేవత రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీనివాస చతుర్వేద హవనంలో పాల్గొన్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. నివేదనకు వినియోగించిన దధిని అన్నదానంలో వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

త్వరలో వైష్ణవ ఆగమ పాఠశాల ఏర్పాటు

మరోవైపు.. శారదాపీఠంలో త్వరలో వైష్ణవ ఆగమ పాఠశాలను ఏర్పాటుచేస్తున్నట్లు పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి వెల్లడించారు. పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా గడిచిన మూడ్రోజులుగా నిర్వహించిన చాత్తాద వైష్ణవ



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

ఆగమ సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ గురువులు స్వరూపానందేంద్ర సరస్వతి సంకల్పం మేరకు త్వరలోనే వైష్ణవ ఆగమ సదస్సుని కూడా ఏర్పాటుచేయదలచామని తెలిపారు. అర్చక అకాడమీ ఆధ్వర్యంలో వేదాంతం రాజగోపాల చక్రవర్తి నిర్వహించిన ఈ సదస్సులో చిర్రావూరి శ్రీరామశర్మ, విభీషణ శర్మ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇక శారదాపీఠం వార్షికోత్సవాల్లో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ సతీసమేతంగా రాజశ్యామల అమ్మవారి యాగంలో పాల్గొని స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిల ఆశీస్సులు తీసుకున్నారు. అలాగే, వీరిద్దరికీ శ్రీకాళహస్తీశ్వరాలయ బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను దేవస్థానం ఈఓ సాగర్ బాబు అందజేశారు.

తాత కోసం నాలుక నైవేద్యం

బళ్లారి అర్బన్: ఎవరైనా మొక్కు తీరాలని డబ్బు, బంగారం సమర్పిస్తారు. కాదంటే.. తలనీలాలు ఇస్తారు. కానీ.. కర్ణాటకలోని బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా ఉప్పారహొసళ్లి గ్రామానికి చెందిన వీరేష్ అనే యువకుడు దేవునికి మొక్కు కోసం నాలుక కట్ చేసుకున్నాడు. ఆదివారం ఈ ఘటన జరిగింది. తన తాత శంకరప్పకు ఆరోగ్యం బాగా లేదు. ఆయనకు స్వస్థత కలగాలని స్థానిక ఆలయంలో పూజలు చేసి వీరేష్ అనంతరం తన నాలుకను కత్తితో కోసుకున్నాడు. గ్రామస్తులు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.



నాలుక కోసుకున్న వీరేష్

యానాదుల బతుకుల్లో మార్పుకు శ్రీకారం

సంక్షేమ పథకాలను చేరువ చేసేలా ప్రభుత్వ కార్యాచరణ

- వారి స్థితిగతులు తెలుసుకునేలా 'కోబో' యాప్‌తో సర్వే
- విజయవాడ మైదాన ప్రాంత ఐటీడీఏ పరిధిలో పైలట్ ప్రాజెక్ట్
- ఆధార్, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇళ్లతో పాటు చేపల వేటకు లైసెన్స్‌ల జారీ

సాక్షి, అమరావతి: ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన యానాదులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పరిధిలో ప్రత్యేకంగా యానాదులకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధార్ కార్డుల జారీతో వారికి ప్రభుత్వ పథకాలు, విద్య, వైద్యం వంటి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చిన విషయం తెల్సిందే. తాజాగా విజయవాడ ఐటీడీఏ(మైదాన ప్రాంతం) పరిధిలోని ఎన్టీఆర్ జిల్లాలో యానాదుల స్థితిగతులను అధ్యయనం చేసి వారికి ప్రభుత్వ పథకాలను చేరువ చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. కేర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కోబో కలెక్ట్ యాప్(మొబైల్ అప్లికేషన్) సాయంతో సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి సర్వేలో సేకరించిన అంశాల ఆధారంగా వారికి ప్రభుత్వ పథకాలతో పాటు అవసరమైన సహకారాన్ని అందించనున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలిస్తుండటంతో మిగిలిన జిల్లాల్లోనూ అమలు చేసే విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ పరిశీలిస్తోంది.



జి కొండూరు మండలం చెరువు మాధవరంలో యానాదుల వివరాలు సేకరిస్తున్న మైదాన ప్రాంత ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.రుక్మాంగదయ్య

కోబో యాప్‌తో సమగ్ర సమాచారం

గిరిజన సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణలో కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఏకుల రవి, వెలుగు చంద్రరావు తమ సిబ్బందితో కలిసి కోబో కలెక్ట్ యాప్‌తో ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామాల్లో పర్యటించి యానాదులను గుర్తిస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలతో పాటు వారి స్థితిగతులు, సమస్యలను యాప్ ద్వారా సేకరిస్తున్నారు. సేకరించిన సమాచారాన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు అందిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పలు ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని యానాదుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. విద్యాశాఖ అధికారుల సహకారంతో బడి ఈడు పిల్లలను బడిలో, చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరుస్తున్నారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల యంత్రాంగంతో మాట్లాడి వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇప్పించేలా చర్యలు చేపట్టారు. 412 మంది యానాదులకు ఇళ్ల మరమ్మతుల కోసం రూ.50 వేల చొప్పున అందించారు. 2,500 మందికి ఆధార్ కార్డులు, 550 మందికి రేషన్‌కార్డులు, మూడు వేల మందికి కుల ధ్రువీకరణ పత్రాలిప్పించేలా చర్యలు చేపట్టారు.

చేపల వేటకు లైసెన్స్‌లిస్తున్నాం..

మైదాన ప్రాంత ఐటీడీఏ పరిధిలోని ఎస్టీల్లో లంబాడీ, ఎరుకల, యానాది, చెంచు, నక్కల తెగల వారున్నారు. వారిలో యానాదులకు సరైన చిరునామా, నివాసం లేక అవస్థలు పడుతున్నారు. వారి స్థితిగతులపై చేపట్టిన సర్వే మరో రెండు నెలల్లో పూర్తవుతుంది. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని అందిస్తున్నాం. ప్రధానంగా చేపల వేటపై ఆధారపడి జీవించే యానాదుల ఉపాధిని మరింత మెరుగుపరిచేలా దృష్టి సారించాం. కాలువలు, నదుల్లో చేపలను వేటాడుకునేలా జి కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన 18 మందికి కొత్తగా లైసెన్స్‌లిచ్చాం. మత్స్యశాఖ, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో సబ్సిడీపై వలలు అందించేలా కార్యాచరణ చేపట్టాం.

– ఎం.రుక్మాంగదయ్య, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, మైదాన ప్రాంత ఐటీడీఏ(విజయవాడ)

పిట్టల దొరలా లోకేశ్ ప్రగల్భాలు

- 854వ రోజుకు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న బహుజన నేతలు

తాడికొండ: మంగళగిరిలో ఎమ్మెల్యేగా గెలవలేని నారా లోకేశ్ పిట్టల దొరలా ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 854వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ ఓ వైపు పుత్రుడు, మరో వైపు దత్తపుత్రుడిని రాష్ట్రంపై వదిలి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ లబ్ధిపొందాలని చూస్తే నమ్మి మోసపోయేంత దుస్థితిలో ప్రజలు లేరన్నారు. బాబుకు రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్ ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారని చెప్పారు. కనీస పరిజ్ఞానం లేని లోకేశ్ ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటే మంచిదని, లేకుంటే మళ్లా చిత్తుచిత్తుగా ఓడించి ఇంట్లో కూర్చోబెట్టడం ఖాయమన్నారు. శివరామకృష్ణన్, బోస్టన్, జీఎన్ రావు నిపుణుల కమిటీల నివేదికలను బాబు తోసిపుచ్చి అడ్డదారిలో రాజధాని ఎంపిక చేసినందునే రాష్ట్రానికీ ఈ దుస్థితి దాపురించిందని ఆరోపించారు. రాజధాని ఎంపికలో ప్రభుత్వం నుంచి నియమించిన ఆయా కమిటీల నివేదికలను పక్కన బెట్టిన బాబు తన అనుయాయులతో నారాయణ కమిటీని వేసి రియల్ ఎస్టేట్ దందాకు దిగడమే రాష్ట్రానికి శాపంగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఇత్తడి సూర్యప్రభ వాహనం



సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కృష్ణా జిల్లా గోగులంపాడు గ్రామానికి చెందిన పాలడుగు కామయ్య చౌదరి అనే దాత బహూకరించిన సూర్యప్రభ వాహనమిది. 200 కిలోల ఇత్తడితో దీన్ని తయారు చేయించారు. ఇందుకోసం రూ.7 లక్షలు ఖర్చయింది. ఈ వాహనాన్ని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, పురోహిత్ అలంకారికరి సీతారామాచార్యులు, డిప్యూటీ ఈవో సుజాత, ఏఈవో నరసింహరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆదివారం మీడియా సమక్షంలో ఆవిష్కరించారు. ఇప్పటి వరకు స్వామి వారికి ఏటా జరిగే రథసప్తమి వేడుకల్లో చెక్కతో తయారు చేసిన సూర్యప్రభ వాహనాన్నే వినియోగిస్తున్నారు. ఇకనుంచీ ఇత్తడి సూర్యప్రభ వాహనాన్ని ఉపయోగిస్తారు. – సింహాచలం

'పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టిన ఘనత జగన్‌దే'

పటమట(విజయవాడతూర్పు): స్థానిక సంస్థలలో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను తగ్గించారని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న నారా లోకేశ్ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీల రిజర్వేషన్ బిల్లుపై టీడీపీ మద్దతు దారులు దొడ్డిదారుల్లో కోర్టుకెళ్లి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు గండి కొట్టారని గుర్తుచేశారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలను నారా లోకేశ్ మానుకోవాలని హితవు పలికారు. బీసీల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ దేశంలోనే మొదటిసారిగా పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేసిన ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా బీసీలకు ఆంధ్రప్రదేశ్ మాదిరిగా సంక్షేమ పథకాలు అందడం లేదన్న వాస్తవాన్ని నారా లోకేశ్ తెలుసుకోవాలని సూచించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత లోకేశ్‌కు లేదని తేల్చి చెప్పారు.

'ఉక్కు' సంకల్పంతో ప్రజాగర్జన

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి రెండేళ్లు
- ఆదినుంచీ వైఎస్సార్‌సీపీ మద్దతు
- అలుపెరుగని పోరు సాగిస్తున్న కార్మిక, ఉద్యోగ వర్గాలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమం ప్రారంభించి రెండేళ్లు పూర్తయింది. స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలని 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక వర్గం భగ్గుమంది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పలు ఆందోళనలు నిర్వహించింది. ఢిల్లీలో రెండు రోజులు ధర్నాలు చేపట్టారు. ముఖ్యంగా జాతీయ రహదారిని రెండు రోజుల పాటు దిగ్బంధించారు. స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ముట్టడి, గేట్ల ముట్టడి చేపట్టారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పింది. ఇందులో భాగంగా అమ్మకాల ప్రక్రియలకు ట్రాన్సాక్షన్, లీగల్ అడ్వైజర్ల నియామకాలు చేపట్టింది. ఉక్కు ఉద్యమానికి బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, రచయితలు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు మద్దతు ఇస్తూ దీక్షల్లో పాల్గొంటున్నారు. దీక్షలు ప్రారంభించి శనివారం నాటికి రెండేళ్లు పూర్తయింది.

జాతీయ ప్రముఖుల మద్దతు

కఠినమైన మోడీ ప్రభుత్వాన్ని వెనుకకు తీసుకు వెళ్లిన ఘనత రైతు ఉద్యమానికి దక్కుతుంది. ఆ రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతు సంఘం నాయకులు రాకేష్ తికాయిత్ విశాఖ వచ్చి ఉక్కు పోరాట కమిటీ ఏర్పాటు చేసిన కార్మిక సభలో విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. అదే విధంగా ప్రముఖ సామాజిక వేత్త మేధా పాట్కర్ దీక్షా శిబిరం వచ్చి కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగట్టారు. ఉద్యమాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవచ్చని తెలిపారు.

నేడు ప్రజా గర్జన...

ఉద్యమంలో రాజకీయ పార్టీలను భాగస్వాములను చేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉక్కు త్రిష్టా మైదానంలో ప్రజా గర్జన ఏర్పాటు చేశారు. బీజేపీ మినహా ఇతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించారు. ఈ గర్జనకు వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్, జనసేన, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు హాజరవుతారని పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

క్లుప్తంగా...

మార్చి 1 నుంచి హెచ్1బీ వీసా దరఖాస్తుల స్వీకరణ

వాషింగ్టన్: భారతీయ ఐటీ నిపుణులకు శుభవార్త. 2023–24 సంవత్సరానికి గాను మార్చి ఒకటో తేదీ నుంచి హెచ్1బీ వీసాలకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం ఆదివారం తెలిపింది. మార్చి 17వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉంటుందని, మార్చి 31కల్లా వీసా హోల్డర్ల పేర్లను ప్రకటిస్తామని పేర్కొంది. అమెరికా కంపెనీల్లో పనిచేసే విదేశీ సాంకేతిక నిపుణులకు ఇచ్చే నాన్-ఇమిగ్రాంట్ వీసా హెచ్1బీ. ఏడాదికి 85 వేల వరకు హెచ్1బీ వీసాలను మంజూరు చేస్తుంటారు. ఇందులో అత్యధికంగా లాభపడేది భారత్, చైనా దేశస్తులే. టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి రంగాలకు చెందిన ఈ వీసా దారులు ఆరేళ్ల వరకు అమెరికాలో ఉండి పని చేసుకునేందుకు వీలుంటుంది. ఆరేళ్ల తర్వాత శాశ్వత నివాసం లేదా గ్రీన్‌కార్డుకు అర్హులవుతారు.

సహచర మంత్రి జహావిపై సునాక్ వేటు



లండన్: పన్నుల వివాదంలో చిక్కుకున్న అధికార కన్జర్వేటివ్ పార్టీ చైర్మన్, సహచర కేబినెట్ మంత్రి నదీమ్ జహావిని బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ మంత్రి మండలి నుంచి తొలగించారు. జహావి పన్ను వ్యవహారాల్లో మంత్రులకుండే నియమనిబంధనల్ని ఉల్లంఘించారంటూ విచారణలో తేలడంతో సునాక్ ఆయనపై వేటు వేశారు. ప్రస్తుతం జహావి శాఖ లేని మంత్రిగా కేబినెట్‌లో ఉన్నారు. ప్రభుత్వం నియమించిన స్వతంత్ర విచారణ నివేదికను కూడా సునాక్ విడుదల చేశారు. ఇరాక్‌లో జన్మించిన జహావి ఆర్థిక మంత్రిగా ఉండగా అంతకు ముందు కట్టని పన్నులకు పెనాల్టీగా 50 లక్షల పౌండ్లు చెల్లించారు. ఈ విషయాన్ని దాయడం మినిస్టీరియల్ కోడ్‌ను ఉల్లంఘించడమేనని విచారణ నివేదిక తేల్చి చెప్పింది.

దేశంలో ఉన్నత విద్యావంతులు 4 కోట్ల మంది పై చిలుకే

ఎక్కువ కాలేజీలున్న 8 రాష్ట్రాల్లో ఏపీ
జిల్లాల్లో హైదరాబాద్, రంగారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యావంతులు నాలుగు కోట్లకు పైనే ఉన్నట్టు కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. ఉన్నత విద్యపై ఆలిండియా సర్వేను కేంద్ర విద్యా శాఖ ఆదివారం విడుదల చేసింది. ఎక్కువ కాలేజీలున్న ఎనిమిది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం దక్కింది. అలాగే ఎక్కువ కాలేజీలున్న జిల్లాల జాబితాలో హైదరాబాద్, రంగారెడ్డి స్థానం దక్కించుకున్నాయి.



మరో నక్షత్ర మండలం!

అంతరిక్షంలో సైంటిస్టులు తాజాగా గుర్తించిన ఓ మిస్టరీ వలయమిది. ఇది బహుశా మరో నక్షత్ర మండలం కావచ్చని భావిస్తున్నారు. ఇది హవాయిలోని సుబారు స్టార్ అబ్జర్వేటరీ కెమెరా కంటికి చిక్కింది.

జేమ్స్ వెబ్‌కు సాంకేతిక సమస్య





వాషింగ్టన్: ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన అబ్జర్వేటరీ అయిన జేమ్స్ వెబ్‌లో మళ్లీ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో అంతరిక్ష రహస్యాలను ఒక్కొక్కటిగా ఛేదిస్తున్న జేమ్స్ వెబ్‌లో ఇలాంటి సమస్య రావడం ఇది రెండోసారి. అందులోని అత్యంత కీలకమైన నియర్ ఇన్‌ఫ్రారెడ్ ఇమేజర్, స్లిట్‌లెస్ స్పెక్ట్రోగ్రాఫ్ పరికరాల్లో సమాచార అంతరాయం నెలకొంది. దాంతో సంబంధిత సాఫ్ట్‌వేర్ మొరాయించింది. అయితే హార్డ్‌వేర్‌లో ఎలాంటి సమస్యలూ తలెత్తిన సూచనలు లేకపోవడం ఊరటనిచ్చే విషయమని నాసా పేర్కొంది. ఇన్‌ఫ్రారెడ్ ఇమేజర్ మాత్రం ప్రస్తుతానికి పని చేయడం లేదని ధ్రువీకరించింది. సమస్యను కనిపెట్టి సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపింది. ఏకంగా వెయ్యి కోట్ల డాలర్ల ఖర్చుతో తయారు చేసిన జేమ్స్ వెబ్ గత ఆగస్టులో కూడా ఇలాగే మొరాయించింది. దాని మిడ్ ఇన్‌ఫ్రారెడ్ ఇన్‌స్ట్రుమెంట్‌లోనూ సాంకేతిక సమస్య తలెత్తింది. బహుశా ఊహించిన దానికంటే పరిమాణంలో పెద్దవైన అంతరిక్ష పదార్థాలు కెమెరా లెన్స్‌ను గుద్దుకోవడమే రెండోసార్లూ సమస్యకు కారణమైందని నాసా భావిస్తోంది.

త్రిపురలో ప్రత్యేక సెగలు

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతమేరకు ప్రభావం



త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గ్రేటర్ టిప్రాల్యాండ్ ప్రత్యేక రాష్ట్రం ఉద్యమం వేడెక్కుతోంది. ఒకప్పుడు త్రిపురని ఏలిన మాణిక్య వంశానికి చెందిన ప్రద్యోత్ మాణిక్య డెబ్బార్మాన్‌కు చెందిన టిప్రా మోతా పార్టీ ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తోంది. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేస్తున్న సంస్థలన్నీ కలిసి టిప్రా ఇండీజెనస్ ప్రోగ్రెసివ్ రీజనల్ అలయెన్స్ (టిప్రా మోతా)గా ఏకతాటిపైకి వచ్చారు. ఇన్నాళ్లు సామాజిక సంస్థగా ఉన్న ఈ కూటమి, రాజకీయ పార్టీగా రూపాంతరం చెందింది. అధికారంలోకి వస్తే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చిన వారితోనే తాము పొత్తు పెట్టుకుంటామని ప్రద్యోత్ తేల్చి చెబుతూ అధికార బీజేపీకి సవాల్ విసురుతున్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్న గిరిజనులు, స్థానిక తెగల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకి మద్దతుగా ఉంటూ గత రెండేళ్లలోనే ఢిల్లీ వేదికగా ప్రద్యోత్ ఎన్నో ధర్నాలు, ఉద్యమాలు చేశారు. గత వారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అమిత్ షాతో ప్రద్యోత్ నేతృత్వంలోని టిప్రా మోతా ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి చేసిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ప్రద్యోత్ తాము ఒంటరి పోరాటానికి సిద్ధమై 35 నుంచి 40 సీట్లలో పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సారి ఎన్నికల్లో ప్రత్యేక రాష్ట్రం అంశం అత్యంత ప్రభావం చూపించబోతోంది.

ఏమిటీ గ్రేటర్ టిప్రాల్యాండ్?

1949లో త్రిపురభారత దేశంలో విలీనం అవడానికి అంగీకరించింది. అప్పటికే తూర్పు బంగ్లాదేశ్ నుంచి త్రిపురలోకి భారీగా బెంగాలీల తాకిడి మొదలైంది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన యుద్ధం సమయంలో కూడా బెంగాలీ శరణార్థులు భారీగా వచ్చి చేరారు. ఫలితంగా స్థానికంగా నివసించే గిరిజనులు మైనార్టీలో పడిపోయారు. 1881లో 63.77శాతం ఉండే గిరిజనుల జనాభా 2011 నాటికి 31.80శాతానికి పడిపోయింది. 2011 నాటి భాషాపరమైన జనాభా లెక్కల ప్రకారం త్రిపుర మొత్తం జనాభా 36.74 లక్షలైతే, వారిలో బెంగాలీ మాతృభాష కలిగిన వారి సంఖ్య ఏకంగా 24.14 లక్షలు. స్థానిక ఆదివాసీల మాతృభాష కొక్‌బొరాక్ మాట్లాడేవారు 8.87 లక్షల మంది మాత్రమే ఉన్నారు. అంటే బయట నుంచి వలస వచ్చిన బెంగాలీలే వీరి కంటే మూడు రెట్లు ఎక్కువ. దాంతో స్థానికంగా ఉండేవారి హక్కులు, సంస్కృతి సంప్రదాయాలు, భూమిపై హక్కులు ప్రమాదంలో పడ్డాయి. దాంతో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ పుట్టింది.

ఎప్పట్నుంచి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్?

2000 సంవత్సరంలో ఏర్పాటైన ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) పార్టీ తొలిసారిగా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై గళమెత్తింది. రెండేళ్ల తర్వాత ఐపీఎఫ్‌టీ గిరిజనుల మరో పార్టీ త్రిపుర ఉపజాతి జ్యూబా సమితి(టీయూజేఎస్)లో విలీనమై నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ ట్విప్రా (ఐఎన్‌పీటీ)గా ఆవిర్భవించింది. వేర్పాటు వాద నాయకుడు బిజోయ్ కుమార్ హరంగ్‌ఖ్వల్ నేతృత్వం వహించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం పెద్దగా ముందుకు వెళ్లకపోవడంతో 2009లో ఎన్‌సీ డెబ్రామా ఆధ్వర్యంలో మళ్లీ ఐపీఎఫ్‌టీను పునరుద్ధరించారు.

ఎన్నికల్లో ప్రభావం ఎంత?

మొత్తం 60 శాసనసభ స్థానాలున్న రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం ఆశిస్తున్న ఆదివాసీలు 20 నియోజకవర్గాల్లో ప్రభావం చూపించగలరు. ఇప్పటివరకు ఐపీఎఫ్‌టీయే ఈ నియోజకవర్గాల్లో అత్యంత కీలకంగా ఉంది. త్రిపురలో అద్భుతమైన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుని రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని ఏలిన మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వివిధ స్థానిక పార్టీలతో జత కలిసింది. దీంతో ఈ ప్రాంతంలోని 20 స్థానాలకు గాను బీజేపీ 10సీట్లు, ఐపీటీఎఫ్ 8 ,, సీపీఐ(ఎం) రెండు స్థానాల్లోనూ గెలుపొందింది. మాణిక్ సర్కార్ ఓటమికి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను నిర్లక్ష్యం చేయడం కూడా ఒక కారణంగా మారింది. ఎన్నికలకు ముందు ప్రత్యేక రాష్ట్రం కోసం విస్తృతంగా ప్రచారం చేసిన ఐపీటీఎఫ్ ఎన్నికల తర్వాత అధికార బీజేపీలో చేరింది. ఆ పార్టీ నాయకుడు ఎన్‌సీ డెబర్మా మంత్రిగా కూడా పని చేసి 2022 జనవరి 1న కన్నుమూశారు. గిరిజన హక్కుల మండలి (టీటీఏఏడీసీ)కి 2021 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టిప్రా మోతా పార్టీ 28 స్థానాల్లో పోటీ చేస్తే 18 నెగ్గింది. ప్రస్తుత అసెంబ్లీలో 36 స్థానాలతో ఉన్న అధికార బీజేపీ, 16 స్థానాలతో ప్రతిపక్ష పార్టీగా ఉన్న సీపీఐ(ఎం) ఉంటే, ఐపీటీఎఫ్ ఎనిమిది స్థానాలను నెగ్గింది. టిప్రా మోతా ఒంటరిపోరాటానికి సిద్ధమై అధికార బీజేపీకి వణుకు పుట్టిస్తున్నారు.

ఏయే ప్రాంతాలతో ప్రత్యేక రాష్ట్రం

త్రిపురలో గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలన్నింటితో 1985లో త్రిపుర ట్రైబల్ ఏరియాస్ అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (టీటీఏఏడీసీ) ఏర్పాటైంది. రాష్ట్ర వైశాల్యంలో మూడింట రెండువంతుల్లో విస్తరించింది. గిరిజన తెగల హక్కులు, సంస్కృతి కాపాడడం కోసం ఏర్పాటైన టీటీఏడీసీకి శాసన, కార్య నిర్వాహక అధికారాలున్నాయి. టీటీఏఏడీసీ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రం చేయాలన్న డిమాండ్ ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాక్‌లో పెట్రో ధరల మంట... లీటర్‌కు ఏకంగా రూ.35 పెంపు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో మరోసారి పెట్రో ధరల మోత మోగింది. లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.35 రూపాయలు పెంచుతున్నట్లుగా పాకిస్తాన్ ఆర్థిక శాఖ మంత్రి ఇషక్ దార్ ప్రకటించారు. పెట్రో ధరలు పెంచుతున్నట్టుగా ఉదయం 10:50 గంటలకు ప్రకటించిన మంత్రి మరో పది నిముషాల్లో అంటే 11 గంటల నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని చెప్పడంతో ప్రజలు అవాక్కయ్యారు. ఇక కిరోసిన్, లైట్ డీజిల్ ధరల్ని లీటర్‌కి రూ.18 పెంచారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు 11శాతం పెరగడం, పాకిస్తాన్ రూపాయి మారకం విలువ పడిపోవడంతో వీటి ధరలు పెంచకతప్పడం లేదని ఇషక్ చెప్పారు. గత నాలుగు నెలలుగా పెట్రోల్, డీజిల్ పెంచని విషయాన్ని గుర్తు చేశారు.

పెట్రో ధరలు ఇలా (లీటర్‌కి)	
పెట్రోల్	రూ.249.80
హై స్పీడ్ డీజిల్	రూ.262.80
కిరోసిన్	రూ.189.83
లైట్ డీజిల్ ఆయిల్	రూ.187

పాక్‌లో పడవ మునక.. 17 మంది విద్యార్థులు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కొహాట్ జిల్లాలోని మిర్బాష్ ఖెల్ మదర్సాకు చెందిన 30 మంది విద్యార్థులు తాండా రిజర్వాయర్ సందర్శనకు వెళ్లారు. వారున్న పడవ ప్రమాదవశాత్తు మునిగిపోయింది. ఘటనలో 17 మంది చనిపోగా మరో 13 మంది గాయపడ్డారు. వీరంతా 7–14 ఏళ్లలోపు వారే. సహాయక చర్యల్లో పాల్గొన్న ఆర్మీ రెస్క్యూ బృందాలు మొత్తం 17 మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు చెప్పారు.

ఒడిశాలో ఘోరం.. మంత్రిని కాల్చేసిన ఏఎస్సై



మంత్రి నవ కిశోర్ దాస్



ఏఎస్సై గోపాల్ దాస్

భువనేశ్వర్: ఒడిశాలో ఘోరం జరిగిది. పోలీసు అధికారి ఒకరు జరిపిన కాల్పుల్లో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రి నవ కిశోర్ దాస్ (60) చనిపోయారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు విశ్వాసపాత్రుడిగా పేరున్న దాస్ ఆదివారం ఝార్సుగూడ జిల్లా బజరంగ్‌నగర్‌లో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గాంధీచౌక్ వద్ద కారు దిగుతుండగా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై) గోపాల్ దాస్ తన తుపాకీతో మంత్రిపై రెండు రౌండ్ల కాల్పులకు తెగబడ్డాడు. తూటాలు ఛాతీలోకి దూసుకెళ్లాయి. తీవ్ర రక్తస్రావంతో స్పృహతప్పిన దాస్‌ను వెంటనే జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హుటాహుటిన ఎయిర్ అంబులెన్స్‌లో భువనేశ్వర్ అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆయన తదిశ్వాస విడిచారు. గుండె, ఊపిరితిత్తులు దెబ్బ తిని తీవ్ర అంతర్గత రక్తస్రావం జరిగిందని ఆస్పత్రి తెలిపింది. ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.దీనిపై దర్యాప్తునకు సీఎం ఆదేశించారు. ఏఎస్సైని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతన్ని ప్రశ్నిస్తున్నామని, కారణాలు త్వరలోనే తెలుస్తాయని ఉన్నతాధికారులు చెప్పారు. కిశోర్‌దాస్‌కు ఝార్సుగూడ మైనింగ్ ప్రాంతంలో మంచి పట్టుంది. మైనింగ్, రవాణా, హాస్పిటాలిటీ రంగాల్లో వ్యాపారాలున్నాయి. సీఎం తర్వాత అత్యంత ధనికుడు ఆయనేనని చెబుతుంటారు. 2019 ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్ నుంచి బీజేడీలోకి మారారు.

నా భర్తకు మతిస్థిమితం లేదు

ఏఎస్సై గోపాల్ దాస్ 8 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నట్టు భార్య జయంతి మీడియాకు చెప్పారు. ''సాధారణ స్థితికి చేరుకున్నట్లే భావించాం. ఇంతలోనే ఇలా జరిగిందంటున్నారు. మంత్రితో నా భర్తకు ఎటువంటి శత్రుత్వమూ లేదు. విచారణలోనే వాస్తవమేంటో తెలుస్తుంది'' అన్నారు.

నేటితో ముగియనున్న జోడో యాత్ర

- శ్రీనగర్‌లో త్రివర్ణపతాకాన్ని ఎగురవేసిన రాహుల్ గాంధీ
- ముగింపు సభకు 23 ప్రతిపక్ష పార్టీలు



శ్రీనగర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సోమవారం జమ్మూ కశ్మీర్‌లో ముగియనుది. ఈ సందర్భంగా శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ క్లాక్ టవర్ వద్ద అత్యంత కటుదిట్టమైన భద్రత నడుమ ఆయన ఆదివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1948లో ఇక్కడే జాతీయ పతాకాన్ని ఎగరేయడం విశేషం. రాహుల్ మాట్లాడుతూ దేశ ప్రజలకు తానిచ్చిన హామీని నెరవేర్చుకున్నానని చెప్పారు. సెప్టెంబర్ 7న మొదలైన రాహుల్ భారత్ జోడో యాత్ర 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, 75 జిల్లాల మీదుగా 4 వేల కిలోమీటర్లను పూర్తి చేసుకుంది. మతసామరస్యమే ప్రధాన ఎజెండా సాగిన ఈ యాత్ర విజయవంతం కావడంతో రాహుల్ ఉల్లాసంగా కనిపించారు. సోమవారం ర్యాలీతో యాత్ర ముగుస్తుంది. ఈ సందర్భంగా శ్రీనగర్‌లోని ఎస్‌కే స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభకు 23 ప్రతిపక్ష పార్టీలను కాంగ్రెస్ ఆహ్వానించింది.

బీజేపీపై పోరుకు విపక్షాలు ఏకం

విపక్షాల మధ్య విభేదాలున్నా, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై పోరులో అవి ఐక్యంగా ఉంటాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జోడో యాత్రలో పాల్గొనబోమని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ చెప్పడంపై ఆయన స్పందించారు. జోడో యాత్ర దక్షిణం నుంచి ఉత్తర భారతానికి చేరినప్పటికీ ఫలితం మాత్రం దేశమంతటా ఉందన్నారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల విద్వేషం, అహంకారంల స్థానంలో తమ యాత్ర దేశానికి సోదరభావమనే ప్రత్యామ్నాయాన్ని చూపిందని అన్నారు.

లోయలో పడిన బస్సు... పాక్‌లో 42 మంది సజీవ దహనం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 42 మంది సజీవదహనమయ్యారు. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టా నుంచి సింధు ప్రావిన్స్ రాజధాని కరాచీకి 48 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లాస్‌బెలా వద్ద ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న ఈ బస్సు మలుపులో పిల్లర్‌ను ఢీకొట్టి, లోయలో పడిపోయిందని పోలీసులు తెలిపారు. అనంతరం బస్సులో మంటలు చెలరేగి 42 మంది ప్రయాణికులు గుర్తు పట్టడానికి వీలు లేనంతగా మసయ్యారు. ఈ ఘటనలో ఒక చిన్నారి, మహిళ సహా ముగ్గురు మాత్రమే క్షేమంగా బయటపడ్డారు. మిగతా ముగ్గురు క్షతగాత్రుల పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు చెప్పారు.

2025లో అమెరికా, చైనా యుద్ధం!

అమెరికా ఆర్మీ జనరల్ అంచనాలు

వాషింగ్టన్: 2025లో చైనాతో యుద్ధం తప్పకపోవచ్చని అమెరికా ఎయిర్ మొబిలిటీ కమాండ్ చీఫ్ జనరల్ మైక్ మినహాన్ అంచనా వేశారు. 2024లో అమెరికాతోపాటు తైవాన్‌లో ఎన్నికలు జరగాల్సి ఉన్నందున, ఆ అవకాశంగా తీసుకుని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తైవాన్‌పై దాడికి పాల్పడవచ్చన్నారు. అందుకే, ఏఎంసీ సిబ్బంది గురి తప్పకుండా కాల్పులు జరిపేలా కఠోర శిక్షణకు సిద్ధం కావాలని, రికార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన కమాండర్లకు పంపిన మెమో మీడియాకు అందింది. చైనాపై పోరాడి గెలిచేందుకు సమీకృత, పటిష్ట బృందాలను సిద్ధం చేయాలని నిర్దేశించారు. ఎయిర్ మొబిలిటీ కమాండ్(ఏఎంసీ) కింద 50 వేల మంది ఆర్మీ సిబ్బంది, 500 విమానాలు ఉన్నాయి. రవాణా, ఇంధన అవసరాలు తీర్చడం ఈ విభాగం ప్రధాన బాధ్యతలు. తైవాన్ చైనాలో అంతర్భాగం, ఎప్పటికైనా కలిపేసుకుంటామంటూ డ్రాగన్ దేశం చెబుతోంది. ఈ అంశంపై చైనా, అమెరికాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

చేష్టలుడిగిన భద్రతా మండలి: కొరోసీ

ఐరాస: అత్యంత శక్తిమంతమైన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి పూర్తిగా చేష్టలుడిగిందని ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడు సబా కొరోసీ వాపోయారు. వర్తమాన కాలపు వాస్తవాలను అది ఎంతమాత్రమూ ప్రతిబింబించడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''యుద్ధాలను నివారించి అంతర్జాతీయ శాంతిభద్రతలను పరిరక్షించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మండలి ఆ బాధ్యతల నిర్వహణలో విఫలమవుతోంది. దానికి కారణమూ సుస్పష్టం. దాని శాశ్వత సభ్య దేశాల్లోనే ఒకటి పొరుగు దేశంపై దురాక్రమణకు పాల్పడి ప్రపంచాన్ని తీవ్ర ప్రమాదంలోకి, సంక్షోభంలోకి నెట్టింది. ఈ దుందుడుకుతనానికి గాను రష్యాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాల వీటో పవర్ కారణంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడింది. అందుకే మండలిని సంస్కరించాల్సిన అవసరం చాలా ఉంది. మండలి కూర్పు రెండో ప్రపంచ యుద్ధానంతరపు అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో జరిగింది. దాన్నిప్పుడు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలి'' అని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంస్థల పనితీరు ఎలా ఉండాలనే విషయంలో రష్యా దురాక్రమణ పెద్ద గుణపాఠంగా నిలిచిందన్నారు. భారత పర్యటనకు వచ్చిన కొరోసీ పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు.

చార్లెస్ పట్టాభిషేకానికి హ్యారీ హాజరయ్యేనా?

లండన్: మే నెలలో అంగరంగ వైభవంగా జరిగే తన పట్టాభిషేకానికి చిన్న కొడుకు ప్రిన్స్ హ్యారీ, కోడలు మేఘన్ మార్కెల్ రావాలని రాజు చార్లెస్–2 కోరుకుంటున్నారు. 'స్పేర్' ఆత్మకథతో రాజకుటుంబంలో లుకలుకలను, అన్న ప్రిన్స్ విలియంతో విభేదాలు, తన భార్యకు ఎదురైన చేదు అనుభవాలను హ్యారీ బయటపెట్టడం తెలిసిందే. దీంతో తమ్ముడిపై విలియం గుర్రుగా ఉన్నట్లు, పట్టాభిషేకానికి పిలవొద్దని తండ్రితో చెప్పినట్లు డెయిల్ మెయిల్ పేర్కొంది. కానీ వారిద్దరూ రాకుంటే మీడియాలో మరిన్ని పుకార్లకు ఆస్కారమిచ్చినట్లవుతుందని చార్లెస్ భావిస్తున్నట్లు తెలిపింది. వారిని ఎలాగైనా రప్పించాలని పట్టాభిషేకం కార్యక్రమానికి సారథ్యం వహించే ఆర్చిబిషప్ ఆఫ్ కాంటెర్‌బరీ జస్టిన్ వెల్బీని కోరినట్లు తెలిపింది.

వారి జీవితాలు స్ఫూర్తిదాయకం

- పద్మ పురస్కార గ్రహీతల గురించి మరింతగా అందరూ తెలుసుకోవాలి
- ఈ ఏడాది అవార్డులు పీపుల్స్ పద్మ
- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ



ఢిల్లీలోని విజయ్ చౌక్‌లో బీటింగ్ రీట్రీట్ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ, మంత్రులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది పద్మ అవార్డులకు ఎంపికైన వారి జీవితాలు, వారు సాధించిన ఘనత గురించి ప్రజలందరూ తెలుసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 2023 పద్మ అవార్డుల్ని పీపుల్స్ పద్మగా అభివర్ణించారు. సామాన్యుల్లో అసామాన్యులుగా ఎదిగిన వారిని గుర్తించి గౌరవిస్తున్నట్టు చెప్పారు. కొత్త ఏడాదిలో తొలిసారిగా ప్రధాని ఆదివారం ఆకాశవాణి మన్‌కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడారు. గిరిజనులు, వారి అభ్యున్నతికి కృషి చేసిన వారినే అత్యధికంగా పద్మ అవార్డులతో సత్కరిస్తున్నట్టు వెల్లడించారు. '' పద్మ పురస్కారాలు పొందినవారి జీవితాలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవి. గిరిజన భాషలైన టోటో, హో, కూయి వంటి వాటిపై అవిరళ కృషి చేసిన వారు, ఆదివాసీల సంగీత పరికరాలు వాయించడంలో నిష్ణాతులకి ఈ సారి పద్మ పురస్కారాలు వరించాయి.. నగర జీవితాలకి , ఆదివాసీ జీవితాలకు ఎంతో భేదం ఉంటుంది. నిత్య జీవితంలో ఎన్నో సవాళ్లుంటాయన్నారు. అయినప్పటికీ తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి గిరిజనులు ఎంతో పోరాటం చేస్తుంటారు'' అని ప్రధాని కొనియాడారు.

పెరుగుతున్న దేశీయ పేటెంట్ ఫైలింగ్స్

ఈ దశాబ్దం సాంకేతిక రంగంలో దేశీయ టెక్నాలజీస్ వాడకం పెరిగి ''టెకేడ్''గా మారాలన్న భారత్ కలను ఆవిష్కర్తలు, వాటికి వచ్చే పేటెంట్ హక్కులు నెరవేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. విదేశాలతో పోల్చి చూస్తే దేశీయంగా పేటెంట్ ఫైలింగ్స్ బాగా పెరిగాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పేటెంట్ ఫైలింగ్‌లో భారత్ ఏడో స్థానంలో ఉంటే ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్లలో అయిదో స్థానంలో ఉందని ప్రధాని వెల్లడించారు. గత అయిదేళ్లలో భారత్ పేటెంట్ రిజిస్ట్రేషన్లు 50శాతం పెరిగాయని, ప్రపంచ ఆవిష్కరణల సూచిలో మన స్థానం 40కి ఎగబాకిందన్నారు. 2015 నాటికి 80 కంటే తక్కువ స్థానంలో ఉండేదని గుర్తు చేశారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ 2022లో 145 పేటెంట్‌లను దాఖలు చేసి రికార్డు సృష్టిస్తుందన్నారు. భారత్ ''టెకేడ్''కలని ఆవిష్కర్తలే నెరవేరుస్తారని ప్రధాని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

మన్‌కీ బాత్‌లో తెలుగువారి ప్రస్తావన

మన్‌కీబాత్‌లో ఇద్దరు తెలుగు వారి గురించి మోదీ ప్రస్తావించారు. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నడిపే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.వి.రామసుబ్బారెడ్డి, తెలంగాణకు చెందిన ఇంజనీర్ విజయ్ గురించి మాట్లాడారు. ''నంద్యాల జిల్లాకు చెందిన కె.వి.రామసుబ్బారెడ్డి చిరు ధాన్యాలు పండించడం కోసం మంచి జీతం వచ్చే ఉద్యోగం మానేశారు. తల్లి చేసే చిరు ధాన్యాల వంటకం రుచి చూసి గ్రామంలో ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించారు వాటి ప్రయోజనాలను అందరికీ వివరిస్తున్నారు'' అని కొనియాడారు. నమో యాప్‌లో ఇ-వేస్ట్ గురించి రాసిన తెలంగాణకు చెందిన ఇంజనీర్ విజయ్ గురించి ప్రస్తావించిన ప్రధాని మొబైల్, ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లు నిరుపయోగమైనప్పుడు ఎలా పారేయాలో వివరించారు.

మధ్య తరగతికి చేరువ కండి

పథకాలను ప్రచారం చేయండి మంత్రులకు మోదీ దిశానిర్దేశం

మధ్య తరగతికి మరింత చేరువ కావాలని కేంద్ర మంత్రులకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. వారికి లబ్ధి చేకూర్చిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి మరింత వివరంగా తెలియజేయాలన్నారు. ఆదివారం ఇక్కడ మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. బుధవారం సమర్పించబోయే కేంద్ర బడ్జెట్ గురించి చర్చ జరిగింది. ప్రభుత్వ పథకాలు పేద, అణగారిన వర్గాలకు ఎనలేని లబ్ధి చేకూర్చడంతో పాటు మధ్యతరగతి ప్రజల జీవితాన్ని ఎంతో సుఖమయం చేశాయని మోదీ అన్నారు. ఈ విషయాలన్నింటినీ వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిందిగా మంత్రులకు దిశానిర్దేశం చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... స్వాతంత్ర్య అమృతోత్సవ వేళ బ్రిటిష్ వలస పాలనకు సంబంధించిన చిహ్నాలన్నింటినీ ఒక్కొక్కటిగా తప్పిస్తూ ముందుకు సాగుతున్నట్టు ప్రధాని చెప్పారు. భేటీలో మూడు అంశాలపై మంత్రులకు ప్రజెంటేషన్లు ఇచ్చారు. మోదీ ప్రభుత్వ ఎనిమిదేళ్ల పాలనలో సామాజిక, ఆర్థిక రంగాలకు సంబంధించిన పనితీరుపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రాజీవ్ గౌబా సవివరంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆరోగ్య, విద్యా రంగాల్లో సాధించిన ప్రగతిని కూడా వివరించారు. చిన్న, మధ్య తరహా నగరాల్లోనూ ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌ల స్థాపన తదితరాలను ఉటంకించారు. విద్యా వ్యవస్థలో అన్ని స్థాయిల్లోనూ విద్యార్థుల చేరిక, కొనసాగింపు శాతం బాగా పెరిగాయని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరులతో పాటు అన్నిరకాల వసతులనూ మెరుగుపరిచామన్నారు. ఇక కేంద్రం ప్రారంభించిన పలు ప్రాజెక్టుల వివరాలపై పరిశ్రమలు, అంతర్గత వర్తక శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ మంత్రులకు మరో ప్రజెంటేషన్ ఇచ్చారు. మోదీ ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు మాధ్యమాలను మరింత మెరుగ్గా ఎలా వాడుకోవచ్చో సమాచార ప్రసార శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తన ప్రజెంటేషన్లో వివరించారు.

సాక్షి 24|7 తమిళనాడు

TAMILNADU

సోమవారం | 30 | జనవరి | 2023

3న డీఎంకే శాంతి ర్యాలీ

సాక్షి, చెన్నై : ఫిబ్రవరి 3వ తేదీన డీఎంకే నేతృత్వంలో చెన్నైలో శాంతి ర్యాలీ జరగనుంది. రాజధాని పరిధిలోని వివిధ జిల్లాల పార్టీ కార్యదర్శులు ఈ వివరాలను ఆదివారం ప్రకటించారు. ఇందులో దివంగత మాజీ సీఎం అన్నాదురై 54వ వర్ధంతి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 3వ తేదీన ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలో మెరీనా తీరంలోని అన్నా సమాధి వరకు ర్యాలీ చేస్తామని ప్రకటించారు. పెద్దఎత్తున డీఎంకే శ్రేణులు ఈ శాంతి ర్యాలీలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

ధన్వంతరి పీఠంలో అశ్వమేధ పూజలు



అశ్వాలకు పూజలు చేస్తున్న పీఠాధిపతి మురళీధర స్వామిజీ

వేలూరు: వాలాజలోని ధన్వంతరి ఆరోగ్యపీఠంలో పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో లోకంలోని ప్రజలందరూ సుఖ సంతోషాతో ఉండాలని కోరుకుంటూ ఆదివారం అశ్వమేధ పూజలు చేశారు. భక్తులు అశ్వాలపై పుష్పాలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అశ్వరుడి హోమం, మహా పూర్ణాహుతి, పంచముఖి వారాహికి అభిషేకం చేశారు. అశ్వమేధ పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ పూజల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో మన గళం జ్వలించాలి

- ఎంపీలకు సీఎం దిశా నిర్దేశం



ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: లోక్‌సభ, రాజ్యసభలో డీఎంకే గళం మరింతగా జ్వలించాలని ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ఉపదేశించారు. పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలు, తెరపైకి తీసుకు రావాల్సిన విషయాల గురించి ఆపార్టీ పార్లమెంట్ సభ్యులతో స్టాలిన్ ఆదివారం సమావేశమయ్యారు. తేనాంపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సీఎం స్టాలిన్ అధ్యక్షత వహించగా, పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ నేతృత్వం వహించారు. డీఎంకే పార్లమెంటరీ నేత టీఆర్‌బాలుతో పాటు ఎంపీలందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇందులో సీఎం స్టాలిన్ పలు అంశాలను ఎంపీల దృష్టికి తీసుకెళ్లారు. 2002లో జరిగిన గుజరాత్ హింసాకాండపై బీబీసీ సిద్ధం చేసిన డాక్యుమెంటరీ వివాదం– భారతీయ స్టాక్ మార్కెట్‌పై అదానీ గ్రూప్ నష్టాల ప్రభావం తదితర అంశాలను సభలో ప్రస్తావించాలని సూచించారు. ఉభయ సభల్లో తమిళ ఎంపీల గళం జ్వలించాలని, తమిళనాడుకు సంబంధించిన ప్రతి అంశాన్ని, సమస్యను సభ దృష్టికి తీసుకు రావాలని వివరించారు. ప్రధానంగా నీట్ మినహాయింపు చట్టానికి రాష్ట్రపతి ఆమోదం కోసం పట్టుబట్టాలని సూచించారు. శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లపై చేస్తున్న దాడులు, మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించాలనే డిమాండ్, మదురైలో ఎయిమ్స్ పనులు, సేతు సముద్రం ప్రాజెక్ట్ అమలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో తమిళనాడు యువతకు ప్రాధాన్యం, ఎన్‌ఎల్‌సీ ఉద్యోగాల్లో తమిళులకు జరుగుతున్న అన్యాయం తదితర అంశాలను గురించి చర్చించి సభలో నిర్మాణాత్మక పాత్రను పోషించాలని ఎంపీలకు స్టాలిన్ ఉపదేశించారు. నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

అందరికీ ఉన్నతస్థాయి వైద్యం

అందరికీ అత్యున్నత వైద్యం లభించాలన్నదే తమ అభిలాష అని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ప్రైవేటు రంగ సహకారం మరింతగా పెరగాలని, వైద్య ఖర్చులు పేదలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్య, వైద్య రంగాలు సేవ దృక్పథంతోనే కొనసాగాలని ఆకాంక్షించారు.

- ప్రభుత్వానికి ప్రైవేటు సహకారం మరింత అవసరం
- వైద్య విజ్ఞాన సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- మెడికల్ కేపిటల్ సిటీగా చెన్నై ఖ్యాతి గడించిందని వెల్లడి

సాక్షి, చెన్నై: అందరికీ విద్య, వైద్యం సూత్రానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు. చెన్నై రాజ అన్నామలైపురం సత్యనగర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రోడ్డులోని ముత్తమిళ్ పేరవైలో ఆదివారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు, తల, మెడ సంబంధిత ఈఎన్‌టీ విభాగం నేతృత్వంలో తొలి వైద్య మహానాడును పూర్తిగా తమిళంలోనే నిర్వహించారు. ఈసదస్సును సీఎం స్టాలిన్ ప్రారంభించారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ, ఈఎన్‌టీ సంబంధితర సదస్సు ఇటీవల దుబాయ్‌లో జరిగిందని గుర్తు చేశారు. ఇందులో ప్రపంచ దేశాలకు చెందిన 10 మంది వైద్యులను సత్కరించారన్నారు. ఇందులో ఆసియా ఖండం నుంచి తమిళనాడుకు చెందిన మోహన్ కామేశ్వరన్ కూడా ఉండడం మనకు గర్వకారణం అన్నారు. ఈ మేరకు ఆయన వైద్య రంగంలో విశిష్ట సేవలను అందిస్తున్నారని కొనియాడారు. తనకు గొంతు, ముక్కు సంబంధించి చిన్న సమస్య తలెత్తినా ఆయన వద్దకే వెళ్తానన్నారు.

ఎటు చూసినా తమిళమే..

వైద్య మహానాడును పూర్తిగా తమిళంలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సదస్సులు సాధారణంగా ఆంగ్లంలో నిర్వహిస్తారని స్టాలిన్ గుర్తు చేశారు. విద్యలో, కోర్టుల్లో, సంగీతంలో, వైద్యంలో ఇలా...ఎటు చూసినా, ఎక్కడ చూసినా తమిళం ప్రకాశవంతంగా వర్ధిల్లుతోందన్నారు. తమిళ్ మీడియంలో మెడిసిన్ పుస్తకాలను తాము విడుదల చేశామని గుర్తు చేస్తూ, త్వరలో సాంకేతిక కోర్సులకు సంబంధించిన మెటీరియల్‌నూ తమిళంలోకి తర్జుమా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

సేవా దృక్పథంతో..

విద్య, వైద్య రంగాలు సేవాతత్వంతోనే కొనసాగాలన్నదే తన ఆంకాంక్ష అని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. రోజురోజుకూ వైద్య రంగం ఆధునికతను సంతరించుకుంటోందన్నారు. అయితే ఖర్చు మరీ ఎక్కువ అవుతోందని, ఇది పేదలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందరికీ ఉన్నత వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామని, ఇందులో ప్రైవేటు సహకారం, భాగస్వామ్యం పెరగాలని పిలుపు నిచ్చారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం వైద్య బీమా పథకం విస్తృతం చేశామని గుర్తు చేశారు. దేశంలోనే చెన్నై సిటీ మెడికల్ కేపిటల్‌గా అవతరించి ఉందని, ఎలాంటి వైద్య సేవలైనా ఇక్కడ అందుబాటులో ఉన్నాయని వివరించారు.

నౌకాదళ ప్రాముఖ్యంపై అవగాహన



కోస్ట్‌గార్డ్ సిబ్బందితో విద్యార్థులు

కొరుక్కుపేట: దేశంలో నౌకాదళ ప్రాముఖ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నేవీ ఉన్నతాధికారులు సూచించారు. నగరానికి చెందిన వివిధ పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ షిప్‌లను ఆదివారం సందర్శించి కొత్త అనుభూతి పొందారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చెన్నై పరిసర ప్రాంతాల్లోని ఐదు పాఠశాలలకు చెందిన 44 మంది ఉపాధ్యాయులతో పాటు 797 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్, సెయింట్ ప్యాట్రిక్స్ ఐసీఎస్‌ఐ స్కూల్, డీఏవీ గర్ల్స్ గోపాలపురం, ఏఎం జైన్ స్కూల్ మీనంబాక్కం, పద్మ శేషాద్రి బాల్ భవన్ సిరుచ్చేరి విద్యార్థులు మొదటి శిక్షణ స్క్వాడ్రన్ ఐఎన్ఎస్‌టీర్, ఐఎన్ఎస్ సుజాత, సీజీఎస్ సారథి అనే షిప్‌లను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు నౌకలు, ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ పాత్ర, సామర్థ్యాల గురించి విద్యార్థులకు తెలియజేశారు.

లారీ – బస్సు ఢీ

- ఇద్దరి మృతి, 10 మందికి గాయాలు

తిరువొత్తియూరు: ఊలుందూర్‌పేట బైపాస్ రోడ్డులో లారీని డీలెక్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. 10 మందికి పైగా గాయపడ్డారు. వివరాలు.. చెన్నై నుంచి శనివారం రాత్రి కేరళ రాష్ట్రానికి పశువులను తరలిస్తున్న లారీని కల్లకురిచ్చి జిల్లా ఉలుందూర్ పేట బైపాస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున ప్రైవేటు డీలెక్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ, బస్సు రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. బస్సులో ప్రయాణిస్తున్న వేళచ్చేరి ప్రాంతానికి చెందిన ఆటని దాసన్ (58), కన్యాకుమారి జిల్లా విలవంకోట్టైకు చెందిన కమలాబాయ్ (64) మృతి చెందారు. బస్సు డ్రైవర్ తవమణి సహా 10 మందికి గాయాలయ్యాయి. అక్కడికి చేరుకున్న స్థానికులు గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఊలుందూర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమలంతో కటీఫ్?

- రెండాకుల గుర్తు దక్కకున్నా బరిలో దిగుతాం..
- ఉప ఎన్నికపై పళణి శిబిరం కీలక నిర్ణయం
- ప్రచారంలో డీఎంకే బిజీబిజీ



మద్దతుదారులతో చర్చిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇళంగోవన్

సాక్షి, చెన్నై: భారతీయ జనతా పార్టీతో తెగదెంపులకు పళని శిబిరం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తమకు రెండాకుల గుర్తు దక్కినా..దక్కకున్నా ఈ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని నిలబెట్టి తీరుతారలని పళని స్వామి భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ వర్గాలతో ఆదివారం జరిపిన చర్చల్లో నిర్ణయించినట్లు సమాచారం.

కాంగ్రెస్ పరుగులు..

మరోవైపు ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇలంగోవన్ గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా డీఎంకే దూసుకెళ్తోంది. 50 వేల ఓట్ల మెజారిటీ సాధించడమే లక్ష్యంగా 11 మంది మంత్రులు, 22 మంది ముఖ్య నేతలు ఇంటింటికీ వెళ్లి ఓట్ల వేటలో ఉన్నారు. అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం, డీఎండీకే కూడా అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల పనులు ప్రారంభించారు. అయితే అన్నాడీఎంకేలో విభేదాల నేపథ్యంలో ఆ పార్టీ చర్చలు, సమీక్షలు, సమావేశాలకే పరిమితమైంది. ప్రధానంగా జాతీయ పార్టీ బీజేపీ మద్దతు కోసం అన్నాడీఎంకేలోని పన్నీరు సెల్వం, పళణి స్వామి శిబిరాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో పాటు ముఖ్య నేతలను ఇప్పటికే ఇరు శిబిరాల ప్రతినిధులు వేర్వేరుగా కలిసి మద్దతు కోరారు. అధికారికంగా బీజేపీ నుంచి ఇంత వరకు ఏ శిబిరానికీ మద్దతు దక్కలేదు. దీంతో తమ అభ్యర్థిని ప్రకటించాలని పళణి శిబిరం నిర్ణయించింది.

తీవ్ర ప్రయత్నాలు..

రెండాకుల గుర్తు కోసం సోమవారం సుప్రీంకోర్టులో పళణి స్వామి శిబిరం చివరి ప్రయత్నం చేయనుంది. కేంద్రం మద్దతు ఉన్న పక్షంలో ఎన్నికల యంత్రాంగం ద్వారా గుర్తుతో పాటు, బీఫాంలో సంతకం పెట్టే అధికారం తనకు దక్కుతుందని ఇన్నాళ్లూ పళని స్వామి భావించారు. అయితే బీజేపీ ఏ విషయాన్నీ స్పష్టం చేయకపోవడం ఆయన్ని కలవరంలో పడేసింది. దీంతో ఆదివారం ఈరోడ్‌లో జరిగిన పార్టీ నేతల సమావేశంలో రెండాకుల చిహ్నాం కోసం చివరి వరకు ప్రయత్నిద్దామని, అది దక్కని పక్షంలో స్వతంత్రంగానైనా పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని నేతలకు ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. కాగా ఈ పరిస్థితుల్లో బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికకు గాను.. మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకోసం ఈరోడ్ కార్పొరేషన్ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శివకుమార్ వ్యవహరించనున్నారు. నామినేషన్ దాఖలుకు వచ్చే అభ్యర్థులకు కఠిన ఆంక్షలు విధించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థితో పాటు కార్యాలయంలోకి నలుగురిని మాత్రమే అనుమతిస్తారు. ఊరేగింపుగా వచ్చే వాహనాలను 100 మీటర్ల దూరంలోనే ఆపేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల సైతం తమ వాహనాలను అక్కడే ఆపేసి నడుచుకుంటూ రావాల్సి ఉంటుంది. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన, ఎన్నికల ఖర్చు తదితర వ్యవహారాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల బృందం మంగళవారం ఈరోడ్‌కు రానుంది. ఇప్పటికే అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం, డీఎంకే వర్గాలపై పదుల సంఖ్యలో కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా, తూర్పు నియోజకవర్గ పరిధిలో గత కొద్ది రోజులుగా రూ. 2 వేలు, రూ. 500 నోట్ల చెలామణి పెరగడం గమనార్హం.

తైపూసం ఉత్సవాలు ప్రారంభం

- ఘనంగా ధ్వజారోహణం
- పళనిలో 10 రోజుల పాటు వేడుకలు
- ఆరుపడైవీడుకి పోటెత్తుతున్న పాదయాత్ర భక్తులు
- ఫిబ్రవరి 3న కల్యాణోత్సవం
- 4న రథోత్సవం



ధ్వజారోహణంతో తైపూసం ఉత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు, ఉభయ దేవేరులతో సుబ్రహ్మణ్యస్వామి

సాక్షి, చెన్నై: పళనిలో బ్రహ్మోత్సవ శోభ నెలకొంది. భక్త జనంతో ఆరుప్పడై వీడు పులకించి పోతోంది. హోరోహర నామస్మరణ మధ్య ఆదివారం తైపూసం బ్రహ్మోత్సవాలకు అర్చకులు ధ్వజారోహణం నిర్వహించారు. వివరాలు.. తమిళ్ కడవుల్ మురుగన్‌కు ఉన్న ఆరుప్పడై వీడులలో మూడోదిగా పళని ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఇక్కడ దండాయుధపాణిగా సుబ్రహ్మణ్య స్వామి కొలువై ఉన్నారు. కొండపై ఉన్న ఈ ఆలయానికి మెట్లు, రోప్‌కార్, రించ్ మార్గాల్లో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వస్తుంటారు. ఈ ఆలయంలో 16 ఏళ్ల అనంతరం శుక్రవారం కుంభాభిషేకం మహోత్సవం కనుల పండువగా జరిగింది. జీర్ణోద్ధారణ పనులతో కొత్తగా ముస్తాబైన ఆలయాన్ని, స్వామి వారిని, పరివార దేవతలను దర్శించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ సమయంలో ఆలయంలో తైపూసం మహోత్సవానికి ధ్వజారోహణం ఆదివారం అత్యంత వేడుకగా నిర్వహించారు.

లక్షల సంఖ్యలో భక్తులు..

పళనిలో తైపూసం బ్రహ్మోత్సవాలకు ఏటా లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టే విధంగా ఆదివారం ఉదయం తూర్పు రథం వీధిలోని పెరియ నాయకి అమ్మన్ ఆలయం వద్ద ఉన్న ధ్వజస్తంభానికి విశేష పూజలు నిర్వహించారు. వినాయకుడి సన్నిధిలో పూర్ణాహుతి చేపట్టారు. వళ్లి, దేవానై సమేత ముత్తు కుమార స్వామికి అభిషేకాది పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పరివార దేవలను ఈ వేడుకకు ఆహ్వానించే విధంగా పసుపు వర్ణంతో కూడిన జెండాను ధ్వజస్తంభంపై ఎగుర వేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. 9.30 గంటలకు మీనా లగ్నంలో ధ్వజారోహణం వైభవంగా సాగింది.

నిఘా కట్టుదిట్టం..

తైపూసం ఉత్సవాల్లో భాగంగా 10 రోజుల పాటు స్వామి, అమ్మవార్లు బంగారు, వెండి రథాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించనున్నారు. ఫిబ్రవరి 3న కల్యాణోత్సవం, 4న రథోత్సవం జరగనుంది. ఈ ఉత్సవాలకు కారైక్కుడి, శివగంగై, రామనాథపురం, మదురై, తేని, విరుదాగనర్ తదితర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు పాదయాత్రగా పళనికి రావడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా భక్తుల సంఖ్య అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. దీంతో పాదయాత్ర భక్తుల కోసం అధికారులు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఇక పోలీసులు పళనిని పూర్తిగా నిఘా నీడలోకి తీసుకొచ్చారు. ఐజీ అస్రకార్గ్ భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

కనులపండువగా తీర్థవారి

- తెన్‌పెన్నై నదిలో అన్నామలైయార్‌కు విశేష పూజలు
- పోటెత్తిన భక్తులు



తీర్థవారి నిర్వహిస్తున్న శివాచార్యులు



ఊరేగింపులో భక్తులకు అభయప్రదానం చేస్తున్న స్వామి, అమ్మవారు

తిరువణ్ణామలై(వేలూరు): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని అన్నామలైయార్‌కు తెన్‌పెన్నై నదిలో ఆదివారం ఉదయం తీర్థవారి అత్యంత వేడుకగా నిర్వహించారు. ఏటా తమిళ తైమాసంలో అన్నామలైయార్‌కు సొంతమైన 180 ఎకరాల వ్యవసాయ భూమిలో పండించే పంటలను సందర్శించే వేడుక, విల్లుపురం జిల్లా నుంచి వచ్చే తెన్‌పెన్నై నది, సెయ్యారు నుంచి వచ్చే గౌతమి నది, కలసపాక్కం నది మన్నార్‌పేటలో మూడు నదులు కలిసే ప్రాంతంలో అన్నామలైయార్‌కు తీర్థవారి నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం చంద్రశేఖరుడిని తిరువడియాగ అన్నామలైయార్‌ను ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణ చేసి భక్తుల దర్శనార్థం తిరువణ్ణామలై ఆలయం నుంచి కలశపాక్కం సెయ్యారు నది వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని స్వామి వార్లకు కర్పూర హారతులు పట్టడంతో పాటు శాలువలు, చీరలను అందజేసి మొక్కు తీర్చుకున్నారు. ఈ తీర్థవారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తీర్థవారి అనంతరం స్వామివారు వివిధ గ్రామాలను చుట్టి ఆదివారం అర్ధరాత్రికి ఆలయానికి చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



కలసపాక్కం నదీతీరంలో భారీగా భక్తజనం

క్లుప్తంగా

తంగుటూరి రామకృష్ణకి ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

కొరుక్కుపేట: ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షులు తంగు టూరి రామకృష్ణ.. ఇండోనేషియాలోని బాలిలో రాయల్ ఫ్యామిలీ కింగ్ మహేంద్ర వర్మ చేతులు మీదుగా స్పెషల్ అవార్డును అందుకున్నారు. అలాగే ఆయన అక్కడ నిర్వహించిన డాక్టరేట్ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవడం విశేషం. కాగా అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న తంగుటూరి రామకృష్ణకు చెన్నైలోని వామ్ సభ్యులు, తెలుగు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

యువ కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



భరతనాట్యం గురువులతో మరియ రాజ్

కొరుక్కుపేట: యువ కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తాండవ కల్చరల్ ఫెస్ట్–2023 పేరిట వార్షిక భరత నాట్య పోటీలను నిర్వహించనున్నట్లు లాస్య డ్యాన్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ మరియ రాజ్ తెలిపారు. తాండవ కల్చరల్ ఫెస్ట్ షోకు దర్శకత్వం వహించనున్న కలైమామని రాధిక శురాజిత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. లాస్య డ్యాన్స్, కలైసంగమ ఫౌండేషన్ సంయుక్తంగా ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా భరత నాట్య పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీన చెన్నై వడపళనిలోని లాస్య ఆరంగంలో ప్రిలిమినరీ రౌండ్ పోటీలు నిర్వహించి 20 టీమ్‌లను ఎంపిక చేస్తామన్నారు. ఫిబ్రవరి 19న శివరాత్రి సందర్భంగా ఫైనల్స్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

● ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్

తిరువళ్లూరు: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ అన్నారు. తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడులో రెండు రోజుల పాటు జరిగిన చిరుధాన్యాల ఫెస్టివల్–2023 ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మంత్రి సుబ్రమణియన్ హాజరయ్యారు. ప్రదర్శనలో ఉంచిన 365 రకాల చిరుధాన్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ ఆహారం తీసుకోవడం వల్లే మన పూర్వీకులు ఆరోగ్యంగా జీవించారని తెలిపారు. సంప్రదాయ ఆహారాలను భావితరాలకు అందించాలని సూచించారు. చిరుధాన్యాల్లో లభించే పోషక విలువలను అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పిజ్జా, బర్గర్ వంటి జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఆహారాన్ని తయారు చేసే సమయంలో సిల్వర్, అల్యూమినియం పాత్రల కంటే మట్టి పాత్రలను ఉపయోగించాలని సూచించారు. కొంత మంది మిగిలిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో ఉంచుతుంటారని.. ఇవి ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. ఎప్పటికప్పుడు వండుకుని తింటేనే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు. చిరుధాన్యాల ఆహార జాతర పేరిట రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఒకసారి ఉపయోగించిన నూనెలను బయోగ్యాస్ ద్వారా శుద్ధీకరణ చేసే 6627 శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈట్ రైట్ చాలెంజ్ పేరుతో 11 జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆల్బ్రిజాన్‌వర్గీష్, మధురవాయల్ ఎమ్మెల్యే కారపాక్కం గణపతి, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణియన్, కలెక్టర్

గ్యాస్ వినియోగంపై అవగాహన



అవగాహన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తిరువళ్లూరు: గ్యాస్ సిలిండర్లను సురక్షితంగా వినియోగించడంపై అధికారులు అవగాహన కల్పించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గ్యాస్ వినియోగదారుల సంఘం నిర్వహించిన కార్యక్రమానికి రీజినల్ అసిస్టెంట్ మేనేజర్ తిలకం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్యాస్ సిలిండర్‌ల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిలిండర్ నుంచి చిన్నపాటి లీకేజీ ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్యాస్ వాడిన తరువాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. నాణ్యతలేని రెగ్యులేటర్, పైప్, బర్నర్ లాంటి వాటిని ఉపయోగించకూడదని సూచించారు. ప్రజలకు గ్యాస్ వాడకంతో పాటు ప్రమాద బీమా పొందే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వినియోదారుల సంఘం నేతలు బాబునాయుడు, రాజేష్, మురళి, ముత్తమిళ్‌సెల్వన్, రోటరీ సంఘం అధ్యక్షుడు రూప్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొరుక్కుపేట: ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య చిత్రాలతో రూపొందిన 2023 సంవత్సర వార్షిక క్యాలెండర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగు మహాజన సమాజం అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి శనివారం రాత్రి జరిగిన సర్వసభ్య సమావేశంలో ఘనంగా ఆవిష్కరించారు. ఇందులో గోవింద్, రంగారెడ్డితో పాటు సభ్యులు జేకే రెడ్డి, జయశ్రీ, రాధాలక్ష్మి, వపా, చిత్రకారులు రాకీ అలియాస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్ రెడ్డి

అభిమానికి కార్తీ నివాళి



అభిమాని మృతదేహానికి నివాళులర్పిస్తున్న కార్తీ

తమిళ సినిమా: స్థానిక తిరువాన్మయూర్ చెందిన కుమార్, శాంతి దంపతుల కొడుకు వినోద్ (29) డ్రైవర్‌గా పని చేసేవాడు. నటుడు కార్తీకి వీరాభిమాని. దక్షిణ చెన్నై జిల్లా తూర్పు విభాగం కార్తీ అభిమానం సంఘం కోశాధికారిగా ఉన్నాడు. కాగా వినోద్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్తీ అభిమాని వినోద్ ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించాడు. అతని తల్లిదండ్రులను ఓదార్చారు.

గులాబీమయం



తిరుత్తణి: తిరుత్తణి యూనియన్ బీరకుప్పం శ్రీరామాలయం ప్రాంగణంలోని విదేశీ జాతికి చెందిన జపాన్ చెట్టు ఏడాదిలో ఒక్కసారి మాత్రమే పువ్వులు పూస్తుంది. ప్రస్తుతం ఆ చెట్టు మొత్తం పువ్వులతో గులాబిమయంగా మారింది. చూపరులను కనువిందు చేస్తోంది.

అభినందన



మహిళల భద్రత, అభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ సైకిల్‌పై భారత్ యాత్ర చేపట్టిన ఆషా మాలవ్య ఆదివారం తమిళనాడుకు చేరుకున్నారు. సెక్రటరియేట్‌లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిశారు. సీఎం ఆమెను అభినందించారు. స్టాలిన్‌కు గాంధీ రచించిన ఫెయిత్ అండ్ ఫ్రీడం అనే పుస్తకాన్ని, ఆషా అందజేశారు. కాగా ఈమె ఇప్పటి వరకు మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో యాత్ర పూర్తి చేశారు. -తిరువొత్తియూరు

ఆ నలుగురా పుస్తకావిష్కరణ



కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న తమ్మినేని బాబు

కొరుక్కుపేట: జనని సాంఘిక సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత బొందల నాగేశ్వరరావు రచించిన ఆ నలుగురా (కథా సంపుటి) పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. చెన్నై పెరంబూరులోని డీఆర్‌బీసీసీసీ మహోన్నత పాఠశాల వేదికగా నిలిచింది. జనని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు ముద్దులూరు సురేష్ స్వీకరించారు. పెరంబూరు తెలుగు సాహితీ సమితి కార్యదర్శి డాక్టర్ టీఆర్‌ఎస్ శర్మ పుస్తక రచయితను అభినందించారు. మద్రాసు వర్సిటీ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకర రావు పుస్తక సమీక్షను చేశారు. 20 కథలతో కూడిన ఆ నలుగురా పుస్తకం విలక్షణమైనదని పేర్కొన్నారు. రచయిత బొందల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 250 కథలకుపైగా రాశానని తెలిపారు. నిడమర్తి వసుంధరా దేవి పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణంపై రెండు గ్రామాల మధ్య వివాదం



రాస్తారోకో చేస్తున్న లాలాపేట గ్రామస్తులు

● రాస్తారోకో, దుకాణాల మూసివేత

వేలూరు: రాణిపేట జిల్లా ముకుందరాయపురం పంచాయతీ పరిధిలోని కాంచనగిరి కొండపై 300 ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం ఉంది. ఇక్కడ అగ్రావరం, లాలాపేట, నెల్లికుప్పం, మోటూరు, ఢిల్లీ కుప్పం వంటి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆలయ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. లాలాపేటలో మొత్తం 7 వేల కుటుంబాలకు పైగా ఉన్నాయి. ఈ ఆలయానికి గతంలో ముకుందరాయపురం, లాలాపేటకు చెందిన గ్రామస్తులు నిర్వాహకులుగా ఉండే వారు. ప్రస్తుతం కొత్త శివాలయం ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో ముకుందరాయపురం గ్రామానికి చెందిన వారిని మాత్రమే ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించారు. అలాగే లాలాపేట గ్రామస్తులు ఉపాధి హామీ పనులకు సైతం రాకూడదని, సాగు, తాగునీటిని ఉపయోగించరాదని పంచాయతీలో తీర్మానం చేశారు. దీంతో ఆగ్రహించిన లాలాపేట వాసులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు సైతం దుకాణాలు మూసి వేసి బస్టాండ్ వద్దకు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న రాణిపేట డీఎస్పీ ప్రభు ఆధ్వర్యంలో పోలీసులు అధిక సంఖ్యలో చేరుకొని గ్రామస్తులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

సూర్యకు జోడీగా సీత?



నటి మృణాల్ ఠాగూర్

తమిళ సినిమా: సూరారై పోట్రు, జై భీమ్ వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత నటుడు సూర్య తన 42వ చిత్రంలో నటిస్తున్నారు. దీనికి చిరుతై, వీరం, విశ్వాసం, అన్నాత్తే చిత్రాల ఫేమ్ శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్ సంస్థ, యూవీ క్రియేషన్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ భారీ చిత్రానికి దేవీశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని నాయకగా నటిస్తోంది. నటుడు యోగి బాబు, కింగ్స్ లీ, కోవై సరళ, ఆనంద్ రాజ్ తదితరులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. కాగా చారిత్రక కథాచిత్రంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని 3డీ ఫార్మాట్‌లో రూపొందిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా చిత్రాన్ని 10 భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు విశేష స్పందన రావడంతో పాటు చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఇందులో ఒక కీలకపాత్రలో నటి మృణాల్ ఠాగూర్ నటిస్తోందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇదే కనుక నిజమైతే సీతారామం చిత్రంతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి కోలీవుడ్ వరకు పాపులర్ అయిన ఈ బెంగాలీ బ్యూటీ తమిళంలో నటిస్తున్న తొలి చిత్రం ఇదే అవుతుంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

కోలీవుడ్ టాక్స్

షరతులు వర్తిస్తాయి!



తమిళ సినిమా: తలైవా.. ఈ పేరు వినగానే అభిమానుల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. ప్రేమ ఉప్పొంగుతుంది. జయాపజయాలకు అతీతంగా వసూళ్ల వర్షం కురిపిస్తాయి. ఈ పేరుకు ఒక బ్రాండ్ ఉంది. అదే సూపర్ స్టార్. ఆయన ఎవరన్నది ఇంకా విడమర్చి చెప్పనవసరం లేదు. ఆయనే రజినీకాంత్. తన ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని రజనీకాంత్ తన న్యాయవాది ద్వారా శనివారం ఒక ప్రకటన విడుదల చేయించారు. అందులో తన అనుమతి లేకుండా తన పేరును, ఇమేజ్‌ను కొందరు వాణిజ్య పరంగా దుర్వినియోగం చేస్తున్నారని తెలిసిందన్నారు. ఇది తన ప్రతిష్టను దెబ్బతీయటమే కాకుండా అభిమానులను అయోమయానికి గురి చేస్తుందని పేర్కొన్నారు. ఇకపై తన పేరు, వాయిస్, ఫొటోగాని, ఆన్ లైన్‌లో గాని తన అనుమతి లేకుండా వాడరాదని తెలిపారు. అలా వాడితే తగిన చర్యలకు గురవుతారని హెచ్చరించారు. దీంతో రజినీకాంత్ విషయంలో అసలు ఏం జరిగింది? ఎవరు ఆయన పేరును అనధికారికంగా వాడుకుంటున్నారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరైతే ఇది రజనీకాంత్ పబ్లిసిటీ స్టంట్ అనే భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద తన పేరును, ఇమేజ్‌ను వాడుకోవడానికి షరతులు వర్తిస్తాయి అని రజిని సన్నిహితులు పేర్కొంటున్నారు.

ఝాన్సీకి సీక్వెల్ ఉంటుంది



ఝాన్సీ వెబ్‌సిరీస్ యూనిట్

తమిళ సినిమా: నటి అంజలి ప్రధాన పాత్రలో నటిస్తున్న వెబ్ సిరీస్ ఝాన్సీ. ట్రైబల్ హార్స్ ఎంటర్‌టైన్మెంట్‌పై నటుడు కృష్ణ నిర్మిస్తున్న ఈ వెబ్ సిరీస్‌కు తిరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ మొదటి భాగం డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అయ్యి విశేష ఆదరణను పొందింది. తాజాగా ఝాన్సీ రెండో భాగం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అదే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా వెబ్ సిరీస్ నిర్మిస్తున్న కృష్ణ మాట్లాడుతూ.. నిజానికి ఈ వెబ్ సిరీస్‌ను తెలుగులో రూపొందిస్తున్నామని.. తమిళం, హిందీ భాషల్లో అనువాదంగా స్ట్రీమింగ్ చేస్తున్నట్లు చెప్పారు. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ వెబ్‌సిరీస్ తొలి భాగం కంటే రెండో భాగానికి మరింత ఆదరణ లభిస్తోందని అన్నారు. ఝాన్సీ వెబ్ సిరీస్ మూడో భాగాన్ని రూపొందిస్తామని చెప్పారు. నిర్మాతగా కొనసాగుతున్న తాను కథానాయకుడిగా నటించిన మూడు చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. త్వరలోనే తాను నటించే నూతన చిత్రం వివరాలను వెల్లడిస్తానని కృష్ణ చెప్పారు. దర్శకుడు తిరు మాట్లాడుతూ.. దీన్ని తెలుగులో రూపొందించినా తమిళ ప్రేక్షకులకు నచ్చే విధంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఇప్పుడు హిందీలోనూ మంచి ఆదరణ లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ వెబ్ సిరీస్ కోసం ఎంతగానో శ్రమించిన నటి అంజలి, చాందిని, యూనిట్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా నన్నారు.

వర్ణాశ్రమం ఆడియో ఆవిష్కరణ

తమిళ సినిమా: సినిమాకు ఎల్లలు లేవన్న విషయాన్ని వర్ణాశ్రమం చిత్ర నిర్మాత మరోసారి నిరూపించారు. అమెరికాకు చెందిన సింథియా లౌర్డే తన దేశంలో ఒక ఐటీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఆ తర్వాత ఆ సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. పలు భాషలు తెలిసిన ఆమెలో మంచి గాయని ఉన్నారు. దీంతో చిత్రాల్లోనూ గాయనిగా పరిచయం కావాలన్న కోరికతో చెన్నైకి వచ్చిన సింథియా లౌర్డే ఇప్పుడు ఏకంగా కథానాయకిగా, నిర్మాతగా మారారు. ఈమె సింథియా ప్రొడక్షన్ హౌస్ పతాకంపై నిర్మించి, కథానాయకిగా నటించిన చిత్రం వర్ణాశ్రమం. ఇందులో ఆమె ఒక పాటను కూడా పాడారు. సుకుమార్ అళగర్ సామి దర్శకత్వం వహించిన ఇందులో నటుడు, దర్శకుడు రామకృష్ణన్, బిగ్ బాస్ అమీర్, వైష్ణవి రాజ్, శ్రీరామ్ కార్తీక్, విష్ణుబాల, నిమి మానువెల్, వాసుదేవన్, వందన, ఉమా మహేశ్వరి, ఏపీ రత్నవేల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. దీపన్ చక్రవర్తి సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి మహిళ చాయాగ్రహకురాలు ప్రవీణ.ఎస్ చాయాగ్రహణను అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 10వ తేదీ విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఈ వేదికపై నటి, నిర్మాత సింథియా లౌర్డ్ మాట్లాడుతూ.. తాను గాయనిగా చెన్నైకి వచ్చానని.. అయితే నటుడు రామకృష్ణన్ తనకు దర్శకుడు సుకుమార్ అళగర్ సామిని పరిచయం చేశారన్నారు. ఆయన చెప్పిన కథ తనను ఇంప్రెస్ చేయడంతో తానే నిర్మించడానికి ముందుకు వచ్చానన్నారు. ఇందులో నటించాల్సి వచ్చిందన్నారు. చిత్రం వైవిధ్య భరితంగా ఉంటుందని, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. ఈ చితాన్ని ఆదరిస్తే తాను మరిన్ని చిత్రాలు నిర్మించటమే కాకుండా, తన స్నేహితులు ఇక్కడ సినిమాలు నిర్మిస్తారని చెప్పారు.



వర్ణాశ్రమం చిత్ర ఆడియో ఆవిష్కరణ

నయన్ సంధి సఫలం కాలేదా?





తమిళ సినిమా: చిత్ర పరిశ్రమను విచిత్ర పరిశ్రమ అంటారు. ఇక్కడ లక్కు కిక్కు కంటే కూడా మరొకటి ఉంటుంది. అదేంటో దర్శకుడు, నటి నయనతార భర్త విగ్నేష్ శివన్‌ను చూస్తే తెలుస్తుంది. పోడాపోడి చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైనా నానుమ్ రౌడీదాన్ చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాలు చేసినా, అవి ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేదు. తాజాగా నటుడు అజిత్‌ను డైరెక్ట్ చేసే అవకాశం వరించింది. అజిత్ చిత్రం తుణివు ఇటీవల విడుదలై సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. తదుపరి విగ్నేష్ శివన్ దర్శకత్వంలో నటించడానికి సిద్ధమయ్యారు. దీనిని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనుంది. అనిరుద్ సంగీతాన్ని అందిస్తున్నట్లు సమాచారం. చిత్రం ఫిబ్రవరి మొదటి వారంలో సెట్‌పైకి వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. చిత్రం నుంచి దర్శకుడు విగ్నేష్ శివన్ వైదొలిగినట్లు సామాజి మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అందుకు కారణం విగ్నేశ్ శివన్ చెప్పిన కథ నటుడు అజిత్‌కు, లైకా సంస్థకు సంతృప్తినివ్వక పోవడమేనని సమాచారం. కథలో కొన్ని మార్పులు చేయాలని సూచించినా అందుకు విగ్నేష్ శివన్ నిరాకరించినట్లు టాక్. దీంతో నటి నయనతార రంగంలోకి దిగి ఇరువురి మధ్య సంధి కుదిర్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని ప్రచారం జరుగుతోంది. అజిత్ కన్విన్స్ అయినా లైకా ప్రొడక్షన్స్ ససేమిరా అన్నట్లు సమాచారం. ప్రస్తుతం అజిత్ 62వ చిత్రానికి మగిళ్ తిరుమేణి దర్శకత్వం వహించినట్లు తాజా సమాచారం. ఈయన ఇంతకుముందు మిగామన్, తడం, కలగతలైవన్ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. కాగా విజయ్ కోసం తయారు చేసిన కథను అజిత్‌తో చేయడానికి సిద్ధమవుతున్నట్లు టాక్.

క్లుప్తంగా

చైన్ స్నాచింగ్ కేసులో ఆంధ్రా యువకుడి అరెస్ట్


నిందితుడు నాగరాజు(ఫైల్)

పళ్లిపట్టు: వెలిగరం గ్రామానికి చెందిన చెల్లమ్మ(60) స్థానికంగా ఉండే రోడ్డులో గతనెల 31వ తేదీన నడిచి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 8 సవర్ల చైన్‌ను లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పళ్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈక్రమంలో ఆదివారం షోళింగర్ రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటు వైపు బైకులో వెళ్లిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నిందితుడు తరచూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు తేలింది. నిందితుడు చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన నాగరాజు(27)గా తేలింది.

వేదాంతన్ పట్టిలో అలరించిన జల్లికట్టు

తిరువొత్తియూరు: పుదుకోట్టై జిల్లా పాన్ అమరావతి సమీపంలోని వేదాంతన్ పట్టిలో ఆదివారం జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. ఈ పోటీలను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎస్. రఘుపతి జెండా ఊపి ఆటను ప్రారంభించారు. జల్లికట్టులో 600 ఎద్దులు, 300 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. పెద్దసంఖ్యలో ప్రేక్షకులు తరలిరావడం గమనార్హం.

నర్సింగ్ విద్యార్థి ఆత్మహత్య

అన్నానగర్: కాలేజీ హాస్టల్‌లో నర్సింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమరి జిల్లా కలియక్కవిలై సమీపంలోని పడందాలులో గ్రేష్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నడుస్తోంది. తంజావూరు జిల్లాకు చెందిన వీరేశం కుమారుడు సుమిత్రన్ (19) కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ క్యాంపస్‌లోని హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి సుమిత్రన్ టాయిలెట్‌కు వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. ఉదయం తోటి విద్యార్థులు నిద్ర లేచి చూసేసరికి సుమిత్రన్ హాస్టల్‌పై అంతస్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి సుమిత్రన్ రాసిన లేఖ పోలీసులకు చిక్కినట్లు సమాచారం. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

● యువకుడి మృతి

అన్నానగర్: చెన్నై అశోక్ పిల్లర్ జంక్షన్‌లో శనివారం బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. చెన్నై విల్లివాక్కం, నెర్కుండ్రానగర్‌కు చెందిన మురుగన్ కుమారుడు లింగేశ్వరన్ (21) ఓ ప్రైవేట్ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం 5 గంటలకు బైక్‌పై గిండి వైపు వెళ్తున్నాడు. చెన్నై అశోక్ పిల్లర్ జంక్షన్ వద్ద రాగానే అటుగా వస్తున్న ఓ లారీ హఠాత్తుగా ద్విచక్రవాహనాన్ని అతివేగంతో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన లింగేశ్వరన్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గిండి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరువణ్ణామలై జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ రాజ్‌కుమార్ (27)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

దత్త పుత్రికపై లైంగిక వేధింపులు

● తండ్రి అరెస్ట్

అన్నానగర్: పెంపుడు కూతురిని లైంగికంగా వేధించిన కిరాతక తండ్రిని ఆదివారం పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని అన్నానగర్‌కు చెందిన అబ్దుల్ రెహమాన్ (44) ఫుడ్ డెలివరీలో పనిచేస్తున్నాడు. భార్య(35) ఉంది. వీరు 13 ఏళ్ల బాలికను పెంచుతున్నారు. శనివారం రాత్రి మద్యం మత్తులో వచ్చిన అబ్దుల్ రెహమాన్ ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారిని లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని బాలిక రెహమాన్ భార్యకు తెలిపింది. ఆమె అన్నానగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. రెహమాన్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలింది. అతన్ని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి ఎగ్మోర్ కోర్టులో హాజరుపరిచి, పుళల్ జైలులో ఉంచారు.

విద్యార్థులకు గంజాయి విక్రయం

● నకిలీ స్వామిజీ అరెస్ట్

తిరువణ్ణామలై(వేలూరు): తిరువణ్ణామలై గిరివలయం రోడ్డులోని పలు ఆశ్రమాలతో పాటు రోడ్డు పక్కన అధిక సంఖ్యలో సాధువులు ఉంటున్నారు. అయితే సాధువుల వేషం ధరించి గిరివలయం రోడ్డులో పలువురికి గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం గిరివలయం రోడ్డులో పోలీసులు సాధువుల వద్ద తనిఖీలు చేసేందుకు ప్రయత్నం చేశారు. సాధువు దుస్తులు ధరించిన నకిలీ స్వామిజీ పోలీసులను చూసిన వెంటనే అక్కడి నుంచి పరుగులు తీశారు. పోలీసులు అతన్ని పట్టుకుని బ్యాగులో తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. విచారణ చేయగా పుదుకోట్టై జిల్లా అరంతాంగిలోని జీవానగర్‌కు చెందిన ఆరుముగం(48) అని తెలిసింది. సాధువులకు గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నకిలీ స్వామిజీని అరెస్ట్ చేసి తిరువణ్ణామలై జేఎం వన్ కోర్టులో హాజరుపరిచి సెంట్రల్ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఆరుముగం ఆంధ్రాలో గంజాయిని కొనుగోలు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసింది.

విదేశీయులు సైతం కీర్తించిన భాష తెలుగు


నటి ప్రభను సత్కరిస్తున్న జేకే రెడ్డి, కందనూరు మధు దంపతులు



ఉమా మురళి బృందం కుచిపూడి ప్రదర్శన

• సినీ నటి ప్రభ

కొరుక్కుపేట: స్వదేశీయులతో పాటు విదేశీయులు సైతం కొనియాడిన భాష తెలుగు అని.. ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి, నటీమణి ప్రభ అన్నారు. ఈ మేరకు వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 11వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. టి.నగర్‌లోని ఆస్కా క్లబ్ గోదావరి హాలు వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళారత్న ప్రభ పాల్గొని వేడుకలను ఆరంభించారు. నాలుగు వేదలతో పాటు నాట్యాన్ని పంచమ వేదం అంటారని, ఆ నాట్యంతోనే అందరి ముందు నిలిచే భాగ్యం కలిగిందని ఆమె అన్నారు. గరికపాటి నరసింహా రావు వంటి ఎందరెందరో పంచుకున్న ఈ వేదికలో తాను పాల్గొండటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ముందుగా వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేస్తూ 2010 మార్చి లో ప్రారంభమైన వేద విజ్ఞాన వేదిక ఉపన్యాసాలు కరోనా విపత్తు వరకు నిరాటంకంగా జరిగాయి. వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జె.కె. రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కంటే కూడా భాషేతర రాష్ట్రం అయిన తమిళనాడులో చక్కటి తెలుగు కార్యక్రమాలు నిర్వహించుకోవటం చాలా గర్వంగా ఉందన్నారు. వక్తలుగా దేవుళ్ల చిన్ని కృష్ణయ్య, కాసల నాగభూషణం, వెన్నెల కంటి, ఎల్‌బీ శంకర రావు, విస్తాలి శంకర రావు సహకారం మరువలేనిది గుర్తుచేశారు. చెన్నై శుభశీల డాన్స్ అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కూచిపూడి నత్య వైభవాన్ని కలైమామణి ఉమామురళి బృందం కళ్లకు కట్టింది. ఈ కార్యక్రమంలో ఆస్కా అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డితో పాటు సీఎంకే రెడ్డి, రవి సన్నారెడ్డి, కాట్రగడ్డ ప్రసాద్, ఆది శేషయ్య తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు. అతిథి నటి ప్రభను, కుచిపూడి కళాకారులను జేకే రెడ్డి, మధు దంపతులు ఘనంగా సత్కరించారు.

భూమిని దక్కించుకునేందుకు భర్తపై హత్యాయత్నం

- భార్య కోసం పోలీసుల గాలింపు

అన్నానగర్: తిరుపూర్ సమీపంలో రెండెకరాల భూమి కబ్జా చేసేందుకు విషపు ఇంజెక్షన్ ఇచ్చి రైతును హత్య చేసేందుకు యత్నించిన భార్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. తిరుపూర్ జిల్లా కున్నతుర్ తోటతుప్పాలయం ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణి (48) రైతు. ఇతనికి రెండు ఎకరాల భూమి ఉంది. రెండేళ్ల క్రితం దిండుక్కల్‌కి చెందిన దేవి (35)ని వివాహం ఆయన చేసుకున్నాడు. ఈ క్రమంలో సుబ్రహ్మణి తల్లి, దేవి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో సుబ్రహ్మణి తల్లి కూతురి ఇంటికి వెళ్లింది. కాగా తల్లి, సోదరి సంతకాలు తీసుకుని 2 ఎకరాల భూమిని అమ్మివేసి దిండుక్కల్‌కు వెళ్లి జీవిద్దామని దేవి చెప్పడంతో సుబ్రహ్మణ్యం ఒప్పుకోలేదు. ఇదే సమయంలో ఈనెల సంక్రాంతి రోజున సుబ్రహ్మణికి జ్వరం రావడంతో దేవి ఓ ఇంజెక్షన్ ఇచ్చింది. వెంటనే సుబ్రహ్మణి కళ్లుతిరిగి పడిపోయాడు. అనంతరం బంధువులు అతడిని ఈరోడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తర్వాత కున్నత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవి పరారైంది. కాగా భూమిని దక్కించుకోవాలనే ఆశతో భర్తకు విషపు ఇంజెక్షన్ వేసి హత్య చేసేందుకు ప్రయత్నించిందా? అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో మందుల కొరత తీర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశ్విన్

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, మందుల కొరతను తీర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. తిరువళ్లూరు జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం శిరువానూర్ కండ్రిగలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ ఐటీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నిర్మల్‌కుమార్ ప్రసంగించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. వైద్యులను భర్తీ చేయాలన్నారు. ఆవడి తిరుముల్లైవాయల్ ప్రాంతంలోని మాసిలామునీశ్వర ఆలయ మరమ్మతు పనులను ప్రభుత్వం చేపట్టాలని కోరారు. ఆవడి-పూందమల్లి రోడ్డు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పట్టాభిరామ్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. తిరువళ్లూరు జిల్లాలో గంజాయి, గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. పెన్నేర్‌కుప్పం ప్రభుత్వ పాఠశాల సమీపంలో టాస్మాక్ దుకాణం, బార్‌ను తొలగించాలి తదితర తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే అరుణ్‌సుబ్రమణ్యం, పార్టీ జిల్లా అధ్యక్షుడు అశ్విన్ రాజసింహ మహేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు కరుణాకరన్, ఆర్యశ్రీనివాసన్, లయన్ శ్రీనివాసన్, జైగణేష్, కార్యదర్శులు బాలాజీ, పన్నీర్‌సెల్వం, నేతలు పాండురంగన్, సురేష్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

అన్నానగర్: ఇంటి తాళం పగులగొట్టి 63 సవర్ల నగలు చోరీ చేశారు. సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని కరుప్పూర్ లింగభైరవి నగర్‌కు చెందిన విజయలక్ష్మి (49) భర్త నుంచి విడిపోయి కూతురు అభిరామి(22)తో కలిసి ఉంటోంది. అభిరామి చెన్నైలోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతోంది. ఈ నెల 25న విజయలక్ష్మి ఇంటికి తాళం వేసి చెన్నైకు వెళ్లింది. ఆమె ఇంట్లో పనిచేస్తున్న చిత్ర (40) శుక్రవారం సాయంత్రం ఇంటిని శుభ్రం చేసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. ఆదివారం విజయలక్ష్మి కారు డ్రైవర్ శివ ఇంటికి చేరుకుని చూడగా తలుపులు పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 63 సవర్ల నగలు, 2.5 కిలోల వెండి చోరీకి గురైనట్లు తెలిసింది. సమాచారం మేరకు చెన్నై నుంచి విజయలక్ష్మి ఇంటికి వచ్చింది. దీనిపై కరుప్పూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి అరెస్ట్

తిరువొత్తియూరు: ఆస్తి పన్నులో పేరు మార్చడానికి రూ. 3 వేలు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్‌లై జిల్లా సేరన్ మహాదేవి యూనియన్ సౌత్ వీరనల్లూర్ పంచాయతీకి చెందిన షణ్ముగ సుందరం. ఇతను తన ఇంటి ఆస్తి పన్ను పేరు మార్పు కోసం వీరనల్లూరు పంచాయతీ కార్యదర్శి అళగుపురానికి చెందిన చొక్కలింగం వద్ద దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు రూ. 3 వేలు లంచం కోరినట్లు తెలిసింది. దీని గురించి షణ్ముగ సుందరం నెల్‌లై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇచ్చిన సలహా మేరకు రసాయనం పూసిన రూ. 3 వేలు ఇస్తుండగా శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

రూ. 25 లక్షల బంగారంతో పరారీ

తిరువొత్తియూరు: కోవైలో రూ.25 లక్షల విలువైన బంగారంతో అదృశ్యమైన ఉత్తరాది రాష్ట్రానికి చెందిన ఉద్యోగి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కోవై ఆర్ఎస్‌పురం పొన్నగరం రోడ్డులో నివాసం ఉంటున్న పీయూస్ జైన్ (35) నగల వ్యాపారి. ఇతని వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన సద్దాం హుస్సేన్ (28) పని చేస్తున్నాడు. శుక్రవారం పీయూస్ జైన్ రూ. 25 లక్షల విలువైన 621 గ్రాముల బ్రాస్‌లెట్, ముక్కు పుడకలను సద్దాం హుస్సేన్‌కు ఇచ్చి లేజర్ సాల్‌రింగ్ చేసుకుని రమ్మని పంపాడు. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. సెల్‌ఫోన్‌కు సంప్రదించగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆర్‌కేపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

రైలు కింద పడిన ప్రేమ జంట

-ప్రియురాలి మృతి.. ప్రియుడికి బ్రెయిన్ డెడ్

అన్నానగర్: రైలు కింద పడి ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ప్రియురాలు మృతిచెందగా ప్రియుడికి బ్రెయిన్‌డెడ్ అయ్యింది. వివరాలు.. చెన్నై ఉల్లగరం ప్రాంతానికి చెందిన ఇళంగోవన్ (20) మీనంబాక్కంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలిక(14) ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ వ్యవహారం బాలిక తల్లిదండ్రులకు తెలిసింది. ప్రేమకు అభ్యంతరం చెప్పారు. గురువారం ఇళంగోవన్ పుట్టిన రోజు కావడంతో ఇద్దరూ బైక్‌పై తిరిగారు. అనంతరం పరంగిమలై రైల్వేస్టేషన్ వద్ద మాట్లాడుకున్నారు. ఒక్కటిగా చనిపోదామని నిర్ణయం తీసుకున్నారు. రైలు వస్తుండగా ఇద్దరూ దూకారు. బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఇళంగోవన్‌ను మాంబలం రైల్వే పోలీసులు రాయపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా యువకుడికి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు శనివారం తెలిపారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహనకు సైక్లోథాన్



పాల్గొన్న వైద్యులు, ప్రతినిధులు

సాక్షి, చెన్నై: గర్భశయ క్యాన్సర్, ముందస్తు స్క్రీనింగ్, సకాలంలో టీకాలు వేయించుకోవాలని పిలుపునిస్తూ ఆదివారం పళ్లికరణైలో సైక్లోథాన్ జరిగింది. డాక్టర్ కామాక్షి మెమోరియల్ ఆసుపత్రి నేతృత్వంలో పళ్లికరణై నుంచి పల్లావరం వంతెన వరకు 16 కి.మీ దూరం సాగింది. సీసీబీ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద కుమార్, ఆసుపత్రి చైర్మన్ టీజీ గోవిందరాజన్, డైరెక్టర్లు జయంతి, శివరంజని, సలహాదారు రాధాకృష్ణన్ జెండా ఊపి సైక్లోథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవిందరాజన్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సర్వైకల్ క్యాన్సర్ అనేది ప్రజారోగ్య సమస్యగా మారిందన్నారు. 30–69 ఏళ్ల కలిగిన మహిళలలో గర్భాశయ క్యాన్సర్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

న్యాయవాది దారుణ హత్య

• ఇద్దరి అరెస్టు
• గంజాయి లావాదేవీలే కారణం

అన్నానగర్: కృష్ణగిరిలో లాయర్ హత్య కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులు పోలీసులకు సంచలన వాంగ్మూలం ఇచ్చారు. వివరాలు.. ధర్మపురి జిల్లా అలమరతుపట్టికి చెందిన న్యాయవాది శివకుమార్ (44) ఈ నెల 23వ తేదీ రాత్రి కృష్ణగిరి జిల్లా గురుపరపల్లి వద్ద జాతీయ రహదారిపై కారులో దారుణ హత్యకు గురయ్యాడు. హత్యకు సంబంధించి గురుపరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శివగంగై జిల్లా దేవకోటకు చెందిన ముత్తురామలింగం (32), ధర్మపురి నెల్లినగర్‌కు చెందిన ప్రకాష్ (23) హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు వారిద్దరిని శనివారం అరెస్టు చేశారు. వారు ఇచ్చిన వాగ్మూలంలో శివకుమార్ గంజాయి సరఫరా చేసే బ్రోకర్‌గా పని చేసేవాడు. ఇందుకోసం ముత్తురామలింగం, ప్రకాష్ నుంచి పలుమార్లు డబ్బులు తీసుకుని గంజాయి సరఫరా చేశాడు. అదేవిధంగా ముత్తురామలింగం, ప్రకాష్ గంజాయి కావాలని కోరుతూ శివకుమార్‌కు రూ.లక్షన్నర చెల్లించారు. అయితే శివకుమార్ గంజాయి ఇవ్వకుండా మోసం చేశాడు. ఇదే విషయమై సంఘటన రోజున శివకుమార్‌ను మరోసారి నిలదీశారు. బెంగళూరులో గంజాయి ఉందని, తీసుకొస్తానని చెప్పి శివకుమార్ వారితో కలిసి కారులో వెళ్లాడు. అయితే గంజాయి లేదని, మరో రోజు కొనిస్తానని శివకుమార్ చెప్పాడు. దీంతో కారులో వారి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులకు సమాచారం ఇస్తానని శివకుమార్ చెప్పడంతో ఆగ్రహంతో గొంతు కోసి హత్య చేశారు. మృతదేహాన్ని కారులోనే వదిలేశా మని పోలీసులకు వాగ్మూలం ఇచ్చారు. ఈ హత్యతో సంబంధం ఉన్న నామక్కల్ సోదాపురానికి చెందిన వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నారు.

వెనుకబడిన వర్గాలకు తోడ్పాటు అవసరం


ప్రసంగిస్తున్న పళ్లిపట్టు మాజీ ఎమ్మెల్యే రామన్

తిరుత్తణి: సమాజంలో అట్టడుగువర్గాల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించడం ద్వారా వారి జీవితాలు మెరుగుపడుతాయని పళ్లిపట్టు మాజీ ఎమ్మెల్యే రామన్ అన్నారు. సమాజ ఆర్థిక ప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో తిరుత్తణి సెంగుందర్ కల్యాణ మండపంలో మండల స్థాయి సమావేశం జరిగింది. సంఘం కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసన్ అధ్యక్షతన నిర్వహించారు. తిరుత్తణి నియోజకవర్గంలోని సెంగుంద మొదలియార్ కులస్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రామన్ మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు రామకృష్ణన్ పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న ఇళంగోవన్

తిరుత్తణి: రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే పోరాటాలు తప్పవని రాష్ట్ర పట్టభద్రుల ఉపాధ్యాయుల సంఘం హెచ్చరించింది. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో తమిళనాడు పట్టభద్రుల ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు భాస్కరన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం సలహా అధ్యక్షుడు ఇళంగోవన్ హాజరయ్యారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో స్టాలిన్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఓపీఎస్ విధానాన్ని వెంటనే ప్రకటించకుంటే పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మారథాన్


షర్మిలకు బహుమతి ప్రదానం చేస్తున్న సబ్‌కలెక్టర్

తిరువళ్లూరు: మాదకద్రవ్యాల రహితంగా తిరువళ్లూరును తీర్చిదిద్దడానికి యువత భాగస్వామ్యం కావాలని సబ్‌కలెక్టర్ మహాభారతి పిలుపునిచ్చారు. రోటరీ అసోసియేషన్, ఏబీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మారథాన్‌ను నిర్వహించారు. తిరువళ్లూరు కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన మారథాన్ సుమారు 5 కి.మీ మేరకు సాగింది. సబ్‌కలెక్టర్ మహాభారతి విజేతలకు బహుమతులను అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తిరువళ్లూరును మత్తురహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని కోరారు.
మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఏబీఎస్ విద్యా సంస్థల చైర్మన్ రమేష్ సుబ్రమణ్యం, రోటరీ సంఘం అధ్యక్షుడు శివసుబ్రమణ్యం, కో-ఆర్డినేటర్ గోపి, గవర్నర్ భరణీధరన్, దిలీపన్ పాల్గొన్నారు.

సీఎం స్టాలిన్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు


సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి దురై మురుగన్

వేలూరు: ముఖ్యమంత్రి స్టాలిన్ రెండు రోజుల పర్యటన కోసం వేలూరుకు వస్తున్న నేపథ్యంలో జిల్లాలోని కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని నీటిపారుదల శాఖ మంత్రి, డీఎంకే పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ అన్నారు. వేలూరు డీఎంకే పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కార్యవర్గ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దురై మురుగన్ మాట్లాడుతూ.. వేలూరు జిల్లాలోని పిల్లయార్ కుప్పం నుంచి కాట్పాడి వరకు కార్యకర్తలు సీఎం స్టాలిన్‌కు ఘన స్వాగతం పలకాలన్నారు. ఎంపీ కదీర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, జెడ్పీ చైర్మన్ బాబు, మాజీ ఎంపీ మహ్మద్ సఫీ, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్ కుమార్, కార్పొరేటర్‌లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే కౌన్సిలర్ కిడ్నాప్ వ్యవహారం

• నలుగురి అరెస్టు
• మరో వ్యక్తి కోసం గాలింపు
• భూ వివాదాలే కారణం


అరెస్టు అయిన నవీన్, చంద్రశేఖర్, భాస్కర్, సంతోష్, సురేందర్

తిరువళ్లూరు: అన్నాడీఎంకే కౌన్సిలర్ కొడుకును కిడ్నాప్ చేసిన వ్యవహారంలో ఆంధ్రాకు చెందిన ఇద్దరు యువకులు సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని పల్లవాడ గ్రామానికి చెందిన రమేష్ అన్నాడీఎంకేలో జయలలిత పేరవై విభాగం జిల్లా కన్వీనర్‌గా ఉన్నారు. ఈయన భార్య రోజా(40) కౌన్సిలర్‌గా పని చేస్తున్నారు. కౌన్సిలర్ రోజా, ఆమె కొడుకు జాకబ్‌ని గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 24న తుపాకీతో బెదిరించి కిడ్నాప్ చేశారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. దీనిపై రమేష్ పాదిరివేడు పోలీసులతో పాటు ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పాదిరివేడు పోలీసులు సీసీపుటేజీ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. అయితే కిడ్నాపర్లు అదే రోజు సాయంత్రం రోజాతో పాటు ఆమె కుమారుడిని తిరుపతి జిల్లా సత్యవేడు సమీపంలోని రాళ్లకుప్పం వద్ద వదిలేయడంతో ఇద్దరు క్షేమంగా ఇంటికి చేరారు. అయితే పోలీసులు మాత్రం కిడ్నాప్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. ఎస్పీ కల్యాణ్ సైతం వారిద్దని పిలిపించుకుని విచారణ చేపట్టారు. విచారణలో రమేష్‌కు, అదే గ్రామానికి చెందిన సురేందర్‌కు మధ్య భూవివాదాలు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రమేష్‌తో సురేందర్‌కు మధ్య చాలాకాలం నుంచి భూవివాదాలు ఉన్నట్టు ఒప్పుకున్నాడు. ప్రతి విషయంలోనూ అడ్డుతగులుతున్న రమేష్‌ను బెదిరించడానికి అతడి భార్య కొడుకును కిడ్నాప్ చేసినట్టు తెలిపాడు. సురేందర్‌తో పాటు కిడ్నాప్‌కు సహకరించిన తిరుపతి జిల్లా నాగలాపురం గ్రామానికి చెందిన నవీన్(28) సుదీర్‌పాళ్యం గ్రామానికి చెందిన భాస్కర్(30) రాజపాళ్యం గ్రామానికి చెందిన సంతోష్(25)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరికి సహకరించిన చంద్రశేఖర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన కారు, నకిలీ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

తిరుత్తణిలో భక్తుల రద్దీ సాధారణం


క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాదారణంగా ఉంది. సోమవారం తైపూసం సందర్భంగా తిరుత్తణి ఆలయానికి భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కాగా ఈమేరకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేశారు.

చండీహోమం సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



చండీహోమం సేవలో జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం నిర్వహించిన చండీ హోమం సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు పాల్గొన్నారు. ముందుగా జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ఆలయ ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. చండీ హోమం జరిపించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈవో.. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు.

వాల్మీకుల స్థితిగతులపై ఏకసభ్య కమిషన్ ఆరా

వాల్మీకులతో పలు విషయాలపై చర్చ


ప్యాపిలి : బోయ, వాల్మీకి సామాజిక వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఏక సభ్య కమిషన్ సభ్యులు ఆరా తీశారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లి, మాదినేనిదొడ్డి, సంజీవరాయునిపురం గ్రామాల్లో ఆదివారం వాల్మీకి సామాజిక వర్గీయులతో ఏక సభ్య కమిషన్ సభ్యులు, రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ పలు విషయాలపై చర్చించారు. వాల్మీకులు ప్రధానంగా ఏ వృత్తిపై ఆధార పడ్డారని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయం, వేట, కూలీలుగా పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని వాల్మీకులు తెలిపారు. జననం, మరణం, వివాహం తదితర సందర్భాలతో పాటు వివిధ పండుగల సందర్భాల్లో పాటించే ఆచార వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఐఏఎస్ అధికారితో పాటు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ తదితరులున్నారు. కాగా, బోయవాండ్లపల్లి, మాదినేనిదొడ్డి, సంజీవరాయునిపురం గ్రామాలకు చెందిన వాల్మీకులు తమను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్‌ను కోరారు. ఎస్టీ రిజర్వేషన్లు లేక పోవడంతో తమ పిల్లలకు విద్య, ఉపాధి రంగాల్లో అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హృదయం పదిలం

'స్టెమి' కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధం

హృద్రోగ బాధితులకు సత్వర చికిత్స

రాష్ట్రంలో 38 లక్షల మంది గుండె జబ్బు బాధితులు



సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా హృద్రోగ మరణాలను నియంత్రించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే ప్రాణాపాయ పరిస్థితిని తప్పించవచ్చు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎస్.టి. ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ (స్టెమీ) కార్యక్రమాన్ని అమలు చేసేలా వైద్య, ఆరోగ్య శాఖ ప్రణాళిక రూపొందించింది. సాధారణ పరిభాషలో స్టెమీ అంటే గుండె రక్తనాళాలు 100 శాతం పూడుకుపోవడంతో వచ్చే గుండెపోటు. ఇలాంటి సందర్భాల్లో ఆరు గంటల్లోగా లక్షణాలను గుర్తించి పూడికను కరిగించే చికిత్స (థ్రాంబోలైసిస్ ఇంజక్షన్) అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చు. రాష్ట్రంలో సంభవిస్తున్న మొత్తం మరణాల్లో 32.4 శాతం హృదయ సంబంధిత వ్యాధులే కారణం. 38 లక్షల మందికి పైగా గుండె జబ్బు బాధితులున్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)లో గుండె జబ్బులు అగ్రస్థానంలో ఉంటున్నాయి. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సీఎం జగన్ వీటిపై దృష్టి సారించారు. 'ఫ్యామిలీ డాక్టర్' ద్వారా బీపీ, షుగర్, ఇతర ఎన్‌సీడీ బాధితుల ఆరోగ్యంపై నిరంతర ఫాలోఅప్ ఉంచాలని ఆదేశించారు.

-సాక్షి, అమరావతి

హబ్ అండ్ స్పోక్ విధానంలో..

హబ్ అండ్ స్పోక్ విధానంలో 'స్టెమీ' కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 26 జిల్లాల్లో క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం కలిగిన ఆస్పత్రులను హబ్‌గా అభివృద్ధి చేసి జిల్లా, ఏరియా ఆస్పత్రులను స్పోక్స్‌గా తీర్చిదిద్దుతారు. రాష్ట్రంలో ఎనిమిది ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఇప్పటికే క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం ఉండగా మిగిలిన చోట్ల కూడా అందుబాటులోకి తేనున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం ఉన్న ఆస్పత్రులను హబ్స్‌గా నోటిఫై చేస్తారు. హబ్‌లో కార్డియాలజీ, యాంజియోప్లాస్టీ సదుపాయాలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. స్పోక్స్‌గా వ్యవహరించే ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో జనరల్ ఫిజీషియన్, స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది సేవలందిస్తారు. ఛాతీ నొప్పి, గుండెపోటు సంబంధిత లక్షణాలతో ఆస్పత్రులకు వచ్చే వారికి అత్యవసర వైద్య సేవలు అందించేలా సదుపాయాలు సమకూరుస్తారు. ఐసీయూ సెట్టింగ్‌తో (కరోనరీ కేర్ యూనిట్), ఎలక్ట్రో కార్డియోగ్రామ్ (ఈసీజీ), కార్డియోవర్టర్, థ్రాంబోలైసిస్ థెరపీ నిర్వహించడానికి అవసరమైన మందులు, ఇతర సదుపాయాలు ఉంటాయి. బాధితులను అత్యవసరంగా పెద్దాస్పత్రులకు తరలించేందుకు వీలుగా 108 అంబులెన్స్ అందుబాటులో ఉంటాయి. ఇందులోనూ ఈసీజీ సౌకర్యం ఉంటుంది.

సేవలు ఇలా..

ఏరియా, జిల్లా ఆస్పత్రులకు ఛాతీ నొప్పి, ఇతర గుండెపోటు లక్షణాలతో వచ్చిన వారికి వెంటనే టెలీ ఈసీజీ తీస్తారు. రిపోర్టు హబ్‌లో ఉండే కార్డియాలజిస్టుకు వెళుతుంది. దీన్ని పరిశీలించి గుండె రక్తనాళం ఎంత శాతం పూడుకుపోయింది? వెంటనే థ్రాంబోలైసిస్ అవసరమా? అనే అంశాలను కార్డియాలజిస్ట్ నిర్ధారిస్తారు. స్పోక్ కేంద్ర వైద్యుడిని అప్రమత్తం చేసి అవసరం మేరకు 'థ్రాంబోలైసిస్' ఇంజక్షన్ ఇస్తారు. దీంతో రోగి ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడతాడు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హబ్/సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలిస్తారు.

రెండు నెలల్లో..



స్టెమీ కార్యక్రమాన్ని రెండు నెలల్లో అన్ని చోట్లా ప్రారంభించేలా చర్యలు చేపట్టాం. వైద్యులు, సిబ్బందికి ప్రోటోకాల్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తాం. స్పోక్ ఆస్పత్రులకు స్టెమీ కిట్స్ పంపిణీ చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. దీంతో గోల్డెన్ అవర్‌లో బాధితులకు సత్వర వైద్యం లభిస్తుంది.

– ఎం.టి.కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి

తిరుపతిలో ఇప్పటికే అమలు..

స్టెమీ కార్యక్రమాన్ని గత రెండున్నరేళ్లుగా తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తోంది. తిరుపతి, చిత్తూరు, రాజంపేట, వైఎస్సార్ జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు రుయా ఆస్పత్రిలోని హబ్‌కు అనుసంధానమై గుండెపోటు బాధితులకు సత్వర వైద్య సేవలు అందిస్తున్నాయి. ఇప్పటి వరకూ వంద మందికిపైగా ప్రాణాలను కాపాడామని రుయా మెడిసిన్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ మునీశ్వర రెడ్డి తెలిపారు.



ఆక్రమిత స్థలంలో మాజీ ఎమ్మెల్యే అక్రమ నిర్మాణం

- హెచ్చరిక బోర్డును కప్పేసి.. వేబ్రిడ్జి నిర్మాణం చేపట్టిన మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి

మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం బండమీద కమ్మపల్లెలోని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్ సర్వే నంబర్ 8లో 3.09 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టగా మాజీ సైనికుల సంఘం ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. బండమీద కమ్మపల్లెలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ 3.09 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించారని, అక్రమంగా నిర్మాణాలు కూడా చేపట్టారని మాజీ సైనికుల సంఘంతోపాటు రెవెన్యూ అధికారులు కోర్టులో కేసులు వేయడంతో విచారణ జరుగుతోంది. ఆ భూమికి సంబంధించి జిల్లా జేసీ కోర్టు, హైకోర్టులో కేసులు పెండింగ్ ఉన్నందున అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని రెవెన్యూ అధికారులు మాజీ ఎమ్మెల్యే రమేష్‌కు నోటీసులు జారీ చేశారు. గత ఏడాది డిసెంబర్ 19న ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే, రెవెన్యూ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఆ బోర్డుకు అడ్డంగా తన ఫొటోతో కూడిన ఫ్లెక్సీ కట్టిన మాజీ ఎమ్మెల్యే రమేష్ బయటి వ్యక్తులకు కనిపించకుండా ఆ స్థలంలో అక్రమంగా వే బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారు. ఈ విషయం తెలిసి కలెక్టర్ గిరీషా రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఆదివారం ఆక్రమణ స్థలంలో నిర్మాణంలో ఉన్న వేబ్రిడ్జిని తొలగించారు. నిబంధనల ఉల్లంఘనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

తెలంగాణ

గవర్నర్‌పై గళమెత్తాలి

- పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీయాలి
- బీఆర్ఎస్ ఎంపీలకు కేసీఆర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పలు రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బీఆర్ఎస్ ఎంపీలకు సూచించారు. తమిళనాడు, కేరళ, ఢిల్లీ తదితర చోట్ల గవర్నర్లు సొంత అజెండాతో పని చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్ అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో గవర్నర్ల జోక్యాన్ని నిరోధించడంపై దేశవ్యాప్తంగా విపక్ష పార్టీలతో కలసి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విపక్ష నేతలతో మాట్లాడుతున్నట్లు కేసీఆర్ చెప్పారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ, తమిళనాడు, కేరళ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, స్టాలిన్, విజయన్‌తో పాటు అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్ తదితరులతో మాట్లాడినట్లు పేర్కొన్నాయి. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రగతిలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రానికి ఆర్థికంగా ఆటంకాలు సృష్టిస్తోంది. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోంది. ఈ అప్రజాస్వామిక విధానాలు, కేంద్రం వైఖరిని ఎండగట్టాలి' అని కేసీఆర్ సూచించారు.

సమావేశంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇవీ..

- అదానీ వ్యవహారంలో ఎల్ఐసీ మదుపుదారులు నష్టపోవటంపై పార్లమెంట్‌లో నిలదీయాలి.
- తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, దళిత బంధు పథకాలను దేశవ్యాప్తంగా విస్తరించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి.
- ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ జనగణన కోసం డిమాండ్ చేయాలి.
- కేంద్రీయ విద్యాలయాల మంజూరు, వ్యవసాయంతో ఉపాధి పనుల అనుసంధానం తదితరాలపై ఎలుగెత్తాలి.

హైదరాబాద్‌లోనే 'లీకు'వీరులు!

ఐడీఏ బొల్లారంలోని ప్రింటింగ్ ప్రెస్ నుంచి గుజరాత్ పంచాయత్‌రాజ్ పరీక్షపత్రం లీక్

- ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తీసుకువెళ్లిన గుజరాత్ ఏటీఎస్
- పరీక్షను రద్దు చేసిన జీపీఎస్ఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: గుజరాత్ పంచాయత్ సర్వీస్ సెలక్షన్ బోర్డ్(జీపీఎస్ఎస్‌బీ) నిర్వహించతలపెట్టిన పంచాయత్ జూనియర్ క్లర్క్ పరీక్షపత్రం లీక్ లింకులు హైదరాబాద్‌లో బయటపడ్డాయి. నగర శివార్లలో ఉన్న కేఎల్ హైటెక్ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రితమైన ఈ పరీక్షపత్రం అక్కడ నుంచే బయటకు వచ్చినట్లు తేలింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం మెరుపుదాడి చేసిన ఆ రాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తీసుకువెళ్లారు. ఇప్పటివరకు ఈ లీకేజ్ స్కామ్‌లో మొత్తం 15 మంది అరెస్టు అయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన పరీక్షను జీపీఎస్ఎస్‌బీ రద్దు చేసింది. వాస్తవానికి గుజరాజ్ పంచాయత్ శాఖలో 1,181 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 9.53 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆ రాష్ట్రంలోని 2,995 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అయితే శనివారంరాత్రి ఈ పేపర్ లీక్ జరిగినట్లు ఏటీఎస్‌కు ఉప్పందడంతో వడోదరలోని అట్లాదర ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌పై అధికారులు దాడి చేశారు. ఈ సెంటర్ నిర్వాహకుడు భాస్కర్ చౌదరితోపాటు ఏడుగురిని అరెస్టు చేసిన ఏటీఎస్ అక్కడ ఉన్న పరీక్షపత్రం ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడుగురిలో ఇద్దరు 2019 నాటి బిట్స్ పిలానీ ఆన్‌లైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ గోల్‌మాల్ వ్యవహారంలో ఉన్నారని, అప్పట్లో సీబీఐ ఈ ద్వయాన్ని అరెస్టు చేసిందని ఏటీఎస్ ప్రకటించింది.

ఒడిశా నుంచి..

భాస్కర్‌చౌదరి గుజరాత్‌లోని వివిధ నగరాలతో పాటు బీహార్, ఒడిశాల్లోనూ పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నాడు. ఒడిశాలో మరో కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ప్రదీప్ నాయక్ ద్వారా తనకు పరీక్షపత్రం అందిందని, దాని కోసం భారీ మొత్తం ఖర్చు చేశానని విచారణలో అతడు బయటపెట్టాడు. ఈ క్రమంలో హైదరాబాద్ లింకులు వెలుగుచూశాయి. వివిధ సెట్స్ పరీక్షపత్రాలు ముద్రించే బాధ్యతల్ని జీపీఎస్ఎస్‌బీ ఐడీఏ బొల్లారంలోని కేఎల్ హైటెక్ ప్రింటింగ్ ప్రెస్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మరో ప్రెస్‌కు అప్పగించింది. ఈ ప్రెస్‌లో ఒడిశాకు చెందిన జీతి నాయక్, సర్ధోకర్ రోహా పనిచేస్తున్నారు. జీతినాయక్‌కు ప్రదీప్‌నాయక్‌తో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. జీతి ఈ పేపర్‌ను అతడికి విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశాడు. సర్ధోకర్ రోహా సహకారంతో పరీక్షపత్రాన్ని ప్రింటింగ్ ప్రెస్ నుంచి తస్కరించాడు. దీన్ని వాట్సాప్ ద్వారా ప్రదీప్‌కు పంపగా, అతడి నుంచి భాస్కర్‌కు చేరింది. ఈ వ్యవహారంలో మరికొందరు మధ్యవర్తులుగా వ్యవహరించారని ఏటీఎస్ గుర్తించింది. వీరితో పాటు ఆయా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకున్న అభ్యర్థుల కోసం గాలిస్తోంది.

కొలువుల చదువు.. భవితకు నెలవు

గిరి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ రంపచోడవరం ఉపాధ్యాయ శిక్షణ సంస్థ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. బోధనకు అవసరమైన నైపుణ్యం, విజ్ఞానం అందిస్తూ శిక్షణ ఇస్తోంది. వారు కొలువులు సాధించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలోనే గిరిజన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే ఏకైక కళాశాల ఇదే. ఏటా 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్నారు.

గిరి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న రంపచోడవరం డైట్ కళాశాల

- ఏటా 50 మందికి శిక్షణ
- శతశాతం ఉత్తీర్ణతతో ముందడుగు



రంపచోడవరం డైట్ కళాశాల

రంపచోడవరం: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రంపచోడవరంలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాల (డైట్ కళాశాల) గిరి విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడంలో ఎంతో దోహదపడుతోంది. నూరుశాతం ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

15 ఏళ్లుగా గురువులుగా తీర్చిదిద్దుతూ...

రంపచోడవరంలో ఉపాధ్యాయ శిక్షణ కళాశాలను 2008లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డైట్ ద్వారా 50 మంది గిరి విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు కళాశాలలో 520 మంది విద్యార్థులు శిక్షణ పొంది బయటకు వెళ్లారు.

- 2008 -2101 విద్యా సంవత్సరానికి సంబంధించి 82 శాతం ఉత్తీర్ణత సాధించింది. 2009 నుంచి 2014 వరకు 96శాతం ఉత్తీర్ణత సాధించింది. 2013 నుంచి 2020 వరకు ఆరు బ్యాచ్‌లు నూరుశాతం ఫలితాలు సాధించాయి. అలాగే 2021 బ్యాచ్ నూరు శాతం ఫలితాలు సాధించాయి.

చక్కని వసతి సదుపాయం



- రాష్ట్రంలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు, పార్వతీపురం, కన్నపురం ఐటీడీఏల పరిధిలోని విద్యార్థులు ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం రంపచోడవరం ఉపాధ్యాయ శిక్షణ కళాశాలకు రావాల్సిందే. రంపచోడవరం డైట్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ వసతి కల్పించారు. బాలురకు కళాశాల ఆవరణలోనే హాస్టల్ వసతి ఉంది. బాలికలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని వసతి గృహంలో కల్పించారు.

మెరుగైన శిక్షణ

రంపచోడరంలోని డైట్ కళాశాలలో మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తరువాత ఉద్యోగం సాధిస్తామనే భరోసా ఉంది. ఏజెన్సీలో గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా కళాశాల ఏర్పాటుతో ఎంతో మేలు కలుగుతుంది.

-కల్యాణ్, విద్యార్థి డైట్ కళాశాల, రంపచోడవరం

మెరిట్ విద్యార్థులకే ప్రవేశం



రంపచోడవరం డైట్ కళాశాలలో ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. రెండేళ్ల పాటు చదువుకునేందుకు అన్ని సదుపాయాలతో వసతి సమకూరుస్తున్నారు. ఇక్కడ చదివిన అనేక మంది విద్యారంగంలో స్థిరపడ్డారు.

-కోసు ఠాగూర్‌దొర, డైట్ కళాశాల విద్యార్థి.

నూరుశాతం ఫలితాలు



తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇస్తున్నాం. వారు బాగా చదివేందుకు అవసరమైన వాతావరణం కల్పిస్తున్నాం. కళాశాల నూరుశాతం ఫలితాలు సాధిస్తూ ముందంజలో ఉంది.

-సీహెచ్ చిన్నబాబు, ప్రిన్సిపాల్, డైట్ కళాశాల, రంపచోడవరం

విధివంచితులు

వారిదో వింతలోకం.. ఉలుకూ పలుకూ లేని వారు కొందరైతే.. నిస్తేజంగా కనిపించేవారు మరికొందరు.. ఆకలేసినా అన్నం అడగలేనివారు ఇంకొందరు.. వయసు పెరుగుతున్నా అందుకు తగ్గట్టు బుద్ధి పెరగడం లేదు. ఎదుగూబొదుగూ లేని బుద్ధిమాంద్యం పిల్లలను తల్లిదండ్రులు మాత్రం కంటికి రెప్పలా చూసుకుంటూనే ఉన్నారు. సరైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు పిల్లలను భవిష్యత్తును తలచుకుంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

బుద్ధిమాంద్యంతో బిడ్డల ఇక్కట్లు

- ఆలనా పాలనా చూస్తున్న తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- తాడిపత్రి పట్టణంలో దాదాపు 150 మంది బుద్ధిమాంద్యులు

తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలో దాదాపు 150 మంది బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నారు. వీరిలో చెవిటి, మూగ, అంధులు, శారీరక, మానసిక వైకల్యం కల్గిన చిన్నారులు దుర్భర జీవితం గడుపుతున్నారు. విధివంచితులైన వారిని తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతూనే ప్రేమతో చూసుకుంటున్నారు.

అవ్వ సంరక్షణలో అక్కాతమ్ముడు

వడ్లపాలెంకు చెందిన కూలీలు హజీరాని, దస్తగిరి దంపతులు. వీరికి నస్రున్ (14), మహమ్మద్ సందానీ (15) సంతానం. వీరు పుట్టుకతోనే బుద్ధిమాంద్యులు. రెక్కాడితే గానీ డొక్కాడని దయనీయ జీవితం. ఈ నేపథ్యంలో పిల్లల సంరక్షణ బాధ్యతను అవ్వ దస్తగిరమ్మ తీసుకుంది. దస్తగిరమ్మ అద్దె ఇంట్లో ఇద్దరు పిల్లలలో కలసి ఉంటోంది. నస్రున్, మహమ్మద్ సందానీలకు మతి స్థిమితం లేదు. అన్నం కూడా తినలేని పరిస్థితి. ఆమె ఇంటి వద్దనే చిరువ్యాపారం చేసుకుంటూ.. వచ్చే పింఛన్ డబ్బుతో బతుకు బండి లాగుతోంది.

నడవలేస్థితిలో ధరణి, సృజన..

గన్నెవారిపల్లి కాలనీకి చెందిన లలితమ్మ, శివశంకర్ భార్యాభర్తలు. వీరికి ధరణి (15), సృజన (7) పిల్లలు. వీరు పుట్టుకతోనే బుద్ధిమాంద్యులు. శివశంకర్ ఆటో డ్రైవర్. లలితమ్మ పిల్లలను చూసుకుంటూ ఇంటి వద్దనే ఉంటోంది. పిల్లలు నడవలేరు. రోజూ భవిత సాధన ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. ఆటో సంపాదనతో అతి కష్టం మీద శివశంకర్ కుటుంబం నడుపుతున్నాడు. అధికారులు స్పందించి తమవంతు సాయం చేయాలని వారు కోరుతున్నారు..

తల్లిచాటు బిడ్డ ఫకృద్దీన్

శ్రీనివాసపురానికి చెందిన లారీ డ్రైవర్ వలిబాషా, బీబీ దంపతులు. వీరి కుమారుడు బాబా ఫకృద్దీన్ (29)కు రెండు, కాళ్లు, చేతులు పని చేయవు. మానసిక స్థితి సరిగా లేదు. దీంతో ఆలనా పాలన తల్లి బీబీ చూసుకుంటోంది. వయసు పెరిగినప్పటికీ ఫకృద్దీన్ చిన్న పిల్లవాడిగానే ప్రవర్తిస్తుంటాడు.

తమ్ముడికి అక్క అండ

నందలపాడుకు చెందిన అంకాలమ్మ, గంగయ్య దంపతులకు నలుగురు పిల్లలు. వీరిలో లోకేష్ (24) మానసిక బుద్ధి మాంద్యంతో పుట్టారు. కొన్ని సంవత్సరాల క్రితం లోకేష్ తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి లోకేష్‌ను అక్క జ్యోతినే సంరక్షిస్తోంది. చివరకు తాను వివాహం కూడా చేసుకోలేదు. తమ్ముడికి వచ్చే పింఛన్ డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తుంది. లోకేష్ స్వయంగా నడవలేడు. ఎవరైనా పట్టుకుని నడిపించాల్సిందే.

కదల్లేని దీనస్థితిలో ఎందరో..

శ్రీనివాసపురానికి చెందిన హుస్సేన్‌బీ, దస్తగిరి దంపతుల కుమార్తె నూర్జహాన్ (14). నూర్జహాన్ కదలని బొమ్మగా ఉంటుంది. చంటి పిల్లను చూసుకున్నట్టుగా ఆమెను తల్లి చూసుకుంటోంది. పుట్లూరు రోడ్డులోని ఆర్టీటీ కాలనీకి చెందిన ప్రమీణ, రాము భార్యభర్తలు. వీరి కుమారుడు నరసింహులు (13) బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితం. గన్నెవారిపల్లి కాలనీకి చెందిన ఆంజనేయులు (18) బుద్ధిమాంద్యం బారినపడ్డాడు. తండ్రి చనిపోవడంతో తల్లి అచ్చమ్మే ఆంజనేయులుకు అన్ని సపర్యలూ చేస్తోంది.



శ్రీనివాసపురానికి చెందిన లోకేష్‌ను నడిపిస్తున్న అక్క జ్యోతి

బాగా చూసుకుంటున్నాం



తాడిపత్రి మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో బుద్ధిమాంద్య పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం భవిత సాధన కేంద్రం ఏర్పాటు చేసింది. ఇక్కడ బుద్ధిమాంద్యం పిల్లల కోసం ట్రైసైకిల్, మరికొన్ని ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల బొమ్మలతో పిల్లలు గడిపే విధంగా చూస్తున్నాం. రోజూ 10 నుంచి 20 మంది పిల్లలు భవిత కేంద్రానికి వస్తారు. ఫిజియోథెరపీ వంటి సేవలు కూడా అందిస్తున్నాం. దివ్యాంగుల సర్టిఫికెట్లు ఇప్పించేందుకు సదరం పరీక్షా కేంద్రాలకు పంపుతున్నాం.

– నాగరాజు, భవిత కేంద్ర అధికారి, ఎంఈఓ, తాడిపత్రి



తాడిపత్రి ప్రతిభ సాధన పాఠశాలలో శిక్షణ పొందుతున్న బుద్ధిమాంద్యులు



బుద్ధిమాంద్యం పిల్లలైన అక్కాతమ్ముడికి అన్నం తినిపిస్తున్న అవ్వ దస్తగిరమ్మ



శ్రీనివాసపురానికి చెందిన బుద్ధిమాంద్యుడు బాబా ఫకృద్దీన్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి



భవిత కేంద్రంలో గన్నెవారిపల్లికి చెందిన బుద్ధిమాంద్యులైన అక్కాతమ్ముడు




విశాఖ వీధుల్లో...

జీ-20 సదస్సు నేపథ్యంలో విశాఖ మరింత అందంగా రూపుదిద్దుకుంటోంది. నగరంలోని పలు గోడలపై అందమైన పెయింటింగ్స్ దర్శనమిస్తున్నాయి. బీచ్‌రోడ్డు వద్ద ఇలా వాల్ బ్యాక్‌గ్రౌండ్‌లో యువతుల ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సన్నిధి

సందర్భం - నేడు మహాత్మా గాంధీ వర్ధంతి



ప్రార్థన
ఆత్మశుద్ధికి మార్గం

గాంధీమహాత్ముని ఒక రాజకీయనేతగా కాకుండా సత్యాన్వేషకునిగా పరిశీలిస్తే ఎన్నో అద్భుత విషయాలు అవగతమవుతాయి. మతం పట్ల ఆయన అభిప్రాయాలు నిజంగా ఎంత ఉన్నతమైనవో తెలుపుతాయి. 'అసలైన మతం సంకుచితమైనది కాదు. అది భౌతికమైన పరిశీలనకు సంబంధించినది కాదు. అది పరమాత్ముడిపైన ఉండే విశ్వాసం, ఆయనతోనే ఉండేది. అంటే భవిష్యత్తు మొత్తం సత్యం, అహింసలపై శ్రద్ధ కలిగించేది. అది హృదయానికి సంబంధించినది'. ఇదీ మతమంటే మహాత్ముడి భావన. సామరస్యపూర్వక బంధంతో మనిషికి మనిషికి మధ్య ఐక్యతను కలిగివుండడమే గాంధీజీ చెప్పే మతం. అందువల్ల సిక్కు, హిందువు, క్రిస్టియన్, ముస్లిం, బౌద్ధులు...ఇలా ఏ మతం వారైనా ఒకరు ఎక్కువ అనే ఉన్నత భావం, మరొకరు తక్కువ అనే న్యూనతాభావం కూడదని ఆయన చెప్పేవారు.

రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం, ఈశ్వర్ అల్లా తేరోనామ్, సబ్‌కో సన్మతి దే భగవాన్... ఇది మహాత్ముడికి అత్యంత ప్రీతికరమైన ప్రార్థన. తరచుగా ఆయన నోట వినిపించే అమృత పదాలు.

మనిషిని పరమాత్ముని దృష్టిలోకి తీసుకొచ్చేవి ప్రేమ, సత్యమేనని ఆయన అనేవారు. మానవత్వం కలిగిన మనిషికి, దేవుడికి భేదం లేదని చెప్పేవారు.

సత్యమే దైవం

సత్యాన్ని పరమాత్ముని రూపంగా ఆయన ఎందుకు భావించారో కూడా వివరించారు. 'నా అభిప్రాయం ప్రకారం సత్యమే అన్నింటికంటే గొప్పది. అందులో అనేక విషయాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇక్కడ సత్యం అంటే వాక్సత్యం ఒక్కటే కాదు. భావానికి సంబంధించినది కూడా. ఇది కల్పిత సత్యం కాకుండా సుస్థిరత కలిగిన స్వతంత్రమైన అస్తిత్వం గల సత్యం. అంటే సాక్షాత్ పరబ్రహ్మమన్నమాట' సత్యంలో భగవంతుడిని ఆయన చూసినంత నిశితంగా మరొకరు పరికించి ఉండరు. సత్యానికి ఆయన ఇచ్చినంత ప్రాముఖ్యం వేరొకరు ఇవ్వలేదు.

ప్రార్థన మానవత్వానికి పిలుపు. ఆత్మశుద్ధికి మార్గం. మనలోని బలహీనతలను గుర్తించే ప్రక్రియే ప్రార్థన. శరీరానికి ఆహారం ఎంత అవసరమో మనసుకు ప్రార్థన అంతే. ప్రార్థన అంటే కేవలం పెదవులతో ఉచ్చరించేదే కాదు. ఎలాంటి భేదభావాలు, తారతమ్యాలకు తావివ్వకుండా హృదయ ప్రక్షాళన కోసం ప్రార్థన చేయాలి. ప్రార్థన అంటే కళ్లు మూసుకుని ధ్యానం చేస్తూ కూర్చోవడం కాదు. ప్రార్థనకు కావలసింది మనసులేని మాటలు కాదు, మాటలు లేని మనసు. ఇదీ ప్రార్థనపై మహాత్ముడి అభిప్రాయం.

ఎవరి హృదయం నిర్మలంగా ఉంటుందో, ఎవరు తమ లక్ష్యాన్ని దైవంగా భావిస్తారో వారివెంట దైవం ఉంటుంది. సత్యం, ప్రేమ, ధర్మం, నిజాయితీ, నిర్భయం... కలిగి ఉండే వారికి పరమాత్ముని తోడ్పాటు ఎప్పుడూ ఉంటుంది. ఇదే గాంధీతత్వం. దాన్ని అందుకునేందుకు దీక్ష, పట్టుదల, క్రమశిక్షణ... అవసరం.

– తాడేపల్లి శివరామకృష్ణారావు

మంచి మాట



విజయం
ఓటమి తర్వాత వేకువ

ఓటమి ద్వారా వచ్చే విజయం ఉంది! అది ఓటమి నేర్పే పాఠం!! ఓటమి నేర్పే పాఠం ఎంతో ముఖ్యమైంది ఆపై విలువైంది; అది మరే విధంగానూ రాదు. ఓటమి దెబ్బ బలంగా తగిలినా మనిషి పడిపోకుండా నిలబడి ఆ పాఠాన్ని చదవాలి. ఓటమి నేర్పిన పాఠాన్ని సరిగ్గా చదవగలిగిన మనిషికి భవిష్యత్తులో విజయం అందుతుంది; విజయవంతమైన భవిష్యత్తు అందుతుంది.

ఓడిపోయాక శోకిస్తూ ఉండడం సరి కాకపోవడమే కాదు హానికరమైంది కూడా. ఓడిపోయాకైనా గెలవాలి అన్న పట్టుదల కలగాలి. ఆ పట్టుదల ఓటమి తరువాతి జీవనంపై పట్టును ఇవ్వాలి. ఓడిపోవడం నేరం కాదు. ఓడిపోయాక తలదించుకోవాల్సిన అగత్యంలేదు. ఓడిపోతే కుంగిపోకూడదు ఓటమికి లొంగిపోకూడదు. ఓడిపోతే వాడిపోకూడదు, వాడిమిని కోల్పోకూడదు. ఓడిపోయాక మనిషి ఎడారిలో ఒంటరివాణ్ణి అయిపోయానని కృశించిపోతూ ఉండిపోకూడదు; ఎందుకూ కొరగాని వాణ్ణి అయిపోయానని నిస్తేజంగా ఉండిపోకూడదు. ఓడిపోతే నిస్పృహ ప్రభావానికి మ్రాన్పడి చిత్తై పోకూడదు. ఓడిపోయాక, నిస్పృహ ఆవరించాక నిద్రలోంచి లేచినట్లుగా లేవాలి. ఆపై మెలకువను పొందినట్లుగా సత్‌స్పృహను పొందాలి.

ఓడిపోతే కష్టాలొస్తాయి; ఆ కష్టాలలోనే సత్యాలు తెలుస్తాయి. ఆ సత్యాలు ఎంతో ముఖ్యమైనవి.

జీవితం అన్నాక, జీవనం ఉన్నాక ఆశాభంగం తప్పదు. భంగం అయినంత మాత్రాన భాగ్యం భగ్నమైపోదు. ఓడిపోయిన తరువాత నిలదొక్కుకోగలిగిన మనిషి ముందుకు సాగగలడు.

కలిగిన ఓటమికి దెబ్బతిన్నాక గెలవడంపై మనిషికి చైతన్యం రావాలి. ఓటమి గురించి చింత, చింతనలను అధిగమించాలంటే మనిషికి గెలవాలి అన్న చైతన్యం కావాలి, రావాలి. ఆ చైతన్యంతో గెలుపును సుసాధ్యం చేసుకోవాలి.

ఓటమి కలిగాక దాన్ని అర్థం చేసుకుని అంగీకరించాలి. కలిగిన ఓటమికి మనం సాక్ష్యం మాత్రమే అవ్వాలి. అంతకుమించి మనం ఓటమిలో కూరుకుపోకూడదు. భవిష్యత్తులో విజయంలో విలీనం అవ్వాలంటే కలిగిన ఓటమి నుంచి మనల్ని మనం విడిపించుకోవాలి. విజయం సాధించడం ఎలాంటిదో ఓటమి నుంచి విడివడడం కూడా అలాంటిదే. ప్రపంచంలో విజేతలైనవాళ్లలో ఎక్కువ శాతం మంది ఓటమి నుంచి తమను తాము విడిపించుకున్నవాళ్లే.

సూర్యోదయాన్ని పొందుతూ ఉండడం భూమి రోజూ సాధిస్తున్న విజయం. పొంగుతూ, సాగుతూ పారడం నది సాధిస్తున్న విజయం. వీస్తూ ఉండడం గాలికి విజయం.

విజయం అనేది ఒక లక్ష్యమా? కాదు. విజయం అనేది లక్షణం. అవును విజయం అనేది మనిషికి లక్ష్యంగా కాదు లక్షణం గా ఉండాలి. ఓటమి చీకటిలా మూగినప్పుడు కాస్తంత ఓపిక పడితే విజయం వేకువై వచ్చేస్తుంది. ''వేసవికాలం వెంబడించని చలికాలం లేదు'' అన్నారు వివేకానంద. ఓటమి అనే చలికి పట్టుబడి గడ్డకట్టుకుపోకుండా ఉండగలగాలి. చలికాలం తరువాత వేసవి వచ్చేస్తుంది. ఓటమి శోకాన్ని కలిగించినా విజయాన్ని సాధించేందుకు కాలం ఉందని, ఉంటుందని తెలుసుకోవాలి.

విజయం కోసం ఆశపడితే, ఆకాంక్షిస్తే తప్పకుండా మనిషికి అవకాశాలు ఆసన్నం అవుతాయి. వాటిని సఫలం చేసుకుంటే విజయం వస్తుంది. ఆ విజయానికి చిహ్నంగా మనిషి జీవితం వసంతం అవుతుంది.

– రోచిష్మాన్

వసుధైవ కుటుంబకమ్



''అయంనిజః పరో వేతి గణనా లఘు చేతసామ్/ ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్.''

అందరం ఆకలితో ఉన్నవాళ్ళమే. అన్నం తింటే ఆకలి తీరుతుంది. అందరికీ దాహం వేస్తుంది. నీళ్ళు తాగితేనే అది తీరుతుంది. మనకే కాదు. సమస్త ప్రాణులకూ అంతే... అని భావన చేసినవాడికి, అందరం ఒక్కటే అనుకున్నవాడికి అడ్డుగోడలన్నీ కరిగిపోతాయి.

కుటుంబం అన్నది సమాజంలో ఓం ప్రథమంగా ఏర్పాటయిన వ్యవస్థ. మా అమ్మ, మా నాన్న, నా అన్నదమ్ములు, నా అక్కచెల్లెళ్ళు, మా తాత, మా నాయనమ్మ.. ఇవన్నీ పుట్టుకతో మనం ఎదగడానికి సంస్కృతిని పొందడానికి ఏర్పాటు చేసుకున్న ఊతాలు. అంటే ... పెద్దలు కనబడితే గౌరవం, పిల్లలు కనబడితే దయ, సమానులు కనబడితే ఆదరభావం. ..ఇవన్నీ కలిసి ప్రేమ భావన. సుఖమయినా దుఃఖమయినా కలిసి పంచుకుందాం అన్న సర్దుబాటు, త్యాగం. ఇది కుటుంబం వరకే. అలాకాక కుటుంబంతో సంబంధం లేకుండా సమాజంలో ఎవరు సుఖపడినా మనం సుఖపడినట్లు, ఎవరు బాధపడినా మనమే బాధపడుతున్నట్లు భావించడం ఎవరికి సాధ్యం? అంటే ప్రపంచాన్నే కుటుంబంగా భావించగలిగినవాడికి మాత్రం సుసాధ్యం. ఆయన మహాత్ముడు, గొప్పవాడు, ఆయన ఈ గోడలను కూలగొట్టి బతుకుతున్నవాడు.

ఆ స్థాయికి వెళ్ళిన మహాపురుషుడు శంకర భగవత్పాదులు. ఆయన కాశీ అన్నపూర్ణమ్మ దగ్గరకు వెళ్ళి..'అమ్మా! మూడు లోకాల్లోని సమస్త ప్రాణులూ మీ బిడ్డలేగా.. అన్నం పెట్టు' అన్నాడు. అదీ వసుధైవ కుటుంబకమ్.. ఈ వసుధ, ఈ భూమి మీద ఉన్న వారందరూ, ప్రాణులన్నీ నా కుటుంబమే.. అన్న భావన పొందిన వారు..'ఉదారచరితానాం తు'.. వాళ్ళది ఉదారమైన నడవడిక అంటే.


అపార కీర్తి పొందిన శాస్త్రవేత్త, భారతదేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన అబ్దుల్ కలాం గారు .. ఒకసారి హైదరాబాద్‌లో నిజాం వైద్యశాలలో పోలియో బాధితులైన పిల్లలతో కొద్దిసేపు గడిపి వారిని ఉల్లాసపరచాలని వెళ్ళారు. అక్కడ వారు కాలిపర్స్ సాయంతో నడుస్తూన్నా.. అవి బరువుగా ఉండి వారు ఇబ్బందిపడుతున్నట్లు గమనించి... వెంటనే ఇస్రో కార్యాలయానికి వెళ్ళి శాస్త్రవేత్తలందరినీ సమావేశపరిచారు. అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాలకు వాడే తేలికపాటి లోహంతో కాలిపర్స్ రూపొందించడానికి మేథోమథనం చేసారు. మూడువారాల్లో కేవలం 300 గ్రాములు మాత్రమే బరువున్న కాలిపర్స్‌ను తీసుకొని ఆ ఆస్పత్రి కి వెళ్ళి వారికిచ్చారు. అప్పటివరకు భారీ కాలిపర్స్‌తో ఇబ్బందిపడిన పిల్లలు ఇవి వేసుకుని పొందిన ఆనందాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయిపోయారు. తరువాత కాలంలో ఈ సంఘటనను ప్రస్తావించి 'మిగిలిన వాటన్నింటికంటే.. నా జీవితంలో ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉండిపోయే సందర్భం ఇది. అక్కడ పిల్లల సంతోషం చూసి సార్థక్యం పొందాను' అని తెలిపారు... అదీ ఉదారచరితానాం తు..అంటే... వసుధైవ కుటుంబకమ్ అంటే...

గురువాణి


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సువార్త

సకలైశ్వర్య సంపన్నుడు



ఆకాశ వైశాల్యమంతటి క్రింద నున్నదంతయు నాదే గదా! (యోబు 41:11). మన దేవుడు సకలైశ్వర్య సంపన్నుడు. ఆయనది కానిది ఈ విశ్వంలో ఏదైనా ఉందా? నేను తిరిగి ఇయ్యవలసియుండునట్లు నాకెవడైనను ఏమైనను ఇచ్చెనా? అని దేవుడు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పగలమా?

సమస్తము నావే కదా అని దేవుడు మాట్లాడుతుంటే ఎంత హుందాగా ఉందో కదా! మన దేవునికి కొదువ ఏమీలేదు. ఆయన అందరికి జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు.

ఒక మనిషి దేవున్ని ఆరాధించుట వలన ఆయనకేదో లాభమని కొందరు భావిస్తుంటారు. దేవుని సేవకు సహకరించుట ద్వారా దేవునికి చాలా గొప్ప ప్రయోజనాన్ని చేకూర్చుస్తున్నామని సంబర పడిపోతుంటారు. దేవుని కార్యాలు చేయడం ద్వారా మనకే ఎక్కువ ప్రయోజనమని గ్రహించాలి. కలిగియున్నదేదియు దేవుడు లేకుండా కలుగలేదు గనుక ఎల్లప్పుడు కృతజ్ఞులమై జీవించాలి. భౌతిక ప్రపంచంలోనైనా, ఆధ్యాత్మిక ప్రపంచంలోనైనా మన దేవుడు సర్వసమృద్ధి కలిగినవాడు. సకల చరాచర సృష్టిని తన మహత్తయిన మాటతో సృష్టించి తన మహైశ్వర్య జ్ఞానముతో నిర్వహించువాడు. ఈ విశ్వంలో ప్రకృతియే గొప్పదని భావించేవాళ్ళు కొందరున్నారు. ఆరాధనకు యోగ్యుడైన దేవుడు ఈ ప్రకృతికి ఆకృతిని ఇచ్చినవాడు.

పూర్వదినాల్లో మాసిదోనియాలోని ప్రధాన పట్టణాలలో ఒకటిగా పిలువబడే పట్టణం ఫిలిప్పీ.సంపన్నవంతులైన వ్యాపారస్థులు నివసించే ప్రాంతమది. ఆ రాజుల్లో ఎన్నో రకాలైన ఆదాయ మార్గములను ఏర్పరచుకొని డబ్బు సంపాదనలో బిజీగా ఉండే పట్టణమది. అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ నడిపింపుతో సువార్తను ప్రకటించినప్పుడు అనేకులు సువార్తకు లోబడి తమ జీవితాలను ప్రభువుకు సమర్పించుకున్నారు. కొందరు తమ అక్రమ సంపాదనను విడిచి దేవుని సన్మార్గంలో నడవడం ప్రారంభించారు. కొన్నిసార్లు వారు లోకసంబంధులను చూసినప్పుడు లోలోపల మదనపడియుండవచ్చు. అలాంటివారికి పౌలు భక్తుడు తెలిపిన గంభీర సత్యమిది. ''కాగా దేవుడు తన ఐశ్వర్య చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరము తీర్చును'' (ఫిలిప్పీ 4:19).

– డా॥ జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా

కాంబినేషన్ సెట్?


ప్రభాస్


హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో 'బ్యాంగ్ బ్యాంగ్'(2014), 'వార్' (2019), 'పఠాన్'(2023) వంటి సూపర్ హిట్స్ సాధించారు దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్. ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ సినిమా రూపొందనుందని, ఈ చిత్రాన్ని మైత్రీమూవీ మేకర్స్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించనున్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో మల్టీ స్టారర్‌గా ఈ మూవీ రూపొందనుందని, ఇందులో ప్రభాస్, టైగర్ ష్రాఫ్‌లు కలిసి నటిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపించింది. తాజాగా ఈ సినిమాలో ప్రభాస్, హృతిక్ రోషన్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇక హృతిక్ రోషన్, సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో 2019లో 'వార్' సినిమా వచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి కాంబోలో 'ఫైటర్' మూవీ తెరకెక్కుతోంది. ప్రభాస్ కూడా 'సలార్', 'ప్రాజెక్ట్ కె' లతో పాటుగా 'రాజాడీలక్స్'(ప్రకటన రావాల్సి ఉంది) సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రభాస్‌తో పాటు హృతిక్ రోషన్-సిద్ధార్థ్ ఆనంద్‌ల ప్రస్తుత కమిట్‌మెంట్ ప్రాజెక్ట్స్ పూర్తయిన తర్వాతే వీరి ముగ్గురి కాంబినేషన్ సినిమా గురించి ఓ స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

కోలీవుడ్ ఎంట్రీ!


మృణాల్ ఠాకూర్

'సీతారామం'(2022) సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమై తెలుగు ప్రేక్షకుల మనసు గెల్చుకున్నారు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్. ఈ బ్యూటీకి ఇప్పుడు కోలీవుడ్(తమిళ ఇండస్ట్రీ) నుంచి కబురొచ్చిందట. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో ఓ హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ సినిమాలో దిశా పటానీ ఓ హీరోయిన్. కాగా ఈ మూవీలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ సన్నివేశాల్లో సూర్య సరసన నటించేందుకు మరో హీరోయిన్‌కి అవకాశం ఉందట. ఈ రోల్‌లోనే మృణాల్ ఠాకూర్ నటించనున్నారని కోలీవుడ్ టాక్. అంతేకాదు.. ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌లో మృణాల్ జాయిన్ అవుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం ఖరారు అయితే కోలీవుడ్‌లో ఆమెకు ఇదే తొలి ప్రాజెక్టు అవుతుంది. కాగా తెలుగులో నాని హీరోగా నటించనున్న ఓ కొత్త సినిమాలో మృణాళ్ హీరోయిన్‌గా నటించనున్న సంగతి తెలిసిందే.

4 రోజులు.. 400 కోట్లు


షారుక్‌ఖాన్

బాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డ్స్‌ను తిరగ రాస్తున్నాడు 'పఠాన్'. షారుక్‌ఖాన్ హీరోగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన స్పై (గూఢచారి) మూవీ 'పఠాన్'. దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జాన్ అబ్రహాం కీలక పాత్ర చేయగా, హీరో సల్మాన్‌ఖాన్ అతిథి పాత్రలో నటించారు. దాదాపు 250 కోట్ల బడ్జెట్‌తో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. కాగా, 'పఠాన్'కు విశేష ప్రేక్షకాదరణ దక్కుతున్నట్లు ఈ సినిమా బాక్సాఫీస్ లెక్కలు చెబుతున్నాయి. సినిమా విడుదలైన నాలుగు రోజుల్లోనే 429 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లు 'పఠాన్' యూనిట్ ఆదివారం వెల్లడించింది. ''పఠాన్' విడుదలైన నాలుగు రోజుల్లోనే వేగంగా 400కోట్లకుపైగా కలెక్షన్స్ సాధించిన హిందీ చిత్రంగా నిలిచింది. ఇండియాలో 265 కోట్ల రూపాయలు, ఓవర్‌సీస్‌లో 164 కోట్ల రూపాయాల వసూళ్లు సాధించింది'' అని యూనిట్ పేర్కొంది. 'పఠాన్' విడుదలైన ఐదోరోజు (జనవరి 29, ఆదివారం) వీకెండ్ కావడంతో కలెక్షన్స్ మరింత పెరుగుతాయని, అతి త్వరలోనే ఈ సినిమా ఐదు వందల కోట్ల క్లబ్‌లో చేరుతుందని విశ్లేషిస్తున్నాయి ట్రేడ్ వర్గాలు. అలాగే హిందీలో అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా కూడా 'పఠాన్' నిలుస్తుందని కొందరు ట్రేడ్ వర్గీయులు అంటున్నారు.

యాక్షన్ డ్రామా


శివ రాజ్‌కుమార్, వీఆర్ కృష్ణ

కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ నటించిన తాజా చిత్రం 'వేద'. ఎ.హర్ష దర్శకత్వం వహించారు. శివ రాజ్‌కుమార్ భార్య గీతా శివ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా గత డిసెంబరు 23న కన్నడలో విడుదలైంది. ఈ చిత్రాన్ని 'వేద' పేరుతోనే కంచి కామాక్షి కలకత్తా క్రియేషన్స్ పతాకంపై వీఆర్ కృష్ణ మండపాటి తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా 'వేద' తెలుగు టైటిల్, మోషన్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. వీఆర్ కృష్ణ మండపాటి మాట్లాడుతూ– ''యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రం 'వేద'. శివ రాజ్‌కుమార్‌గారి కెరీర్‌లో 125వ మూవీగా రూపొందింది. కన్నడలో ఈ మూవీ ఘన విజయం సాధించడం, కథ నాకు బాగా నచ్చడంతో తెలుగులో రిలీజ్ చేస్తున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె.గౌడ్, సంగీతం: అర్జున్‌జన్య.

వెల్‌కమ్ టు మాలీవుడ్


ప్రణీత

'అత్తారింటికి దారేది, పాండవులు పాండవులు తుమ్మెద, రభస, డైనమైట్' వంటి పలు చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ బ్యూటీ ప్రణీత. కన్నడ, తెలుగు, తమిళ్, హిందీ చిత్రాల్లో నటించిన ప్రణీత మలయాళ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. మలయాళ స్టార్ హీరో దిలీప్, దర్శకుడు రతీష్ రఘునందన్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. దిలీప్ కెరీర్‌లో 148వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రణీత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ''మాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అయితే మలయాళంలో డైలాగ్స్ చెప్పడం కాస్త కష్టంతో కూడినపనే.. ప్రస్తుతం నా ముందున్న చాలెంజ్ అదే. ఈ మూవీలో కాస్త అహం ఉన్న యువతి పాత్రలో కనిపిస్తాను. నేను అమ్మగా మారిన తర్వాత ఒప్పుకున్న తొలి సినిమా ఇది. ఈ మూవీ కోసం నా కుమార్తె ఆర్నాకు దూరంగా ఉండాల్సి వస్తోంది. అయితే వ్యక్తిగత జీవితాన్ని, వృత్తి జీవితాన్ని నేను బ్యాలెన్స్ చేయాలనుకుంటున్నాను.. ఇందుకోసం కష్టపడతాను'' అని పేర్కొన్నారు ప్రణీత. కాగా 2021 మే 30న నితిన్ రాజును వివాహం చేసుకున్న ప్రణీత గత ఏడాది ఆర్నాకు జన్మనిచ్చారు.

కోనసీమ నేపథ్యంలో..


బృందా గోపాల్

ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ బృందా గోపాల్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'థగ్స్'. ఈ చిత్రం ద్వారా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిబు తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా పరిచయమవుతున్నారు. తమీన్స్ సింహ, ఆర్‌కె సురేష్, మునిష్కంత్, శరత్ అప్పనీ ముఖ్య పాత్రలు చేశారు. హెచ్‌ఆర్ పిక్చర్స్ బ్యానర్ సమర్పణలో జియో స్టూడియోస్‌తో కలిసి రియా శిబు నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్స్‌ని విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్, ఆర్య, అనిరుధ్, కీర్తీ సురేష్ విడుదల చేశారు. తెలుగులో 'కోనసీమ థగ్స్' పేరుతో ఈ సినిమా విడుదల కానుంది. డైరెక్టర్ బృందా గోపాల్ మాట్లాడుతూ–''కోనసీమ నేపథ్యంలో జరిగే రా యాక్షన్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు గ్రిప్పింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, కెమెరా: ప్రీయేష్ గురుస్వామి, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ముత్తు కురుప్పయ్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: యువరాజ్.

సస్పెన్స్ థ్రిల్లర్



అరవింద్ కృష్ణ, రజత్ రాఘవ్ హీరోలుగా, నటాషా దోషి ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'ఎస్ఐటీ'(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్). వీబీఆర్ దర్శకత్వం వహించారు. ఎస్ఎన్ఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, వైజాగ్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై ఎస్.నాగిరెడ్డి, తేజ్‌పల్లి, గుంటక శ్రీనివాస్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఎస్ఐటీ'. స్క్రీన్ ప్లే హైలెట్‌గా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, కెమెరా: జగదీష్ బొమ్మిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.అరవింద్ రెడ్డి, సహ నిర్మాతలు: కె.చంద్రబాలి రెడ్డి, రమేష్ గుండా, నరేంద్ర వాసిరెడ్డి.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్


చేతన్

''ఫస్ట్ ర్యాంక్ రాజు' సినిమా తర్వాత చాలా కథలు విన్నాను. గోపీమోహన్‌గారు చెప్పిన స్టోరీకి బాగా కనెక్ట్ అయ్యాను. ఈ కథ నచ్చడంతో హీరోగా నటించడంతో పాటు నేనే సొంతంగా నిర్మిస్తున్నాను'' అని చేతన్ మద్దినేని అన్నారు. సాయి కిషోర్ దర్శకత్వంలో హెబ్బా పటేల్ హీరోయిన్‌గా ఓ మూవీ తెరకెక్కుతోంది. చేతన్ మద్దినేని హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ 50శాతం పూర్తయింది. చేతన్ మద్దినేని మాట్లాడుతూ–''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న సినిమా ఇది. 'డీ, రెడీ, చిరునవ్వుతో' చిత్రాల తరహాలో ఉంటుంది'' అన్నారు.

బీసీసీఐ కానుక రూ. 5 కోట్లు

అండర్–19 టి20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అభినందించింది. జట్టు సభ్యులు, సహాయక సిబ్బందికి కలిపి రూ. 5 కోట్ల నజరానా ప్రకటించింది. మరోవైపు ఫైనల్లో ఇంగ్లండ్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ సాధించిన మహిళల టీమ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. ఈ యువ జట్టు భవిష్యత్తులోనూ మరిన్ని టోర్నీల్లో విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



అమ్మాయిలంతా చాలా బాగా ఆడారు. వారి ప్రదర్శన, తమపై తమకు ఉన్న నమ్మకం గురించి ఎంత చెప్పినా తక్కువే. కీలక పాత్ర పోషించిన సహాయక బృందానికి కూడా కృతజ్ఞతలు. ఇదొక్కటే కాదు... వచ్చే నెలలో ఇంతకంటే పెద్ద ట్రోఫీ (సీనియర్ మహిళల టి20 ప్రపంచకప్)ని కూడా అందుకోవాలని ఉంది.

–షఫాలీ వర్మ, భారత కెప్టెన్

ఎవరెవరిపై గెలిచామంటే..

లీగ్ దశలో: దక్షిణాఫ్రికాపై 7 వికెట్లతో గెలుపు
యూఏఈపై 122 పరుగులతో విజయం
స్కాట్లాండ్‌పై 83 పరుగులతో గెలుపు
సూపర్ సిక్స్ దశలో: ఆస్ట్రేలియా చేతిలో 7 వికెట్లతో ఓటమి.
శ్రీలంకపై 7 వికెట్లతో విజయం
సెమీస్‌లో: న్యూజిలాండ్‌పై 8 వికెట్లతో విజయం



మన అమ్మాయిలదే ‘ప్రపంచం’

- తొలి అండర్–19 మహిళల టి20 వరల్డ్‌కప్ విజేత భారత్
- ఫైనల్లో 7 వికెట్లతో ఇంగ్లండ్‌పై గెలుపు
- రాణించిన గొంగడి త్రిష
- ఏ స్థాయిలోనైనా భారత మహిళల క్రికెట్ జట్టుకు ఇదే తొలి ప్రపంచకప్

మన అమ్మాయిలు అదరగొట్టారు... అద్భుతమైన ఆటతో ఆది నుంచీ ఆధిపత్యం ప్రదర్శించిన మహిళా బృందం చివరకు అగ్రభాగాన నిలిచింది... సీనియర్ స్థాయిలో ఇప్పటివరకు ఒక్క ఐసీసీ టోర్నీ గెలవని నిరాశను దూరం చేస్తూ ‘యువ’బృందం చిరస్మరణీయ ఫలితాన్ని సాధించింది. తొలిసారి నిర్వహించిన అండర్–19 ప్రపంచకప్‌లో కొత్త చరిత్రను సృష్టిస్తూ టీమిండియా మహిళలు విశ్వవిజేతగా నిలిచారు. ఏకపక్షంగా సాగిన తుది పోరులో ఇంగ్లండ్ ఆట కట్టించిన మన బృందం జగజ్జేతగా అవతరించింది... మహిళల క్రికెట్‌లో కొత్త తరానికి ప్రతినిధులుగా దూసుకొచ్చిన అమ్మాయిలు మొదటి ప్రయత్నంలోనే శిఖరాన నిలిచి మన మహిళల క్రికెట్‌కు మంచి భవిష్యత్తు ఉందనే భరోసాను మరింత పెంచారు.

పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): మహిళల తొలి అండర్–19 ప్రపంచకప్ విజేతగా భారత్ తమ పేరును ఘనంగా లిఖించుకుంది. 16 జట్లు పాల్గొన్న ఈ టి20 టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ అండర్–19పై నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 17.1 ఓవర్లలో 68 పరుగులకే కుప్పకూలింది. అనంతరం భారత్ 14 ఓవర్లలో 3 వికెట్లకు 69 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ప్రస్తుతం పురుషుల అండర్–19 వరల్డ్‌కప్ విజేత భారత్ కాగా... ఇప్పుడు మహిళల జట్టు కూడా జత చేరడం విశేషం. ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టులో తెలంగాణ నుంచి గొంగడి త్రిష, యశశ్రీ, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో కూడా 99 పరుగులకే కుప్పకూలి అదృష్టవశాత్తూ విజయంతో బయటపడ్డ ఇంగ్లండ్ బ్యాటింగ్ బలహీనత ఫైనల్లోనూ కనిపించింది. ఒకరితో మరొకరు పోటీ పడి విఫలం కావడంతో జట్టు సాధారణ స్కోరు కూడా చేయలేకపోయింది. టిటాస్ సాధు, అర్చన, పార్శవి ధాటికి ప్రత్యర్థి బ్యాటర్లంతా చేతులెత్తేశారు. ర్యానా మెక్‌డొనాల్డ్ (24 బంతుల్లో 19; 3 ఫోర్లు)దే అత్యధిక స్కోరు కాగా... ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లే నమోదయ్యాయి. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ దూసుకుపోయింది. షఫాలీ వర్మ (15), శ్వేత సెహ్రావత్ (5) విఫలమైనా... గొంగడి త్రిష (29 బంతుల్లో 24; 3 ఫోర్లు), సౌమ్య (37 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు) మూడో వికెట్‌కు 46 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. 6 పరుగులిచ్చి 2 వికెట్లు తీసిన టిటాస్ సాధు ‘ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్’గా నిలిచింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ అండర్–19 ఇన్నింగ్స్: స్క్రివెన్స్ (సి) త్రిష (బి) అర్చన దేవి 4; హీప్ (సి అండ్ బి) టిటాస్ సాధు 0; హాలండ్ (బి) అర్చన దేవి 10; సెరెన్ స్మేల్ (బి) టిటాస్ సాధు 3; ర్యానా మెక్‌డొనాల్డ్ (సి) అర్చన దేవి (బి) పార్శవి 19; పేవ్లీ (ఎల్బీ) (బి) పార్శవి 2; స్టోన్‌హౌస్ (సి) సోనమ్ (బి) మన్నత్ 11; గ్రోవ్స్ (రనౌట్) 4; బేకర్ (సి) రిచా ఘోష్ (బి) షఫాలి 0; సోఫియా స్మేల్ (సి అండ్ బి) సోనమ్ 11; అండర్సన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.1 ఓవర్లలో ఆలౌట్) 68. వికెట్ల పతనం:** 1–1, 2–15, 3–16, 4–22, 5–39, 6–43, 7–53, 8–53, 9–68, 10–68. **బౌలింగ్:** టిటాస్ సాధు 4–0–6–2, అర్చనా దేవి 3–0–17–2, పార్శవి చోప్రా 4–0–13–2, మన్నత్ కశ్యప్ 3–0–13–1, షఫాలీ 2–0–16–1, సోనమ్ 1.1–0–3–1.

భారత్ అండర్–19 ఇన్నింగ్స్: షఫాలీ (సి) స్టోన్‌హౌస్ (బి) బేకర్ 15; శ్వేత (సి) బేకర్ (బి) స్క్రివెన్స్ 5; సౌమ్య (నాటౌట్) 24; త్రిష (బి) స్టోన్‌హౌస్ 24; రిషిత (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (14 ఓవర్లలో 3 వికెట్లకు) 69. వికెట్ల పతనం:** 1–16, 2–20, 3–66. **బౌలింగ్:** బేకర్ 4–1–13–1, సోఫియా స్మేల్ 2–0–16–0, స్క్రివెన్స్ 3–0–13–1, గ్రోవ్స్ 2–0–9–0, స్టోన్‌హౌస్ 2–0–8–1, అండర్సన్ 1–0–10–0.

‘చిరస్మరణీయం’

సాక్షి క్రీడావిభాగం

దాదాపు 18 ఏళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై భారత మహిళల జట్టు తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ చేరింది. అయితే ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడి రన్నరప్‌గా నిలవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ స్థాయిలో, ఏ ఫార్మాట్‌లో కూడా మన టీమ్ వరల్డ్‌కప్ గెలవలేకపోయింది. నాటి జట్టులో సభ్యురాలిగా ఉన్న ఆఫ్ స్పిన్నర్ నూషీన్ అల్ ఖదీర్ ఇప్పుడు యువ మహిళల టీమ్‌కు కోచ్. ఇప్పుడు అదే దక్షిణాఫ్రికా గడ్డపై మరో ఫైనల్ ఆడిన భారత బృందం ఈసారి విజేతగా నిలిచింది. దాదాపు 2005 వరల్డ్‌కప్ జరిగిన సమయంలోనే పుట్టిన అమ్మాయిలంతా ఇప్పుడు విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించారు. సీనియర్ టీమ్ మంచి ఫలితాలు సాధిస్తున్న సమయంలో అండర్–19 జట్టు కూడా తమ స్థాయిని ప్రదర్శించడం శుభపరిణామం. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న వర్ధమాన ప్లేయర్లలో బీసీసీఐ తొలి వరల్డ్‌కప్ కోసం టీమ్‌ను ఎంపిక చేసింది. అయితే ఎలాగైనా వరల్డ్‌కప్ గెలవాలనే ఉద్దేశంతో ఇప్పటికే సీనియర్ టీమ్‌లో ఆడిన షఫాలీ వర్మ, రిచా ఘోష్‌లను జట్టులోకి తీసుకుంది. దీనిపై కొన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. అమ్మాయిలందరూ తమపై ఉన్న అంచనాలకు అనుగుణంగా రాణించడం విశేషం. శ్వేత సెహ్రావత్ 139.43 స్ట్రయిక్‌రేట్‌తో 297 పరుగులు సాధించి ఎవరికీ అందనంత ఎత్తులో నిలవగా, షఫాలీ (172 పరుగులు), తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (116 పరుగులు) అండగా నిలిచారు. బౌలింగ్‌లో పార్శవి చోప్రా (11 వికెట్లు), మన్నత్ కశ్యప్ (9 వికెట్లు) కీలకపాత్ర పోషించారు. సీనియర్ టీమ్‌లో జూనియర్‌గా బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టిన షఫాలీ ఈ టోర్నీ ద్వారా తన నాయకత్వ ప్రతిభను కూడా ప్రదర్శించడం విశేషం.

వరల్డ్‌కప్ సాధించిన బృందం గురించి సంక్షిప్తంగా...

షఫాలీ వర్మ (కెప్టెన్): హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన షఫాలీ భారత్ సీనియర్ జట్టు సభ్యురాలిగా ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భారత్ తరఫున 74 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది.

రిచా ఘోష్: బెంగాల్‌కు చెందిన కీపర్ రిచా కూడా సీనియర్ టీమ్ సభ్యురాలిగా 47 మ్యాచ్‌లు ఆడింది.



పార్శవి చోప్రా: యూపీలోని గ్రేటర్ నోయిడాకు చెందిన లెగ్‌స్పిన్నర్. తండ్రి ఫ్లడ్ లైట్ సౌకర్యాలతో సొంత గ్రౌండ్ ఏర్పాటు చేసి మరీ కూతురును ఆటలో ప్రోత్సహించాడు.



ఎండీ షబ్నమ్: విశాఖపట్నానికి చెందిన షబ్నమ్ తల్లిదండ్రులు నేవీలో పని చేస్తారు. శివశివాని స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. 15 ఏళ్ల వయసులోనే 110 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి అందరి దృష్టినీ ఆకర్షించింది.



సౌమ్య తివారి: స్వస్థలం భోపాల్. టాప్ ఆర్డర్ బ్యాటర్... కోహ్లిని ఇష్టపడే సౌమ్య అతనిలాగే కవర్‌డ్రైవ్ అద్భుతంగా ఆడుతుంది.



టిటాస్ సాధు: బెంగాల్‌కు చెందిన టిటాస్ తండ్రి ఒక క్రికెట్ అకాడమీ నడపిస్తాడు. బెంగాల్ సీనియర్ టీమ్‌కు ఇప్పటికే ఆడింది.



గొంగడి త్రిష: భద్రాచలంకు చెందిన త్రిష హైదరాబాద్‌లో స్థిర పడింది. తండ్రి ప్రోత్సాహంతో క్రికెట్‌లోకి అడుగుపెట్టి 8 ఏళ్ల వయసులోనే అండర్–16లో ప్రాతినిధ్యం వహించింది.



మన్నత్ కశ్యప్: పటియాలాకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్. ఇటీవల వరుసగా ‘మన్కడింగ్’లు చేసి గుర్తింపు తెచ్చుకుంది.



శ్వేత సెహ్రావత్: ఢిల్లీకి చెందిన బిగ్ హిట్టర్. ఆర్థికంగా మెరుగైన నేపథ్యం ఉన్న కుటుంబం.



సొప్పదండి యశశ్రీ: హైదరాబాద్‌కు చెందిన మీడియం పేసర్. టోర్నీలో ఒక మ్యాచ్ ఆడింది. గాయంతో తప్పుకున్న హర్లీ గలా స్థానంలో జట్టులోకి వచ్చింది.



అర్చనా దేవి: ఆఫ్‌స్పిన్నర్. యూపీలోని ఉన్నావ్ స్వస్థలం. కడు పేదరికం. తండ్రి ఎప్పుడో చనిపోయాడు. కుల్దీప్ యాదవ్ కోచ్ కపిల్ పాండే దత్తత తీసుకొని ముందుకు నడిపించాడు.

సోనమ్ యాదవ్: యూపీ లెఫ్టార్మ్ స్పిన్నర్. తండ్రి ఫిరోజాబాద్‌లో చేతి గాజులు తయారు చేసే పరిశ్రమలో కార్మికుడు

ఫలక్ నాజ్: స్వస్థలం యూపీలోని ప్రయాగ్‌రాజ్. ఈ బౌలింగ్ ఆల్‌రౌండర్ తండ్రి ఒక ప్రైవేట్ స్కూల్‌లో ప్యూన్.

రిషిత బసు: వికెట్ కీపర్, బెంగాల్‌లోని హౌరా స్వస్థలం. అద్భుతమైన మెరుపు షాట్‌లు ఆడుతుంది. మాజీ క్రికెటర్ లక్ష్మీరతన్ శుక్లా తన అకాడమీలో ఉచిత శిక్షణ ఇస్తున్నాడు.



సూర్యకుమార్

ఆపసోపాలు పడి...

- రెండో టి20లో భారత్ గెలుపు
- 6 వికెట్ల తేడాతో ఓడిన న్యూజిలాండ్
- బుధవారం చివరి టి20

లక్నో: భారత్ విజయలక్ష్యం 100 పరుగులు... పిచ్ ఎలా ఉన్నా ఇది మన లైనప్‌కు సులువైన లక్ష్యంలాగే అనిపించింది... కానీ న్యూజిలాండ్ అంత సులువుగా ఓటమిని అంగీకరించలేదు. చివరి వరకు పోరాడింది. ఎట్టకేలకు ఒక బంతి మిగిలి ఉండగా మ్యాచ్‌ను ముగించి భారత్ ఊపిరి పీల్చుకుంది. రెగ్యులర్, పార్ట్‌టైమ్ స్పిన్నర్లు కూడా హవా చూపించిన రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. మిచెల్ సాన్‌ట్నర్ (19 నాటౌట్)దే అత్యధిక స్కోరు కాగా... అర్‌్షదీప్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 101 పరుగులు చేసింది. కఠిన పరిస్థితుల్లో తన శైలికి భిన్నంగా ఆడిన ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సూర్యకుమార్ యాదవ్ (31 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్) చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. ఈ మ్యాచ్ మొత్తంలో ఒక్క సిక్స్ కూడా నమోదు కాకపోవడం విశేషం. తాజా ఫలితంతో ఇరు జట్లు 1–1తో సమంగా నిలవగా...సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి మ్యాచ్ బుధవారం అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (బి) చహల్ 11; కాన్వే (సి) ఇషాన్ (బి) సుందర్ 11; చాప్‌మన్ (రనౌట్) 14; ఫిలిప్స్ (బి) హుడా 5; మిచెల్ (బి) కుల్దీప్ 8; బ్రేస్‌వెల్ (సి) అర్‌్షదీప్ (బి) పాండ్యా 14; సాన్‌ట్నర్ (నాటౌట్) 19; సోధి (సి) పాండ్యా (బి) అర్‌్షదీప్ 1; ఫెర్గూసన్ (సి) సుందర్ (బి) అర్‌్షదీప్ 0; డఫీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 99. వికెట్ల పతనం** : 1–21, 2–28, 3–35, 4–48, 5–60, 6–80, 7–83, 8–83. **బౌలింగ్:** పాండ్యా 4–0–25–1, సుందర్ 3–0–17–1, చహల్ 2–1–4–1, హుడా 4–0–17–1, కుల్దీప్ 4–0–17–1, అర్‌్షదీప్ 2–0–7–2, మావి 1–0–11–0.

భారత్ ఇన్నింగ్స్: గిల్ (సి) అలెన్ (బి) బ్రేస్‌వెల్ 11; ఇషాన్ (రనౌట్) 19; త్రిపాఠి (సి) ఫిలిప్స్ (బి) సోధి 13; సూర్యకుమార్ (నాటౌట్) 26; సుందర్ (రనౌట్) 10; పాండ్యా (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 101. వికెట్ల పతనం:** 1–17, 2–46, 3–50, 4–70. **బౌలింగ్:** డఫీ 1–0–8–0, బ్రేస్‌వెల్ 4–0–13–1, సాన్‌ట్నర్ 4–0–20–0, ఫిలిప్స్ 4–0–17–0, సోధి 4–0–24–1, చాప్‌మన్ 1–0–4–0, ఫెర్గూసన్ 1–0–7–0, టిక్నర్ 0.5–0–7–0.

హాకీ జగజ్జేత జర్మనీ

ఫైనల్లో బెల్జియంపై ‘షూటౌట్’లో విజయం

భువనేశ్వర్: 13 ఏళ్ల విరామం తర్వాత జర్మనీ జట్టు పురుషుల హాకీలో జగజ్జేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ప్రపంచకప్ హాకీ టోర్నీ ఫైనల్లో జర్మనీ ‘షూటౌట్’లో 5–4తో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం జట్టును ఓడించింది. నిర్ణీత సమయం ముగిసే సరికి రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించడానికి ‘షూటౌట్’ నిర్వహించారు. ‘షూటౌట్’లో నిర్ణీత ఐదు షాట్‌ల తర్వాత రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. ‘సడెన్ డెత్’లో తొలి షాట్‌లో రెండు జట్ల ఆటగాళ్లు సఫలమయ్యాయి. రెండో షాట్‌లో జర్మనీ సఫలంకాగా... బెల్జియం ఆటగాడు విఫలం కావడంతో జర్మనీ విజయం ఖరారైంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ జట్ల తర్వాత మూడుసార్లు ప్రపంచకప్ నెగ్గిన మూడో జట్టుగా జర్మనీ గుర్తింపు పొందింది. జర్మనీ 2002, 2006లలో టైటిల్ నెగ్గింది. కాంస్య పతకం మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 3–1తో ఆస్ట్రేలియాను ఓడించింది.



‘గ్రేట్’ జొకోవిచ్

గత ఏడాది కూడా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు జొకోవిచ్ మెల్‌బోర్న్‌కు వచ్చాడు. కానీ కోవిడ్ టీకా వేసుకోనందుకు... అప్పటి ఆస్ట్రేలియా ప్రభుత్వం జొకోవిచ్ విషయంలో కఠినంగా వ్యవహరించింది. ఒక్కడి కోసం నిబంధనలు మార్చలేమని స్పష్టం చేసింది. విమానాశ్రయంలోనే అతడిని నిర్బంధించింది. జొకోవిచ్ వీసాను రద్దు చేసింది. మూడేళ్లపాటు ఆస్ట్రేలియాలో అడుగు పెట్టకుండా నిషేధం విధించింది. న్యాయపోరాటం చేసినా ఈ సెర్బియా స్టార్‌కు అనుకూల నిర్ణయం రాలేదు. దాంతో అవమానకర రీతిలో జొకోవిచ్ విమానాశ్రయం నుంచే స్వదేశానికి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఏడాది గడిచిపోయింది. కోవిడ్ తీవ్రత తగ్గింది. ఆస్ట్రేలియాలో ప్రభుత్వం కూడా మారిపోయింది. జొకోవిచ్ వీసాను పునరుద్ధరించడం జరిగింది. వెరసి తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో జొకోవిచ్ పదోసారి విజయగర్జన చేశాడు.

- పదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో సిట్సిపాస్‌పై విజయం
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్
- కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో నాదల్ రికార్డు సమం

మెల్‌బోర్న్: ఫ్రెంచ్ ఓపెన్ అంటే రాఫెల్ నాదల్... వింబుల్డన్ అంటే రోజర్ ఫెడరర్ గుర్తుకొస్తారు. మరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అంటే ఎవరు గుర్తుకు రావాలి అన్న ప్రశ్నకు సమాధానం తానేనని సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ నిరూపించాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని ఈ సెర్బియా యోధుడు మరోసారి చాటుకున్నాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొకోవిచ్ 6–3, 7–6 (7/4), 7–6 (7/4)తో ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 29,75,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 22 లక్షలు)... రన్నరప్ సిట్సిపాస్‌కు 16,25,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 40 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. తాజా విజయంతో 35 ఏళ్ల జొకోవిచ్ నేడు విడుదల చేసే అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో పురుషుల టెన్నిస్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రాఫెల్ నాదల్ (22; స్పెయిన్) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు. సిట్సిపాస్‌తో 2 గంటల 56 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో జొకోవిచ్‌కు ఏ దశలోనూ ఆందోళన చెందేరీతిలో ప్రతిఘటన ఎదురుకాలేదు. కీలకదశలో ఈ సెర్బియా స్టార్ పైచేయి సాధించి సిట్సిపాస్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. తొలి సెట్‌లోని నాలుగో గేమ్‌లో సిట్సిపాస్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 4–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరులో తొలి సెట్‌ను 36 నిమిషాల్లో దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. ఫలితంగా సర్వీస్ ఒక్కసారీ బ్రేక్ కాలేదు. స్కోరు 6–6తో సమం కావడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో జొకోవిచ్ పైచేయి సాధించి 70 నిమిషాల్లో రెండో సెట్‌ను గెల్చుకున్నాడు. మూడో సెట్ తొలి గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సిట్సిపాస్ ఆ వెంటనే తన సర్వీస్‌ను కూడా కోల్పోయాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో స్కోరు 6–6తో సమమైంది. మళ్లీ టైబ్రేక్ అనివార్యమైంది. ఈసారీ టైబ్రేక్‌లో జొకోవిచ్ ఆధిపత్యం కనబరిచి 70 నిమిషాల్లో మూడో సెట్‌నూ సొంతం చేసుకొని విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో జొకోవిచ్ చేతిలో ఓడిపోవడం సిట్సిపాస్‌కిది రెండోసారి. 2021 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ జొకోవిచ్ చేతిలో ఓడిపోయాడు.



జొకోవిచ్

ఫైనల్ గణాంకాలు

జొకోవిచ్		సిట్సిపాస్
7	ఏస్‌లు	15
3	డబుల్ ఫాల్ట్‌లు	3
36	విన్నర్స్	40
22	అనవసర తప్పిదాలు	42
2	బ్రేక్ పాయింట్లు	1
10	నెట్ పాయింట్లు	12
112	మొత్తం పాయింట్లు	94



సిట్సిపాస్

22 జొకోవిచ్ నెగ్గిన గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ ఇందులో ఆస్ట్రేలియన్ ఓపెన్ (10), వింబుల్డన్ (7), యూఎస్ ఓపెన్ (3), ఫ్రెంచ్ ఓపెన్ (2) ఉన్నాయి. ప్రస్తుతం అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో రాఫెల్ నాదల్ (22) సరసన జొకోవిచ్ నిలిచాడు.

93 జొకోవిచ్ కెరీర్‌లో నెగ్గిన టైటిల్స్ అత్యధిక టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో నాదల్‌ను (92) ఐదో స్థానానికి నెట్టి జొకోవిచ్ నాలుగో స్థానానికి ఎగబాకాడు. టాప్–3లో జిమ్మీ కానర్స్ (అమెరికా: 109), ఫెడరర్ (స్విట్జర్లాండ్: 103), ఇవాన్ లెండిల్ (అమెరికా: 94) ఉన్నారు.

10 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్ 10 సార్లు (2008, 2011, 2012, 2013, 2015, 2016, 2019, 2020, 2021, 2023) ఫైనల్ చేరుకోగా... పదిసార్లూ గెలిచాడు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
874	288
59,331	17,604

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,622	△	109
డోజోన్స్	33,978	△	29
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,765	△	04
డాక్స్	15,150	△	17
షాంఘై (20వ తేదీ ముగింపు)	3,265	△	25
నిక్కాయ్	27,383	△	20

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధరలు	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	ధరలు	87.51	90.58
€	యూరో	ధరలు	99.03	102.34
¥	జపాన్ ఎన్ (100)	ధరలు	61.61	63.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధరలు	56.87	59.30
S$	సింగపూర్ డాలర్	ధరలు	60.99	63.00
SAR	సౌదీ రియాల్	ధరలు	20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్	ధరలు	21.32	23.11
¥	చైనా యువాన్	ధరలు	10.90	12.98

ఆకాంక్షలు నెరవేరేనా!



మోదీ 2.0 సర్కారు చివరి బడ్జెట్‌పై ఎన్నో ఆశలు

- మధ్యతరగతికి పన్ను ఉపశమనం
- ఉపాధి కల్పన, ఆరోగ్యానికి ప్రాముఖ్యం
- రైతాంగానికి సాయం పెంపుపై అంచనాలు
- ఉన్నత విద్యకు చేయూతనందించాలని సూచన

వచ్చే సార్వత్రిక ఎన్నికల ముందు వస్తున్న చివరి పూర్తి స్థాయి కేంద్ర బడ్జెట్ ఇదే. ఎంత కాదన్నా బడ్జెట్ నిర్ణయాలు, కేటాయింపుల ప్రభావం కొన్ని వర్గాలపై కచ్చితంగా ఉంటుంది. ఇప్పటికే కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీయే సర్కారు 9 ఏళ్లుగా పాలిస్తోంది. మరోసారి ప్రజామోదం కోసం బడ్జెట్‌ను ఒక అవకాశంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భావిస్తారా..? లేక మొదటి నుంచి సంస్కరణల హితమేనన్న తమ విధానానికి కట్టుబడి ఉంటారా? అన్నది ఫిబ్రవరి 1న తేటతెల్లం అవుతుంది. కానీ, సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెరిగిపోయిన ధరల భారాన్ని ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఉపాధి కల్పనపైనా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పన్నుల భారాన్ని తగ్గించాలన్న మధ్యతరగతి వాసుల వినతులు, వివిధ రంగాల ఆకాంక్షలకు ఈ బడ్జెట్ ఏ మేరకు న్యాయం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కరోనా తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో ఇంకా కోలుకోలేదు. డిమాండ్ పరిస్థితులు దీన్నే తెలియజేస్తున్నాయి. మరి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉత్తేజానికు ఆర్థిక మంత్రి ఏం చేస్తారో చూడాలి. నిర్మలమ్మకు ఇది ఐదో బడ్జెట్ కానుంది. **- బిజినెస్ డెస్క్**

మధ్యతరగతికి 'ఐటీ' తాయిలం..?



రూ.2.5 లక్షల వరకు ఆదాయం కలిగిన వారికి ఎలాంటి ఆదాయపన్ను లేదు. 2014–2015 సంవత్సరానికి ఆదాయపన్ను బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రూ.2 లక్షలుగా ఉన్న పరిమితిని రూ.2.5 లక్షలు చేశారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇది రూ.3 లక్షలుగా, రూ.80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలకు పెంచారు. తొమ్మిదేళ్లుగా ఇదే బేసిక్ పరిమితి కొనసాగుతోంది. రూ.2.51–5 లక్షల వరకు ఆదాయం ఉన్నా పన్ను చెల్లించే అవసరం లేకుండా తర్వాతి కాలంలో రాయితీ కల్పించారు. కానీ, బేసిక్ పరిమితిలో మార్పులు చేయలేదు. గణనీయంగా పెరిగిపోయిన జీవన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని దీన్ని రూ.5–6 లక్షలు చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది. ఈ కానుక ఉంటుందనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. లేదంటే రూ.50వేలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచుతారేమో చూడాలి. అలాగే, సెక్షన్ 80సీ కింద వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల ఆదాయంపై పన్ను లేకుండా ఉపశమనం పొందొచ్చు. దీన్ని కూడా రూ.2–3 లక్షలకు పెంచాలనే డిమాండ్లు నెలకొన్నాయి. అలాగే, గరిష్ట పన్ను రేటు 30 శాతం అమలుకి ఆదాయపన్ను పరిమితిని పెంచాలన్న డిమాండ్ బలంగా ఉంది. ప్రస్తుతం వార్షికాదాయం రూ.10లక్షలకు మించితే పాత పన్ను విధానంలో 30 శాతం రేటు అమలు చేస్తున్నారు. రూ.20 లక్షల వరకు ఆదాయం ఉండే వారికి 20 శాతం మించి పన్ను ఉండరాదన్నది నిపుణుల సూచనగా ఉంది. పన్ను భారం తగ్గించడం వల్ల మధ్య తరగతి, వేతన జీవులకు ఖర్చు చేసే ఆదాయం మరింత మిగులుతుంది. ఇది వినియోగంలోకి మారి, డిమాండ్‌కు ఊతం ఇస్తుందన్న విశ్లేషణ వినిపిస్తోంది. పన్నుల భారం తగ్గించడం ఒక కోణం అయితే, సామాన్యులు, మధ్యతరగతి వాసులపై కొత్తగా ఏ రూపంలోనూ పన్నుల భారం మోపకుండా ఉండడం కీలకం కానుంది. మరోవైపు ధరల భారం ఎక్కువ మందిని భయపెడుతోంది. కనుక కూరగాయలు, వంట నూనెలు, చమురు ధరల కట్టడికి తీసుకునే చర్యలకూ ఎంతో ప్రాధాన్యం ఉంటుంది.

ఔషధాల భారాన్ని దింపరూ..



పరిశోధన, అభివృద్ధికి, ఫార్ములేషన్, ఏపీఐల తయారీకి సంబంధించి ప్రత్యేక నిధుల కేటాయింపు అవసరం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఔషధాలపై జీఎస్టీని సులభతరం చేయాలని కోరుతున్నాయి. దేశ ఫార్మా పరిశ్రమ 2023 ముగిసే నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరుతుందన్న అంచనా ఉంది. ఫార్మా పరిశ్రమ ఔషధ పరీక్షలు, సర్టిఫికేషన్ వంటి సేవలను అందిస్తున్నా.. సేవల ఎగుమతి ప్రోత్సాహక పథకం (ఎస్‌ఈఐఎస్) కింద ఎలాంటి ప్రోత్సాహకాలు అందించడం లేదని, తమకూ వాటిని అందించాలన్న డిమాండ్ ఉంది. ఆరోగ్యం కోసం ప్రజలు జేబు నుంచి చేసే ఖర్చు 65 శాతంగా ఉందని, కనుక ఔషధాలపై జీఎస్టీని తగ్గించడం వల్ల ఈ భారాన్ని దింపొచ్చని పరిశ్రమ కోరుతోంది.

పాలసీదారులు/బీమా కంపెనీలు



మనదేశంలో బీమా వ్యాప్తి ఇప్పటికీ అంతర్జాతీయ సగటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) పెట్టుకుంది. టర్మ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై వినియోగదారులు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. ఇది ఎంతో మందికి భారంగా పరిణమించిదని, దీన్ని 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ ఎప్పటి నుంచో కోరుతోంది. ఉదాహరణకు రూ.10,000 ప్రీమియంపై రూ.1800 పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తోంది. పన్ను తగ్గింపుతో ప్రీమియం తగ్గడం వల్ల మరింత మంది బీమా పాలసీలు తీసుకునేందుకు ముందుకు వస్తారని పరిశ్రమ చెబుతోంది. ఈ డిమాండ్‌ను ఆర్థిక మంత్రి నెరవేర్చితే అది కచ్చితంగా బీమా వ్యాప్తికి దోహదపడుతుంది. ముఖ్యంగా అధిక కవరేజీనిచ్చే టర్మ్ ఇన్సూరెన్స్‌కు ఆదరణ పెరుగుతుందని పరిశ్రమ అంటోంది. హెల్త్ ఇన్సూరెన్స్‌కు చెల్లించే ప్రీమియం ఒక కుటుంబానికి రూ.25,000 వరకు ఉంటే సెక్షన్ 80డీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. లైఫ్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక పన్ను మినహాయింపు కావాలని, యాన్యుటీ (పెన్షన్ ప్లాన్) ఆదాయంపై పన్ను ఎత్తేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై మరింత పన్ను మినహాయింపు ఇవ్వాలని బీమా రంగం కోరుతోంది.

ఉపాధి కల్పన



అమెరికా, యూరప్‌లో ఆర్థిక మాంద్యం ఆందోళనల నేపథ్యంలో టెక్ కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకుంటున్నాయి. దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది. కనుక ఉపాధి కల్పన, పెట్టుబడులకు ఊతమిచ్చే ప్రతిపాదనలకు చోటు ఇవ్వాలన్న సూచనలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. నిజానికి ఉపాధి కల్పన లక్ష్యంతోనే మోదీ సర్కారు భారత్‌లో తయారీ విధానాన్ని ఎంచుకుంది. దీనికింద ఆత్మ నిర్భర్ (స్వావలంబన) భారత్ పేరుతో దేశీ తయారీని ప్రోత్సహించే పలు విధానాలను ఇప్పటికే చేపట్టింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద ఇప్పటికే 14 రంగాలకు ప్రోత్సాహకాలను ప్రకటించారు. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించి కేటాయింపులు పెంచొచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా మరిన్ని రంగాలు తమకు సైతం పీఎల్ఐ ప్రోత్సాహకాలు కావాలని కోరుతున్నాయి. వీటికి ఏ మాత్రం ప్రాధాన్యం ఇస్తారన్నది బడ్జెట్‌తో తెలుస్తుంది. స్టార్టప్‌లకు సైతం కేంద్రం ప్రోత్సాహకాలు ఇస్తోంది. దీనికి కూడా కేటాయింపులు పెంచొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీ) కింద కేటాయింపులు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచడం ద్వారా ఉపాధి కల్పించొచ్చనే సూచనలు వస్తున్నాయి.



ఫిన్‌టెక్/ఎంఎస్ఎంఈ



దేశీ ఫిన్‌టెక్ పరిశ్రమ తమకు మరిన్ని మద్దతు చర్యలు కావాలని కోరుతోంది. అందరికీ ఆర్థిక సేవల చేరువలో తమ పాత్ర కీలకమని, ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి కల్పనకు కీలకంగా వ్యవహరిస్తున్న ఎంఎస్ఎంఈ రంగం అవసరాలు తీర్చడంలోనూ ఫిన్‌టెక్ పరిశ్రమ చేస్తున్న సేవలను గుర్తు చేసింది. 45 శాతం మందికి ఉపాధినిస్తూ, జీడీపీలో 30 శాతం వాటాను ఎంఎస్ఎంఈ పరిశ్రమ కలిగి ఉంది. కనుక బడ్జెట్ ప్రతిపాదనల పట్ల ఫిన్‌టెక్ పరిశ్రమ ఆసక్తిగా చూస్తోంది.

కార్పొరేట్ రంగం డిమాండ్..



కొత్తగా తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేసే దేశీ కంపెనీలకు అతి తక్కువగా 15 శాతం కార్పొరేట్ పన్నును కేంద్రం లోగడ ప్రకటించింది. 2024 మార్చి 31లోపు తయారీ కార్యకలాపాలు ఆరంభించేవి ఈ ప్రయోజనం పొందొచ్చు. ఈ గడువును పొడిగించాలనే డిమాండ్ ఉంది. దీనివల్ల మరిన్ని కంపెనీలు ముందుకు వస్తాయని, తద్వారా ఉపాధి కల్పన పెరుగుతుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. కరోనా మహమ్మారి ప్రభావం నుంచి బయట పడేందుకు కంపెనీలకు సమయం పట్టిందని.. ఇప్పుడు నూతన పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నందున గడువు పొడిగించాలనే డిమాండ్ ఉంది. కొత్త ప్లాంట్ తయారీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు కనీసం 2–3 ఏళ్లు పడుతుందని, కనుక ప్రస్తుత గడువు చాలదన్న అభిప్రాయం ఉంది. ఆదాయపన్ను విషయంలో ఊరట కల్పిస్తే అది హౌసింగ్ పరిశ్రమ వృద్ధికి మేలు చేస్తుందని రియల్టీ భావిస్తోంది. భారీ ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ రంగం తమకు క్షేత్రస్థాయిలో రుణ లభ్యత సమస్యగా ఉందని చెబుతోంది. ఎంఎస్ఎంఈ తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే కీలకమైన ఆటోమొబైల్ రంగం పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. కనిష్టంగా 28%, గరిష్టంగా 40 శాతానికి పైనే వాహనాలపై పన్నుల భారం వేస్తున్నారని.. మార్కెట్ విస్తరణకు ఇది అవరోధంగా నిలుస్తున్నట్టు చెబుతున్నాయి.

స్టాక్ మార్కెట్ కోర్కెలు



మూలధన లాభాల పన్ను పరంగా ఉపశమనం కల్పిస్తే అది మార్కెట్లకు మంచి జోష్‌నిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డెట్, ఈక్విటీ, ప్రాపర్టీలకు వేర్వేరు మూలధన లాభాల పన్ను, హోల్డింగ్ పీరియడ్ అమలవుతున్నాయి. వీటి మధ్య ఏకరూపతకు అవకాశం ఉందని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి ఇప్పటికే సంకేతం ఇచ్చింది. ఈ క్రమంలోనే మూలధన లాభాల పన్ను విషయమై అంచనాలు ఏర్పడ్డాయి. దీర్ఘకాల మూలధన లాభాలపై నష్టాన్ని, స్వల్పకాల మూలధన లాభాలతో సర్దుబాటుకు అవకాశం లేదు.

విద్యారంగం




దేశంలో నాణ్యమైన విద్యకు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే విదేశీ విద్యా సంస్థలకు మోదీ సర్కారు ఆహ్వానం పలికింది. విద్యా సేవలపై జీఎస్టీ భారాన్ని తొలగించడం లేదంటే తగ్గించాలని విద్యా సంస్థలు కోరుతున్నాయి. దేశంలో ప్రాథమిక విద్యలో ఎక్కువ మంది చేరుతున్నారు. ఉన్నత విద్యకు వెళ్లేసరికి పిరమిడ్ మాదిరి చేరే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అందుకుని ఉన్నత విద్యలోనూ మరింత మంది చేరేందుకు వీలుగా ఆకర్షణీయమైన రుణ పథకాలు, స్కాలర్‌షిప్‌లు ప్రకటించాలనే డిమాండ్ ఉంది.

గృహ కల్పన



అందరికీ ఇల్లు అనేది మోదీ సర్కారు నినాదం. దీని సాకారానికి వీలుగా రుణ సబ్సిడీ పథకాన్ని కొనసాగించాలని హౌసింగ్ పరిశ్రమ కోరుతోంది. అందుబాటు ధరల ఇంటికి నిర్వచనాన్ని విస్తరించాలన్న డిమాండ్ కూడా ఉంది. నిర్మాణ రంగ మెటీరియల్ అయిన స్టీల్, సిమెంట్‌పై జీఎస్టీ తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం గడువును మరింత కాలం పెంచాలని కోరుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రుణంపై కొంత రాయితీ లభిస్తుంది.



గత ఎన్నికల ముందు బడ్జెట్‌లో ఏం చేశారు?



2019 ఎన్నికల ముందు నాటి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఒకసారి గమనించినట్టయితే.. హెల్త్‌కేర్, పారిశుద్ధ్యం, విద్యా రంగాలకు అంతకుముందు మూడు సంవత్సరాల్లో లేనంతగా కేటాయింపులు పెంచారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అరుణ్ జైట్లీ ప్రకటించారు. విద్య, సామాజిక భద్రత, ఆరోగ్యం కోసం రూ.1.38 లక్షల కోట్లు కేటాయించారు. ఆదాయపన్నుపై హెల్త్, ఎడ్యుకేషన్ సెస్‌ను 3 శాతం నుంచి 4 శాతానికి పెంచారు. ''భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోంది. అతిపెద్ద యువ జనాభా కలిగి ఉన్న భారత్ తన హామీలను అమల్లో పెట్టాల్సిన అవసరం ఉంది''అని నాడు అరుణ్‌జైట్లీ 2018–19 బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు.

రైతులను చూస్తారా..?



సాగు రంగం నుంచి డిమాండ్ల చిట్టా పెద్దదిగానే ఉంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో రైతుకు ఏటా సాగుకు కావాల్సిన ముడి సరుకుల కోసం ఇస్తున్న రూ.6,000ను పెంచాలనే డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. దీనివల్ల రైతులు రుణాలతో పనిలేకుండా సాగుకు కావాల్సిన ముడి పదార్థాలను కొనుగోలు చేసుకోగలరన్న సూచన ఉంది. పంటల బీమా పథకాన్ని మరింత మెరుగ్గా రూపొందించాలనే డిమాండ్ సైతం ఉంది. అగ్రి టెక్ స్టార్టప్‌లకు రాయితీలు కల్పించాలని, ఆగ్రోకెమికల్స్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది. సాగులో టెక్నాలజీ విస్తరణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగం పెంచేందుకు చర్యలు ప్రకటిస్తారనే అంచనాలు ఉన్నాయి. ముడి చమురు మాదిరే వంట నూనెల విషయంలోనూ 65 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. దీంతో 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్స్ ఆయిల్స్' పేరుతో నూనె గింజల సాగుకు ఆర్థిక సహకారం అందించాలని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. ఏటా రూ.25,000 కోట్ల చొప్పున ఐదేళ్లపాటు అందించాలని కేంద్రానికి సూచించింది. దీనివల్ల దిగుమతులను 30 శాతానికి తగ్గించొచ్చని పేర్కొంది. సాగు రంగంలో పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ధనూకా గ్రూప్ చైర్మన్ ఆర్‌జీ అగర్వాల్ కోరారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉన్న బడ్జెట్‌లో వ్యవసాయానికి మెరుగైన కేటాయింపులు చేస్తారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.


హెల్త్‌కేర్‌కు పెద్ద పీట వేస్తారా?



ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను 20–30 శాతం పెంచాలన్న డిమాండ్లు నెలకొన్నాయి. కరోనా మహమ్మారి ఆరోగ్య మౌలిక సదుపాయాల అవసరాన్ని గుర్తు చేసింది. హెల్త్‌కేర్ రంగానికి 2022–23 బడ్జెట్‌లో 16.5 శాతం అధికంగా రూ.86,200 కోట్ల కేటాయింపులు చేశారు. ఈ విడత కేటాయింపులు ఏ మేరకు ఉంటాయన్నది చూడాల్సి ఉంది. బడ్జెట్‌లో కేటాయింపుల పట్ల భారీ అంచనాలతో ఉన్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రెసిడెంట్ డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్ తెలిపారు. ముఖ్యంగా హెల్త్‌కేర్ పరిశ్రమ డిజిటైజేషన్‌కు అదనపు నిధులు అవసరమని అపోలో టెలీహెల్త్ సీఈవో విక్రమ్ తాప్లూ అభిప్రాయపడ్డారు. నేషనల్ డిజిటల్ హెల్త్ ఎకోసిస్టమ్, నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ప్రకటించినప్పటికీ, వీటి విస్తరణకు మరిన్ని నిధుల కేటాయింపు అవసరాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా టెలీ మెడిసిన్ సేవల విస్తరణకు అధిక నిధుల కేటాయింపు అవసరమని డాక్టర్ అగర్వాల్ సైతం పేర్కొన్నారు. స్వచ్ఛందంగా మెడికల్ ఇన్సూరెన్స్‌కు ప్రతిపాదికీ అవకాశం కల్పించాలని కోరారు. అది కూడా ఉచితంగా అందించాలని సూచించారు. కేన్సర్ కేర్ వసతుల పెంపునకు మరిన్ని నిధులు అవసరమని నిపుణుల సూచనగా ఉంది. హెల్త్‌కేర్ మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక నిధి కేటాయించాలనే డిమాండ్ సైతం ఉంది.

మంచి కంపెనీని గుర్తించడం ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్




మార్కెట్ పతనంలో పెట్టుబడులకు అనుకూలమైన స్టాక్స్‌ను గుర్తించడం ఎలా? – శ్వేత

మార్కెట్లలో కరెక్షన్ మొదలైన తర్వాత పెట్టుబడి పెట్టేందుకు కంపెనీలను అన్వేషించకూడదు. ఒక కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి ముందు ఎంతో విస్తృతమైన పరిశోధన, కసరత్తు కావాలి. కంపెనీ ఎప్పటికప్పుడు వ్యాపారంలో వృద్ధి నమోదు చేస్తోందా? అని చూడాలి. రిటర్న్ ఆన్ ఈక్విటీ మంచి రేషియోలో ఉందా? అని చూడాలి. రుణభారంతో నెట్టుకొస్తూ ఉండకూడదు. అంటే ఎక్కువ రుణాలు తీసుకుని ఉండకూడదు. కంపెనీని నడిపించే యాజమాన్యం నిధులు పక్కదారి పట్టించకుండా నిజాయతీగా, సమర్థవంతంగా పనిచేసేదై ఉండాలి. కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తున్నారంటే మీ డబ్బులను వేరే వారికి అప్పగిస్తున్నట్టుగా భావించాలి. అందుకే కంపెనీని నడిపించే వ్యక్తులు విశ్వసనీయత కలిగి ఉండాలి. ఇవన్నీ ఒక కంపెనీలో గుర్తిస్తే ఆకర్షణీయమైన ధర వద్ద షేరులో పెట్టుబడులు పెట్టుకోవచ్చు. ఇలాంటి నాణ్యత అంశాలతో కూడిన కంపెనీలను గుర్తించినప్పుడు వాటిని వాచ్ లిస్ట్ (పరిశీలన జాబితా)లో పెట్టుకోవాలి. మీరు గుర్తించిన కంపెనీలు ఖరీదైన వ్యాల్యూయేషన్లలోనే ఎక్కువ రోజుల పాటు ట్రేడ్ కావచ్చు. కానీ, మీరు అనుకున్న ధరకు దిగొచ్చే వరకు వేచి చూడాలి.

55 ఏళ్లకే రిటైర్ అవుదామనుకుంటున్నాను. ఆ సమయానికి నిధిని సిద్ధం చేసుకోవడం ఎలా? – సురేష్

55 లేదా 60 ఏళ్లకు రిటైర్ అవుదామని అనుకుంటే పెట్టుబడులకు 20–25 ఏళ్ల వ్యవధి ఉంటుంది. ఈక్విటీలో పెట్టుబడులు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వడానికి ఈ సమయం సరిపోతుంది. అంతేకాదు, మీరు అనుకున్న 55 ఏళ్లకు రిటైర్ అయినా.. ఈక్విటీ పెట్టుబడులకు రిటైర్మెంట్ లేదని గుర్తు పెట్టుకోవాలి. ఈక్విటీల్లో పెట్టుబడుల మొత్తం తీసుకెళ్లి డెట్‌లో ఇన్వెస్ట్ చేయడం సరైన విధానం కాదు. ఈక్విటీల్లో పెట్టుబడులు కొంత భాగం అలానే కొనసాగించాలి. అప్పటి వరకు సమకూర్చుకున్న ఈక్విటీ పోర్ట్‌ఫోలియో నుంచి మీకు సగటు రాబడి వచ్చినా విశ్రాంత జీవనాన్ని సాఫీగా సాగించొచ్చు. కనుక వెంటనే ఈక్విటీల్లో పెట్టుబడులు ప్రారంభించండి. ఒకటి రెండు మంచి ఫ్లెక్సీక్యాప్ (ఫోకస్డ్) ఫండ్స్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేసుకోవాలి.

ఇది భారత్‌పై దాడే..



హిండెన్‌బర్గ్ ఆరోపణలపై అదానీ గ్రూప్ వ్యాఖ్యలు • 413 పేజీల్లో హిండెన్‌బర్గ్ ప్రశ్నలకు వివరణ

న్యూఢిల్లీ: అమెరికన్ షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా తప్పులతడకలని అదానీ గ్రూప్ వ్యాఖ్యానించింది. ఇది ఏదో ఒక కంపెనీపై ఊరికే చేసిన దాడి కాదని.. లాభనష్టాలు అన్నింటినీ బేరీజు వేసుకుని భారత్ పైనా .. భారతీయ సంస్థల స్వతంత్రత, సమగ్రత, నాణ్యతపైనా .. భారత వృద్ధి గాథ, ఆకాంక్షలపైనా చేసిన దాడి అని అభివర్ణించింది. ఆరోపణలపై 413 పేజీల్లో అంశాలవారీగా వివరణనిచ్చింది. హిండెన్‌బర్గ్ 88 ప్రశ్నల్లో 65కి సంబంధించి అదానీ పోర్ట్‌ఫోలియో కంపెనీలు ఇప్పటికే వివరాలు వెల్లడించాయని పేర్కొంది. మిగతా 23 ప్రశ్నల్లో 18 .. పబ్లిక్ షేర్‌హోల్డర్లు, థర్డ్‌పార్టీలకు సంబంధించినవని .. మిగతా 5 నిరాధార ఆరోపణలని తెలిపింది. అదానీ గ్రూప్ ఖాతాల్లో, షేర్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలతో గత 2 ట్రేడింగ్ సెషన్లలోనేగ్రూప్ మార్కెట్ విలువ 50 బిలియన్ డాలర్ల మేర క్షీణించింది. గ్రూప్ రూ. 20,000 కోట్ల భారీ ఎఫ్‌పీఓ సమయంలో హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేయడం గమనార్హం.

వట్టి వసంతకుమార్ కన్నుమూత

- వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్ హయాంలో మంత్రిగా బాధ్యతలు
- కిడ్నీ సమస్యతో బాధపడుతూ తుదిశ్వాస
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- ఆయన సేవలు చిరస్మరణీయం: గవర్నర్, సీఎం



భీమడోలు/ఆరిలోవ/ ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వట్టి వసంతకుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన నాలుగు రోజుల క్రితం విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు పిల్లలు లేరు. భార్య ఉమాదేవి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ చేసిన వట్టి వసంతకుమార్ అదే విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడు, సహచరుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. 2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ మృతి తర్వాత పరిణామాలకు కలతచెందిన ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన పార్థివదేహాన్ని విశాఖపట్నం నుంచి స్వగ్రామం పూళ్ల పంచాయతీ ఎంఎంపురం గ్రామానికి అంబులెన్స్‌లో తరలించారు. వసంతకుమార్ మృతదేహాన్ని చూసి ఆయన తండ్రి, డీసీసీబీ మాజీ చైర్మన్ వెంకటరంగ పార్థసారథి కన్నీటిపర్యంతమయ్యారు. మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, దాడిశెట్టి రాజా, అంబటి రాంబాబు, ఎంపీలు సుభాష్ చంద్రబోస్, శ్రీధర్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మంత్రులు కారుమూరి, దాడిశెట్టి రాజా ఏర్పాట్లు పర్యవేక్షించగా, వసంతకుమార్ వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

గవర్నర్, సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. రెండుసార్లు మంత్రిగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్, సీఎం కార్యాలయం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. కాగా, రాజకీయంగా, వ్యక్తిగతంగా వసంతకుమార్‌తో తన ప్రయాణం ఎప్పటికీ మరవలేనిదని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

టెక్ ప్రపంచంలో పంచేంద్రియాలు!

దొడ్డ శ్రీనివాసరెడ్డి



మనిషి సృష్టించిన టెక్నాలజీ ఇప్పుడు మరో మనిషిని సృష్టించబోతోంది. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) మనిషి మెదడును అనుకరించేందుకు ప్రయత్నిస్తుంటే.. దాని సాయంతో మన పంచేంద్రియాలకు ప్రత్యా మ్నాయాలను సృష్టించే దిశగా పరిశోధనలు సాగుతున్నాయి. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం చేసే పనులైన చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శలను ఆస్వాదించగల కృత్రిమ పరికరాల తయారీలో శాస్త్రవేత్తలు తలమునకలు అవుతున్నారు. జ్ఞానేంద్రియాల్లోని లోపాలను సరిచేయడం, వాటి పనితీరును మెరుగుపర్చడంతోపాటు పూర్తిస్థాయిలో కృత్రిమంగానే.. మరింత సమర్థంగా రూపుదిద్దేందుకు ప్రత్యామ్నాయ పరికరాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. లక్షల మంది చూపులేని అంధులు, కోట్ల మంది దృష్టి లోపాలతో బాధ పడుతున్నవారు ప్రపంచంలో ఉన్నారు. చేతులు, కాళ్లు కోల్పోయి, కృత్రిమ అవయవాలతో కాలం గడుపుతున్న వికలాంగులూ ఉన్నారు. కరోనా బారినపడిన కోట్లాది మంది బాధితులు రుచి, వాసన జ్ఞానం కోల్పోవడం మనం గమనించాం. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి, మరింత సమర్థంగా జ్ఞానేంద్రియాలు పనిచేసేలా కృత్రిమ మేధతో ప్రత్యామ్నాయ పరికరాలను తయారు చేసుకోవాల్సిన అవసరం మనకు ఉంది. ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలను అవలోకనం చేసుకుందాం.


కృత్రిమ మేధ ఆధారంగా కృత్రిమ జ్ఞానేంద్రియాల రూపకల్పన	
	• చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శను ఇచ్చే పరికరాలపై విస్తృత పరిశోధనలు • దురదృష్టవశాత్తు వాటిని కోల్పోయిన వారికి ప్రయోజనకరంగా ఆవిష్కరణలు • ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో అందుబాటులోకి.. • పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తల దృష్టి

చూపు

మనిషి కళ్లు, కంటిచూపుపై చిరకాలంగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. చూపులేని, కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ సాగుతోంది. ఇలాంటి వారి కోసం 'ఆర్కామ్ మైఐ' అనే పరికరం ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ఈ పరికరాన్ని కళ్లజోడుకు అమర్చుకుంటే మాటల ద్వారా అవసరమైన సమాచారాన్ని అంధులు, కంటిచూపు సరిగా లేనివారు పొందవచ్చు. చిన్న వైర్‌లెస్ కెమెరా కలిగిఉన్న ఈ పరికరం ద్వారా మన ముందున్న ఏ వస్తువునైనా మాటల ద్వారా అభివర్ణిస్తుంది. మనం తెలుసుకోవాల్సిన వస్తువు వైపు చూస్తూ పరికరాన్ని ఆన్ చేస్తే చాలు... దానికి అమర్చి ఉన్న స్పీకర్ ద్వారా ఆ వస్తువు గురించి వివరిస్తుంది. వార్త, కథనం గురించి తెలుసుకోవాలన్నా ఈ ఆర్కమ్ మై ఐ ద్వారా చదివి వినిపించుకోవచ్చు. వినియోగ వస్తువుల బార్ కోడులను చదివి వాటి వివరాలను కూడా అందిస్తుంది. దాంతో అంధులు కూడా ఎవరి సాయం లేకుండా ధైర్యంగా షాపింగ్ చేయవచ్చు.

- కంటిచూపు సమస్యలు ఉన్న వారికోసం జార్జియా యూనివర్సిటీ 'మిరా'అనే పరికరాన్ని రూపొందించింది. కృత్రిమ మేధతో పనిచేసే ఆ పరికరాన్ని వీపు భాగంలో తగిలించుకుంటే చాలు... అంధులు కూడా ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లవచ్చు. ఈ పరికరం నిరంతరాయంగా మన పరిసరాల గురించి వివరిస్తూ సురక్షితంగా గమ్యం చేరుస్తుంది.
- కంటికి ప్రత్యామ్నాయంగా 'బయోనిక్ ఐ'త్వరలో అందుబాటులోకి రాబోతోంది. ప్రపంచవ్యాప్తంగా 'బయోనిక్ ఐ'పై పరిశోధనలు జరుగుతున్నాయి. 'బయోనిక్ ఐ'... ఎదుట ఉన్న దృశ్యాలను గ్రహించి, వాటిని ఎలక్ట్రిక్ సిగ్నల్స్‌గా మార్చి మెదడుకు సంకేతాలు పంపడం ద్వారా దీన్ని ధరించిన వ్యక్తికి ఆయా దృశ్యాలు ఆవిష్కృతం అయ్యేలా చేస్తుంది. సిడ్నీ వర్సిటీ ఇటీవల 'బయోనిక్ ఐ'ను గొర్రెలకు అమర్చి పరీక్షించగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని తేల్చింది. ఫీనిక్స్99గా పిలిచే ఈ పరికరాన్ని ఇక మనుషులపై పరీక్షించాల్సి ఉంది. సెకండ్ సైట్, ఆస్ట్రేలియాకే చెందిన మోనాష్ విజన్ గ్రూప్, ఫ్రాన్స్‌కు చెందిన పిక్సిమ్ గ్రూప్ లాంటి సంస్థలు కంటి రెటినాకు ప్రత్యామ్నాయంగా పనిచేసే 'బయోనిక్ ఐ'పై పరిశోధనలు చేస్తున్నాయి. భవిష్యత్తులో 'బయోనిక్ ఐ'కు 40 కోట్ల డాలర్ల మార్కెట్ ఉంటుందని అంచనా.

వాసన



స్కాట్లాండ్‌లో నర్సుగా పనిచేసిన జాయ్ మిన్ని వాసన ద్వారా రోగికి నరాలకు సంబంధించిన పార్కిన్సన్ వ్యాధి ఉన్నదీ లేనిదీ చెబుతూ సంచలనం సృష్టించారు. పార్కిన్సన్ వ్యాధి కారణంగా శరీరం నుంచి వచ్చే వాసనల్లో తేడాను ఆమె పసిగట్టగలదు. జాయ్ మిన్ని స్ఫూర్తితో యూరప్‌కు చెందిన అనేక యూనివర్సిటీలు పరిశోధనలు నిర్వహించి పార్కిన్సన్ రోగుల నుంచి వెలువడే పది రకాల రసాయనాలను గుర్తించారు. దీని ఆధారంగా చైనాకు చెందిన జె జియాంగ్ యూనివర్సిటీ కృత్రిమ మేధను ఉపయోగించి ఒక కృత్రిమ నాసికను అభివృద్ధి చేసింది. రోగి శరీరం నుంచి వెలువడే రసాయనాల వాసనను గ్రహించి వ్యాధి లక్షణాలను చెప్పగలిగే ఈ పరికరం 70.8 శాతం కచ్చితత్వం కలిగి ఉంది. శ్వాస ఆధారంగా పని చేయగలిగిన సెన్సర్లు ఉన్న పరికరాల ద్వారా ఇప్పుడు కొన్ని రకాల కేన్సర్లను, మూత్రపిండాల వ్యాధులు, స్లెరోసిస్ వంటి మరికొన్ని వ్యాధులను పసిగట్టే పనిలో పరిశోధకులు ఉన్నారు. బ్రెయిన్ చిప్ కంపెనీ తయారు చేసిన 'అకిడా'ప్రాసెసర్ వంద రకాల రసాయనాలను, వాసనలను పసిగట్టగలుగుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్, కెమికల్, బ్రూవరేజ్ వంటి ఫ్యాక్టరీలలో పదార్థాల నాణ్యతను పరీక్షించడానికి ఇప్పుడు ఎలక్ట్రానిక్ నాసికలను వినియోగిస్తున్నారు. మనిషికి ప్రమాదకరమైన విషపూరిత వాయువులను పరీక్షించడానికి కూడా ఈ కృత్రిమ నాసికలు వాడకంలోకి వచ్చాయి.

వినికిడి

- దాదాపు రెండు దశాబ్దాలుగా మనం కాక్లియర్ ఇంప్లాంట్స్ ద్వారా చెవిటి వారిలో వినికిడి శక్తిని ఇనుమడించగలిగాం. చెవిలో అంతర్భాగమైన కాక్లీని అనుకరించే పరికరాన్ని మరింత అభివృద్ధి చేసి మాటలను, శబ్దాలను వేరుచేయగల ఏఐ ఆధారిత పరికరాన్ని 'ఓమ్నీ బ్రిడ్జ్'అభివృద్ధి చేసింది. ఈ పరికరం సాయంతో అవసరమైన భాషలోకి తర్జుమా చేసుకొని సంభాషణల్ని కొనసాగించగలిగే శక్తి చెవిటి వారికి ప్రసాదించింది.
- మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), రోడ్ ఐలాండ్ స్కూల్ ఆఫ్ డిజైన్ (ఆర్ఐఎస్‌డీ) కలసి శబ్దాలను గ్రహించి ప్రసారం చేయగల ఒక రకమైన వస్త్రాన్ని అభివృద్ధి చేశాయి. ఈ పరిశోధనా ఫలితాన్ని ఇటీవల నేచర్ పత్రికలో ప్రచురించాయి. చెవిలో కర్ణభేరిని పోలిన ఈ వస్త్రం... శబ్ద తరంగాలను ఎలక్ట్రిక్ తరంగాలుగా మార్చి మన చెవికి అమర్చిన మైక్రోఫోన్ లాంటి పరికరానికి చేరుస్తుంది. ఈ పరికరం ఆ శబ్దాలను చెవిటి వారికి యథాతథంగా వినిపించగలుగుతుంది. ఈ వస్త్రాన్ని షైదుస్తుల్లో గుండె ప్రాంతంలో అమర్చడం ద్వారా గుండె, శ్వాసకోశ పనితీరును కూడా ఎప్పటికప్పుడు గమనించవచ్చు.

స్పర్శ

చర్మానికి ఉన్న ప్రత్యేక గుణం స్పర్శ జ్ఞానం. స్పర్శ ద్వారా వస్తువులను గ్రహించగలిగే గుణం చర్మానికి ఉంది. వికలాంగులకు అమర్చే కృత్రిమ చేతులు, కాళ్లకు స్పర్శ జ్ఞానం కూడా అందించాలనే బృహత్ సంకల్పం పరిశోధకులకు ఏర్పడింది. ఈ దిశగా జరుగుతున్న పరిశోధనలు అనేక ఆవిష్కరణలకు దారి తీస్తున్నాయి. బ్రిటన్‌లోని బ్రిస్టల్ రొబోటిక్స్ లేబొరేటరీకి చెందిన పరిశోధకులు త్రీడీ ప్రింట్‌తో రూపొందించిన కృత్రిమ చర్మాన్ని రోబోల వేళ్లకు తొడగడం ద్వారా స్పర్శ జ్ఞానాన్ని కలిగించడంలో విజయం సాధించగలిగారు. కృత్రిమ చర్మం ద్వారా వస్త్రాల నాణ్యత, మృదుత్వం, తేమ వంటి లక్షణాలను పసిగట్టవచ్చు. స్పర్శను ఆస్వాదించగలిగే కృత్రిమ చర్మం తయారీపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ముట్టుకున్నప్పుడు వచ్చే ప్రకంపనాల ఆధారంగా కృతిమ మేధతో వస్తువులను గ్రహించగలిగే ఈ–స్కిన్.. మనిషి స్పర్శజ్ఞానాన్ని అనుకరించగల ప్రత్యామ్నాయ మార్గంగా అవతరించబోతోంది. మనిషి ముట్టుకోలేని అత్యంత వేడి పదార్థాలు, అత్యంత శీతల పదార్థాలు, ప్రమాదకరమైన వస్తువులను ఈ కృత్రిమ చర్మం ద్వారా విశ్లేషించే అవకాశం ఏర్పడుతుందని పరిశోధకుల అభిప్రాయం. 'అకిడా'ప్రాసెసర్ అమర్చిన పరికరాలతో రోడ్లు, బ్రిడ్జీలను ముట్టుకొని వాటి నాణ్యతను అంచనా వేసే అవకాశం ఏర్పడుతుంది. మనిషి వెళ్లలేని సముద్రగర్భాలు, భూగర్భాల్లో ఈ కృత్రిమ చర్మంగల పరికరాలను పంపడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకొనే ఆస్కారం ఉందని ఈ రంగంలో పనిచేస్తున్న పరిశోధకులు చెబుతున్నారు.

రుచి

గుండె జబ్బులకు, రక్తపోటుకు కారణమైన అధిక ఉప్పు వాడకాన్ని తగ్గించడం కోసం జపాన్‌లో మైజీ యూనివర్సిటీ ఒక ఎలక్ట్రానిక్ చాప్‌స్టిక్‌ను తయారు చేసింది. ఈ చాప్‌స్టిక్‌తో ఆహారం తీసుకొనేటప్పుడు అది సోడియం అయాన్‌లను నోటికి అందించి కృత్రిమంగా ఉప్పు రుచిని కలిగిస్తుంది. దాంతో ఆహారంలో ఉప్పు వాడకాన్ని గణనీయంగా తగ్గించగలిగామని యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు. ఈ సూత్రాన్ని అనుసరించి మనిషి కోరిన రుచులను కృత్రిమంగా అందించగల అనేక వస్తువులు అందుబాటులోకి రాబోతున్నాయని ప్రముఖ పరిశోధకుడు నిమిషె రణసింఘె చెబుతున్నారు. వైన్ తయారీ కేంద్రాల్లో రుచిచూసి నాణ్యతను అంచనా వేసే టేస్టర్ల స్థానంలో ఇప్పుడు కృత్రిమ మేధస్సుతో పని చేసే 'ఎలక్ట్రానిక్ నాలుక'లు అంటుబాటులోకి వచ్చాయి. ఈ ఎలక్ట్రానిక్ నాలుకలో ఉండే సెన్సర్లు పదార్థంలో ఉండే రుచికి సంబంధించిన సమాచారాన్ని గ్రహించి, విశ్లేషించి ఫలితాలను వెల్లడించగలవు. పదార్థాల నాణ్యత, తాజాదనాన్ని విశ్లేషించే ఎలక్ట్రానిక్ నాలుకలను ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో వాడుతున్నారు. అలాగే మనిషి నాలుకతో రుచి చూడలేని రసాయనాల కోసం ఫార్మా కంపెనీల్లో కూడా ఎలక్ట్రానిక్ నాలుకలు అందుబాటులోకి వచ్చాయి.

పంచేంద్రియాలకే కాదు... మనిషికి ఉండే సృజనాత్మక శక్తికి కూడా కృత్రిమ మేధతో ప్రత్యామ్నాయాలు సృష్టించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే కృత్రిమ మేధ సాయంతో కవితలు, కథలు, పెయింటింగ్స్ వంటివి సృష్టించడంలో సఫలీకృతులయ్యారు పరిశోధకులు.

తీరంలో అలజడి

- నేడు వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం
- దక్షిణ కోస్తా, రాయలసీమకు మూడు రోజులపాటు వర్షసూచన



తూపిలిపాలెం వద్ద ఎగసిపడుతున్న సముద్రపు అలలు

సాక్షి, విశాఖపట్నం/వాకాడు (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా వాకాడు తీరంలో భీకర శబ్దాలతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతం మీదుగా ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోస్పిరిక్ స్థాయి వరకు విస్తరించి ఉంది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం నైరుతి బంగాళాఖాతం మీదుగా నెమ్మదిగా పయనిస్తూ ఫిబ్రవరి 1 నాటికి శ్రీలంక తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం నుంచి మూడు రోజులపాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. ఉత్తర కోస్తాంధ్రలో పొడి వాతావరణం నెలకొంటుందని, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని పేర్కొంది. అదే సమయంలో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో పొగ మంచు ఏర్పడే అవకాశం కూడా ఉందని తెలిపింది. కాగా, ఆదివారం వేకువజామున రాష్ట్రంలో అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయలో 8.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఆర్.అనంతపురం (శ్రీసత్యసాయి)లో 9.6, ముత్తుకూరు (చిత్తూరు)లో 10, నిమ్మనపల్లె (అన్నమయ్య)లో 10.9, వల్లివేడు (తిరుపతి)లో 11.8 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముందుకొచ్చిన సముద్రం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో ఈదురు గాలులు వీస్తుండగా.. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో సముద్రం దాదాపు 5 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకొచ్చి తీరాన్ని తాకుతోంది. సముద్రంలో అలలు 5 అడుగుల మేర ఎగసిపడటం, బోట్లు నిలబడే పరిస్థితి లేకపోవడంతో తిరుపతి జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాల్లో సముద్రంలో వేటకు వెళ్లడంపై నిషేధం విధించారు.



బోట్లను ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేస్తున్న మత్స్యకారులు

ప్రపంచం చిన్నదై.. మేధస్సు పదునై!

పిల్లలు కాదు పిడుగులు	
	• ఆకట్టుకుంటున్న వయస్సుకు మించిన ప్రతిభ • అరచేతిలో ఇమిడిపోయిన ప్రపంచం • కొత్త విషయాలు తెలుసుకోవడంపై ఆసక్తి • చదువుతో పాటు ఇతర అంశాల్లోనూ ప్రావీణ్యం • పిల్లల అభిరుచులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం • 'స్మార్ట్'గా మారిపోతున్న ఇళ్లు

- కర్నూలులోని మాంటిస్సోరి పాఠశాలలో హితాస్వన 7వ తరగతి, లశిత్ 4వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ అక్కా తమ్ముళ్లు. కూచిపూడి, మ్యూజిక్, డ్రాయింగ్, శ్యాండ్‌ఆర్ట్, శ్లోక పఠనంతో పాటు కనీసం పది అంశాల్లో రాణిస్తున్నారు. లెక్కలేనన్ని అవార్డులు, రికార్డులు వీరి సొంతం. చిన్న వయస్సులోనే వీరి అద్భుతమైన ప్రతిభ అందరి దృష్టిని ఆకర్శిస్తోంది.
- కర్నూలుకు మాధవీలత, నీలారెడ్డి దంపతుల కుమారుడు చంద్రహాస్ పదో తరగతి చదువుతున్నాడు. ఎన్‌సీసీ, యోగా, స్విమ్మింగ్, ఇంటర్నేషనల్ కంప్యూటర్ ఒలంపియాడ్, నేషనల్ ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలంపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. ఎన్‌సీసీలో సిమిలేటరీ ఫైరింగ్ కమాండర్‌గా బెస్ట్ కేడెట్ అవార్డు తీసుకోవడం విశేషం.
- వీరిద్దరే కాదు చాలామంది చిన్నారులు విద్యతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ తరం పిల్లల ఆలోచనా ధోరణి, తెలివితేటలు, జీవన విధానం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. ముఖ్యంగా ఆధునిక ప్రపంచాన్ని అందిపుచ్చుకోవడంలో తల్లిదండ్రులు కూడా వీరి తర్వాతే. మొబైల్‌లో యాప్స్, టీవీలో ఓటీటీ యాప్స్ డౌన్‌లోడ్, కంప్యూటర్ వెబ్‌సైట్‌లు.. ఇలా ఎందులోనైనా సమాచారం తెలుసుకోవాలంటే తల్లిదండ్రులు పిల్లలనే సంప్రదిస్తున్నారంటే ఏ స్థాయిలో వీరు తమను తాము తీర్చుదిద్దుకుంటున్నారో అర్థమవుతోంది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు



మహిషాసుర మర్దినిగా హితాస్వన



ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా లశిత్



ఎన్‌సీసీలో అవార్డు తీసుకున్న చంద్రహాస్

20 ఏళ్ల కిందటితో పోలిస్తే ఇప్పటి పిల్లల్లో చురుకుదనం అధికం. కంప్యూటర్, స్మార్ట్ టీవీలు, సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగం అప్పట్లో చాలా తక్కువ. తల్లిదదండ్రుల ఆర్థిక స్థోమత కూడా అంతంతే. ఈ కారణంగా నాటి పిల్లలు నాన్ ఎలక్ట్రానిక్ గేమ్స్‌కే పరిమితం. పల్లె, వార్డు, చుట్టపక్కల ఇళ్లతోనే అనుబంధం ముడిపడి ఉండేది. స్కూలు, ఊరు మినహా ఇతర ప్రపంచం తెలియని పరిస్థితి. ఇప్పటి పరిణామాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఇంటర్నెట్ ప్రపంచంలో 'స్మార్ట్' వస్తువుల వినియోగం పెరిగింది. దాదాపు అన్ని ఇళ్లలో స్మార్ట్ టీవీలు కనిపిస్తున్నాయి. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులు అనివార్యం కావడంతో ప్రతీ చిన్నారికి తల్లిదండ్రులు ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు కొనిపెట్టారు. ఇంకొందరు తల్లిదండ్రులు వారి స్మార్ట్‌ఫోన్లను పిల్లలకు ఇచ్చి క్లాస్‌లు వినేలా చేశారు. దీంతో విద్యార్థులందరికీ వీటి వినియోగంపై పట్టు వచ్చింది. యూట్యూబ్‌లో స్పోర్ట్స్, ఇతర అంశాల వీడియోలు, షార్ట్స్ చూడటం పెరిగింది. మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్ చివరకు అమ్మాయిలు కోన్ పెట్టుకోవాలన్నా యూట్యూబ్‌లో వీడియోలు చూసే స్థితికి వచ్చారు. దీంతో ప్రపంచం మొత్తం అరచేతిలోని 'స్మార్ట్‌ఫోన్', ఇంట్లోని 'స్మార్ట్ టీవీ'లోకి వచ్చింది. ఏ దేశం పేరు యూట్యూబ్‌లో టైప్ చేసినా అక్కడి ఫుడ్, కల్చర్, సిటీలైఫ్ అన్నీ క్షణాల్లో చూస్తున్నారు. దీంతో పిల్లలు తల్లిదండ్రులతో 'మమ్మీ ఆ కంట్రీ చాలా బాగుంటుంది.. అక్కడ ఇది చూడొచ్చు.. ఆ కంట్రీలో ఫుడ్ ఇలా ఉంటుంది!' అని చెబుతున్నారు. అంటే ఇంటర్నెట్ వల్ల ప్రపంచం నలుమూలల విషయాలను ఇంట్లో కూర్చుని చిన్నారులు తెలుసుకుంటున్నారు.

తల్లిదండ్రులదీ అదే దారి

ఏడాది పాపకు ఇడ్లీ తినిపించాలని వారి అమ్మ ఫోన్ లేదా టీవీ చూపించి తినిపిస్తోంది. పిల్లలు స్కూలు నుంచి రాగానే టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఓటీటీలు వచ్చాక పాత జనరేషన్‌తో పోల్చితే ఇప్పటి పిల్లలు సినిమాలు కూడా ఎక్కువగా చూస్తున్నారు. అప్పట్లో సినిమా చూడాలంటే థియేటర్‌కు వెళ్లాలి. లేదా ఊళ్లో ఒకరిద్దరికి టీవీలు ఉంటే ఆదివారం వరకూ వేచి చూడాలి. కానీ ఇప్పుడు ఓటీటీల్లో రోజూ సినిమాలు చూసే పరిస్థితి. టెక్నాలజీ ప్రస్తుత జనరేషన్ పిల్లల జీవితంలో విడదీయలేనంతగా భాగమైపోయింది. దీనికి తోడు స్కూళ్లలో కూడా స్క్రీన్, ప్రొజెక్టర్ ద్వారా బోధన చేస్తున్నారు. ఇది కూడా పిల్లల తీరుపై ప్రభావంపై చూపిస్తున్నాయి. గతంలో పిల్లలు తెలుగుమీడియం చదివేవారు. ఇప్పుడు అధికశాతం ఇంగ్లిష్ మీడియం చదువులే. పైగా గతంతో పోలిస్తే పాఠశాల స్థాయి నుంచి హైస్టాండర్డ్స్ ఉన్న సిలబస్‌ను బోధిస్తున్నారు. దీంతో కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెరిగాయి. పెద్దల కంటే పిల్లల్లోనే నాలెడ్జ్ ఎక్కువగా ఉంటోంది. ఇదంతా పిల్లల ఎదుగుదలకు మంచిదే. అయితే వీటితో పాటు ఈ 'లైఫ్ స్టైల్' ప్రమాదాలను కూడా తెచ్చిపెడుతోంది.

పరిమితంగా వాడితేనే ప్రయోజనం



పిల్లలు స్మార్ట్‌ఫోన్లను పరిమితంగా వాడితే చాలా ఉపయోగాలున్నాయి. చదవడం, వినడంతో పాటు తాజా పరిణామాలపై నాలెడ్జ్ పెరుగుతుంది. సాతియా, కామ్, ఆన్‌లైన్ యోగా వంటి ప్లాట్‌ఫాంలు పిల్లల్లో ఆరోగ్యకర వాతవరణాన్ని పెంచుతున్నాయి. పిల్లలు టెక్నాలజీని వారి ఎదుగుదలకు ఉపయోగించుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

– డాక్టర్ మురళీ, చిన్నపిల్లల వైద్యనిపుణులు

చిరాకు.. కోపం నేటి తరంలో ఎక్కువ

ఇప్పటి జనరేషన్ ఎలక్ట్రానిక్ గేమ్స్ ఎక్కువగా ఆడుతున్నారు. మొబైల్, ల్యాప్‌టాప్, టీవీలకు అతుక్కుపోయి అదే ప్రపంచంగా ఎదుగుతున్నారు. నాలెడ్జ్ పక్కన పెడితే వీరి శారీరక దృఢత్వం తగ్గిపోతోంది. ఇది ఆరోగ్యంతో పాటు జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నేటి తరం పిల్లల్లో కోపం, చిరాకు తీవ్రంగా ఉంటున్నాయి. ప్రతీ చిన్న విషయానికి తల్లిదండ్రులపై, స్నేహితులపై ఆవేశపడుతున్నారు.

- పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల తీరే దీనికి కారణమవుతోంది.
- దీనివల్ల ఇతరులతో సులభంగా గొడవలకు దిగడం, చిన్న వయస్సులోనే ఆత్మహత్యలు చేసుకోవడం, ఇంట్లో బ్రదర్స్, సిస్టర్స్ ఉంటే నెలకు రెండు, మూడు సార్లు నాలుగైదు రోజుల పాటు మాట్లాడకుండా దూరంగా ఉండటం జరుగుతోంది.
- ఇవన్నీ కూడా జీవన విధానంలోని మార్పుతోనే జరుగుతున్నాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943